



ESTD: 1999
www.voodayam.com

# వుదయం

ఖమ్మం | 13-03-2026 శుక్రవారం | సంపుటి : 13 | సంచిక : 244 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal | Follow us on






## 500 ఎంఎన్‌సిలను తీసుకువస్తాం

నెట్‌ఫ్లిక్స్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్టే

- ఆ ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి
- దిగ్గజ కంపెనీలకు అన్ని సదుపాయాలు కల్పిస్తాం
- కంపెనీలకు రక్షణ ప్రభుత్వ బాధ్యత
- నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే నగరానికి హాలీవుడ్ వచ్చినట్లే : సీఎం రేవంత్ రెడ్డి





**హైదరాబాద్, మార్చి 12 (వుదయం ప్రతినిధి) :** ప్రపంచంలో ఉన్న ఐదొందల పెద్ద మల్టీనేషన్ కంపెనీలను తెలంగాణ కు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆయా కంపెనీలకు అవసరమైన స్థలం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు పూర్తి రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. వ్యాపారం అంటేనే తెలం గాణ.. తెలంగాణ అంటేనే వ్యాపారం అనే స్థాయికి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియో కార్యాలయాన్ని హైటెక్ సిటీలో సీఎం రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. విశ్వ నగరంగా మారుతున్న హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి సంస్థలు క్యూ కడుతున్నాయని చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రభుత్వాల ప్రోత్సాహకాలు, అనువైన పరిస్థితులు, మానవ వనరులు సహా ఎన్నో సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. దీంతో ఎన్నో గ్లోబల్ కంపెనీలు.. హైదరాబాద్‌లో తమ బ్రాంచ్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా.. విదేశీ వేదికలపై హైదరాబాద్ నగరానికి ఉన్న అవకాశాలను వివరిస్తూ.. ఆయా కంపెనీలను ఆకర్షిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ సంస్థ వచ్చింది. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే మన నగరానికి హాలీవుడ్ వచ్చినట్లేనని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనే ఉందని తాను గతంలోనే చెప్పానని గుర్తు చేశారు.

మిగతా 2లో

## ఇరాన్ విజృంభణ

### భీతావహంగా మారిన పశ్చిమాసియా యుద్ధ రంగం

నిరంతరాయంగా దాడులు ప్రతిదాడులు

దుబాయ్ పై గురిపెట్టిన ఇరాన్

చమురు నౌకలను ధ్వంసం చేసి సంక్షోభాన్ని పెంచే దిశగా దాడులు హోర్ముజ్ మూసివేత

ఇజ్రాయెల్ తో హోరాహోరీ పోరు



గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలు మూసివేయాలి : ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా వార్నింగ్

3



### హోర్ముజ్ నుంచి ముంబైకి

ఇరాన్ అనుమతితో సురక్షితంగా చేరుకున్న భారతీయ చమురు నౌక షెన్లాంగ్ సూయెజ్‌మాక్స్

- హోర్ముజ్ లో ఇంకా భారత జెండా గల 28 నౌకలు
- ఇందులో 677 మంది నావికులు
- షెన్లాంగ్ నౌకలో 1,35,335 మెట్రిక్ టన్నుల క్రూడాయిల్

**న్యూఢిల్లీ, మార్చి 12 (వుదయం) :** ఇరాన్–యుఎస్ సంఘర్షణ ప్రారంభమైన తర్వాత హోర్ముజ్ జలసంధి గుండా భారత్‌కు తొలి నౌక చేరింది. సౌదీ అరేబియా ముడి చమురును మోసుకువస్తున్న లైబీరియా జెండాతో ప్రయాణిస్తున్న షెన్లాంగ్సూ యెజ్ మాక్స్ గురువారం ముంబై రేవును చేరు కుంది. మార్చి 1న సౌదీ అరేబియాలోని రస్ తనూరా రేవు నుంచి ముడిచమురు నింపుకున్న ట్యాంకర్, మార్చి 3న అక్కడ నుంచి బయలుదేరింది. మారిటైం ట్రాకింగ్ డాటా ప్రకారం మార్చి 8న హోర్ముజ్ జలసంధిలో కనిపించిన ఈ నౌక తర్వాత ట్రాకింగ్ వ్యవస్థల నుంచి మాయమైంది. జలసంధిలో అత్యధిక రిస్క్ ఉన్న ప్రాంతంలో నౌక తన ఆటోమేటిక్ ఐడెంటి ఫికేషన్ సిస్టం (ఎఐఎస్) ను స్విచ్ ఆఫ్ చేసుకున్నట్టు తెలుస్తోంది. తిరిగి మార్చి 9న అది ట్రాకింగ్ వ్యవస్థల పరిధిలో కనిపించిందని ఎఎన్ఐ వార్తా సంస్థ వెల్లడించింది. ట్రాన్స్‌పాండర్ అనేది తప్పనిసరి సముద్ర విహెచ్ ఎఫ్ రేడియో వ్యవస్థ.

మిగతా 2లో

## 16 న విచారణకు రావాలని కవితకు ఢిల్లీ హైకోర్టు నోటీసు



**హైదరాబాద్, మార్చి 12 (వుదయం ప్రతినిధి) :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల ఊరట లభించిందనుకున్న మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మళ్లీ చట్టపరమైన చిక్కులు మొదలయ్యాయి. ఈ కేసులో కవిత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా సహా 23 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన అప్పీల్‌పై ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లో ఉన్న కవిత నివాసానికి చేరుకున్న సీబీఐ అధికారులు.. ఆమెకు ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన తాజా నోటీసులు అందజేశారు. ఈ నెల 16 న విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. అదే సమయంలో కవిత ఇంట్లో అందుబాటులో లేకపోవడంతో.. నోటీసులను ఆమె భర్త అనిల్ కుమార్‌కు అందజేసి, ఆమె ఎక్కడ ఉన్నారనే వివరాలను ఆరా తీశారు. దీంతో ఈ కేసు మరోసారి తెరపైకి వచ్చింది.

*గతనెల 27న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు క్లీన్ చిట్*

ఢిల్లీ లిక్కర్ పాలసీలో అవకతవకలు జరిగాయని, 'సౌత్ గ్రూప్' తరపున కవిత కీలక పాత్ర పోషించారనే ఆరోపణలతో దర్యాప్తు సంస్థలు విచారణ జరిపాయి.

మిగతా 2లో

## పెట్టుబడుల రాకతో శాంతి భద్రతలకు ప్రాధాన్యం

- ప్రభుత్వ లక్ష్యసాధనలో భాగస్వాములుకండి
- త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీసుల పాత్ర కీలకం
- పోలీస్ శాఖలో దశలవారీగా వినియోగంలో ఎలక్ట్రిక్ వాహనాలు
- రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కి రూరల్ అగ్రి రీజియన్ పై దృష్టి

ప్రీ–బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, మార్చి 12 (ఎఎంఎస్) :** కాంగ్రెస్ పాలనలో తెలంగాణ 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వ ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి హోంశాఖ, పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కీలకం అన్నారు. ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వొద్దన్నారు. ప్రతి కదలిక పోలీసుల కను సన్నల్లో ఉండాలని సూచించారు. విధుల నిర్వహణ క్రమంలో హోం శాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉంటుందన్న భట్టి.. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీసీ కెమెరాల వినియోగాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని చిన్న కదలికను సైతం వేను వెంటనే గుర్తించి నిఘాను పటిష్టం చేయాలన్నారు.

మిగతా 2లో

## స్పీకర్ నిర్ణయంతో సుప్రీం ఏకీభావం

- ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొన్న ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టులోనూ క్లీన్ చిట్
- అనర్హత పిటిషన్లను స్పీకర్ పరిష్కరించారని ప్రకటన



**హైదరాబాద్, మార్చి 12 (ఎఎంఎస్) :** రాష్ట్ర రాజకీయాలను కుదిపేసిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వివాదానికి తెరపడింది. ఫిరాయింపుల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలందరికీ దేశ అత్యున్నత న్యాయస్థానం క్లీన్‌చిట్ ఇచ్చింది. ఎమ్మెల్యేల అనర్హతపై ఇప్పటికే అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయంతో ఏకీభవించింది. ఇక ఈ పిటిషన్‌పై విచారణ జరపాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. దీంతో ఆరోపణలు ఎదుర్కొంటోన్న పది మంది ఎమ్మెల్యేలకు భారీ ఊరట లభించింది. మరోవైపు ఈ క్రమంలోనే స్పీకర్ నిర్ణయంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. 2023లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై బీఆర్ఎస్ పార్టీ స్పీకర్, సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ ఫిరాయింపుల పిటిషన్లపై విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సుప్రీంకోర్టు గడువు విధించడంతో.. ఈ నెల 11న స్పీకర్ తన తుది నిర్ణయాన్ని వెల్లడించారు.

మిగతా 2లో

## హస్తానికి అండగా దళితులు

- కాంగ్రెస్ పాలనలో దళితులకు, ఆదివాసీలకు, బీసీలకు సముచిత స్థానం
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, మార్చి 12 (వుదయం ప్రతినిధి) :** సుదీర్ఘ ఘన. చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం దళితవాదంతోనే జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. దేశంలో అన్ని వర్గాలకు ఒకే రకమైన పాలన అందిస్తోన్న హస్తం.. పార్టీలోనూ సమన్యాయం పాటిస్తోందని చెప్పారు. ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా హస్తం ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. రెడ్డికి సీఎం, బిసికి పీసీసీ అధ్యక్ష పదవి, దళితులకు డిప్యూటీ సీఎం, స్పీకర్ పదవి, నాలుగు మంత్రి పదవులు కేవలం కాంగ్రెస్‌లో మాత్రమే సాధ్యం అన్నారు. 90 ఏళ్ల తర్వాత కుల సర్వే చేసి అఫిషియల్ డాక్యుమెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు.

మిగతా 2లో

## సిఇసిని తొలగించాలి

### పార్లమెంట్‌కు నోటీసు ఇవ్వనున్న ఇండీ కూటమి

నోటీసుపై సంతకాలు చేసిన 130 మంది లోక్‌సభ, 63 మంది రాజ్యసభ సభ్యులు ● ఆప్ సభ్యులు కూడా సంతకాలు చేసినట్టు సమాచారం




**న్యూఢిల్లీ, మార్చి 12 (వుదయం) :** ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్‌ను తొలిగించాలని కోరుతూ మొత్తం 130 మంది లోక్‌సభ ఎంపీలు, 63మంది రాజ్యసభ ఎంపీలు నోటీసుపై సంతకాలు చేసినట్టు పార్లమెంటు వర్గాలు తెలిపాయి. ఈ నోటీసును శుక్రవారం నాడు కనీసం ఒక సభ లో అయినా సమర్పించాలని వారు భావిస్తున్నట్టు తెలు స్తోంది. ఇలా ఉండగా, ఎంపీలు నోటీసుపై సంతకం చేయ డంలో ఎంతో ఉత్సాహం చూపించారని, అవసరమైన సంఖ్యను ఇప్పటికే సాధించినప్పటికీ, గురువారం కూడా అనేక మంది శాసనసభ్యులు నోటీసుపై సంతకం చేయడానికి ముందుకు వచ్చారని ప్రతిపక్ష నాయకుడు ఒకరు అన్నారు. నిబంధనల ప్రకారం, లోక్‌సభలో సిఇసి తొలిగింపు నోటీసు ఇచ్చేందుకు 100మంది ఎంపీలు సంతకం చేయాలి, రాజ్యసభలో వారి బలం 50 ఉండాలి. నోటీసుపై ఇండీ కూట మి పార్టీల సభ్యులందరూ సంతకాలు చేశారు. అధికారికంగా కూటమిలో భాగం కాకపోయినప్పటికీ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీలు కూడా నోటీసుపై సంతకం చేసినట్టు ఆ వర్గాలు తెలిపాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ తొలిగింపును కోరుతూ నోటీసు ఇవ్వడం ఇదే తొలిసారి. ఉన్నత స్థానంలో ఉన్న ఒక మూలం ప్రకారం, నోటీసులో సిఇసిపై ఏడు అభియోగాలు నమోదు చేశారు. వాటిలో పనిలో పక్షపాత, వివక్షతతో కూడిన ప్రవర్తన నుంచి ఎన్నికల మోసం దర్యాప్తును ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం, సామూహికంగా ఓట్ల తొలగింపు వరకు ఉన్నాయి.

మిగతా 2లో

## ఫారుక్ అబ్దుల్లాపై కాల్పులు

### భద్రతా సిబ్బంది అప్రమత్తతతో జమ్మూ-కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి సురక్షితం



**జమ్మూ కశ్మీర్, మార్చి 12 (వుదయం) :** మద్యం ప్రభావంలో ఉన్న ఒక వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి ఫారూక్ అబ్దుల్లాపై కాల్పులు జరిపి హత్య చేసేందుకు యత్నించాడు. బుధవారం నాడు ఒక వివాహ వేడుకలో జరిగిన ఈ ఘటనలో భద్రతా సిబ్బంది అప్రమత్తతే మాజీ ముఖ్యమంత్రి ప్రాణాలను కాపాడింది. నిందితుడిని తక్షణమే అదుపులోకి తీసుకున్నారు. కాగా, తాను 20 ఏళ్లుగా ఫారూక్‌ను చంపాలనుకుంటున్నానని అతడు వారికి చెప్పడం ఆశ్చర్యం. బుధవారం జమ్మూ శివార్లలో జరిగిన ఓ వివాహ వేడుకకు ఫారూక్ అబ్దుల్లా హాజరయ్యారు. ఆయనతో పాటు జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ ఛౌదరీ కూడా ఉన్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వెనక నుంచి ఫారూక్‌పై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తుపాకీతో కాల్చేందుకు ప్రయత్నించాడు.

మిగతా 2లో

## ఒయుకి రూ. 1000 కోట్లు

సిద్ధమవుతోన్న రూట్ మ్యాప్ ● ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణాకు ఐకాన్ ● మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 12 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక ఐకాన్ గా నిలిచిన ఉస్మానియా విశ్వవిద్యాలయం అభివృద్ధికి రూ. వెయ్యి కోట్లతో రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రఖ్యాత విశ్వవిద్యాలయం మన రాష్ట్రంలో ఉండడం మనకెంతో గర్వకారణమని చెప్పారు. అంతటి పేరెన్నికగన్న ఉస్మా నియా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగంలో ఆయన నిర్మాణ్–26 సాంకేతిక సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 1917 లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు.అందుకు కొనసాగింపుగా 1929 లో విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రారంభం అయిన ఇంజినీరింగ్ కళాశాల యావత్ భారతదేశంలోనే అత్యంత ప్రాశస్త్యమైన కళాశాలలలో ఆరవ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. అంతటి ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయం అభివృద్ధికీ ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించడమే కాకుండా సీఎం రేవంత్ రెడ్డి ఏకంగా రూ. వెయ్యి కోట్లు నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలి అన్నదే ప్రభుత్వ సంకల్పం అన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి... దానికనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి విశ్వవిద్యాలయంలో అవసరమైన అధ్యాపకుల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఇక్కడి నుండి ఎంతో మేధో సంపద ఉత్పత్తి అయిందని ఆ మేధస్సు ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్న మెజారిటీ ఇంజినీర్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండే ఎదిగిన వారు అన్నారు. గల్లీ నుండి డిల్లో స్థాయికి ఎదిగిన నేతలు,క్రీడాకారులు,ఉన్నత పదవులు చేపట్టిన వారి అడుగులు ఇక్కడి నుండే మొదలు అయ్యాయని ఆయన చెప్పారు. అలాంటి విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అగ్రభాగాన నిలుచోవడమే కాకుండా విద్యార్థులు చేసిన త్యాగాలు ఇక్కడ ప్రస్తావనర్హమే అని భావిస్తున్నానని ఆయన చెప్పారు. ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలలో కుడా భాగస్వామ్యం కావాలని ఆయన ఉద్బోధించారు.

మిగతా 2లో

# సిఇసిని తొలగించాలి

**మొదటి పేజీ తరువాయి..**

ప్రతిపక్ష పార్టీలు అనేక సందర్భాల్లో అధికార బిజెపికి సిఇసి సహాయం చేస్తోందని ఆరోపించాయి. ముఖ్యంగా ప్రస్తుతం జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) విషయంలో, కేంద్రంలోని పార్టీకి సహాయం చేయడమే లక్ష్యంగా ఈ సవరణ జరిగిందని వారు ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ నిర్వహణపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోల్ ప్యానెల్ నిజమైన ఓటర్లను తొలగిస్తోందని ఆరోపించారు. సిఇసి తొలగించే ప్రక్రియ సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తిని తొలగింపు ప్రక్రియను పోలి ఉంటుంది. అంటే నిరూపితమైన దుష్ప్రవర్తన లేదా అసమర్థత కారణంగా మాత్రమే అభిశంసనను అమలు చేయవచ్చు. తొలగింపు తీర్మానాన్ని పార్లమెంటులోని ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు. ప్రత్యేక మెజారిటీతో – సభలోని మొత్తం సభ్యులలో మెజారిటీ, హాజరై ఓటు వేసే సభ్యులలో మూడింట రెండు వంతుల మెజారిటీతో దానిని ఆమోదిస్తారు. సిఇసి, ఎన్నికల కమిషనర్ల నియామకంపై చట్టం ప్రకారం, సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించడానికి ఉన్న ఆధారాలు, అటువంటి కారణాల వల్ల తప్ప సిఇసిని అతని కార్యాలయం నుంచి తొలగించకూడదని, ఇతర ఎన్నికల కమిషనర్లను సిఇసి సిఫార్సుపై తప్ప పదవి నుంచి తొలగించకూడదు. న్యాయమూర్తుల (విచారణ) చట్టం, 1968 ప్రకారం, పార్లమెంటు ఉభయ సభలలో ఒకే రోజున తీర్మానానికి నోటీసులు ఇస్తే, తీర్మానాన్ని ఉభయ సభలలో ఆమోదించకపోతే ఎటువంటి కమిటీని ఏర్పాటు చేయకూడదు. తీర్మానాన్ని ఉభయ సభలలో ఆమోదించిన తర్వాత, స్పీకర్, ఛైర్మన్ సంయుక్తంగా ఒక కమిటీని ఏర్పాటు చేయాలి.

# ఫారుక్ అబ్దుల్లాపై కాల్పులు

**మొదటి పేజీ తరువాయి..**

దీనికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు కూడా తాజాగా వెలుగులోకి వచ్చాయి. నిందితుడు జమ్మూకి చెందిన 63 ఏళ్ల కమల్‌సింగ్ జమ్వాల్‌గా పోలీసులు గుర్తించారు. జమ్మూలో దుకాణాలు నడుపుతోన్న కమల్ విచారణ సమయంలో కీలక విషయాలు వెల్లడించాడు. గత 20 ఏళ్లుగా తాను ఫరూక్ అబ్దుల్లాను చంపాలనుకుంటున్నానని పేర్కొన్నాడు. ఇది తన వ్యక్తిగత అజెండాగా వెల్లడించాడు. కాల్పులకు ఉపయోగించిన తుపాకీకి లైసెన్స్ ఉన్నట్లు తెలిపాడు. ఘటన సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు. తుపాకీని స్వాధీనం చేసుకున్నామని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇలా ఉండగా, తన తండ్రిపై జరిగిన హత్యాయత్నంపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందించారు. లోడ్ చేసిన తుపాకీతో తన తండ్రిని ఓ వ్యక్తి కాల్చేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. అయితే, భద్రతా సిబ్బంది అప్రమత్తతతో అది విఫలమైందన్నారు. ఫరూక్‌కు జెడ్ ప్లస్ భద్రత ఉన్న విషయాన్ని ఒమర్ ప్రస్తావించారు. ఇంత భద్రత ఉన్నా.. నిందితుడు అంత దగ్గరగా ఎలా రాగలిగాడని ప్రశ్నించారు. ఇక, భద్రతా వైఫల్యం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుందని ఉప ముఖ్యమంత్రి చౌదరి పేర్కొన్నారు.

# 500 ఎంఎన్‌సిలను తీసుకువస్తాం

**మొదటి పేజీ తరువాయి..**

నెట్‌ఫ్లిక్స్ రాకతో తన కల నిజం కాబోతుందని ఆనందం వ్యక్తం చేశారు. తాను బాల్యంలో ఉన్నప్పటి నుంచే తనకు సినిమాలు అంటే ఎంతో ఇష్టమని సీఎం వివరించారు. ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ కార్యాలయాన్ని తన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సినిమా రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని.. బాహుబలి, కల్కి, ఆర్ఆర్ఆర్, అరుంధతి వంటి సినిమాలను తీశారని పేర్కొన్నారు. మద్రాకు కేంద్రంగా ఉన్న సినిమా ఇండస్ట్రీని ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వర్ రావు.. హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తు చేశారు. కాలంతో పాటు సినీ ఇండస్ట్రీలో ఎన్నో మార్పులు వచ్చాయని తెలిపారు. నెట్‌ఫ్లిక్స్ సంస్థ తమ వ్యాపారాన్ని విస్తరించేందుకు విశాలమైన ఆఫీస్ నిర్మించుకునేందుకు కావాల్సిన భూమిని.. కొత్తగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి తమ ప్రభుత్వం రెడీగా ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీకి నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను తీసుకురావాలని కోరుతున్నట్లు చెప్పారు.



# స్పీకర్ నిర్ణయంతో సుప్రీం ఏకీభావం

**మొదటి పేజీ తరువాయి..**

ఈ క్రమంలో పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారు. ఆ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ.. తాజాగా మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పార్టీ ఫిరాయించిన తమ పార్టీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ నేతలు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై సుదీర్ఘంగా విచారణ చేపట్టిన జస్టిస్ సంజయ్ కరోల్ నేపథ్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం తుది తీర్పు ఇచ్చింది. సుప్రీంలో ఈ కేసు విచారణ సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. పార్టీ ఫిరాయింపులు, ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి ఇప్పటికే దాఖలు చేసిన పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ జరిపారని కోర్టుకు నివేదించారు. వాటిపై తగిన నిర్ణయం తీసుకుని.. ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్ ఇచ్చిన విషయాన్నిసింఘ్వీ కోర్టుకు విన్నవించారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను తెలంగాణ స్పీకర్ కార్యాలయం పరిష్కరించినట్లు చెప్పారు. ఈ వ్యవహారంలో అభిషేక్ మను సింఘ్వీ చేసిన వాదనలతో జస్టిస్ సంజయ్ కరోల్ బెంచ్ ఏకీభవించింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే స్పీకర్ తుది నిర్ణయం తీసుకుని.. తన తీర్పును వెలువరించినందున.. ఇక ఈ పిటిషన్లపై విచారణ జరపాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ ముగిసినట్లు వెల్లడించింది. అదే సమయంలో తెలంగాణ స్పీకర్ తన తీర్పు కాపీలను.. ఫిర్యాదుదారులకు 2 రోజుల్లో ఇవ్వాలని సుప్రీంకోర్టు సూచించింది.

## పెట్టుబడుల రాకతో
# శాంతి భద్రతలకు ప్రాధాన్యం

**మొదటి పేజీ తరువాయి..**

అందుకు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలన్నారు. దానికి అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. 2047 త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష సాధనలో పబ్లిక్, ప్రైవేట్ మోడల్ అనివార్యమని భట్టి అభిప్రాయపడ్డారు. ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని పరిశ్రమల శాఖ అధికారులకు సూచించారు. క్యూర్, ప్యూర్‌తో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రేర్ (రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ) సమ ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం సూచించారు. రేర్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. మైక్రో, స్మాల్, మీడియం ఇండస్ట్రీల (ఎంఎస్ఎంఈ) ను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనేది ప్రజా ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. ఎంఎస్ ఎంఈల ద్వారా రాష్ట్ర నలుమూలలోని యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి తో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న రంగం ఎంఎస్ఎంఈ అన్నారు. 41 జీసీసీలతో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని గుర్తు చేశారు. ఇదే వేగాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. డాటా సెంటర్లలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) వినియోగాన్నిపెద్ద ఎత్తున చేపట్టాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సీవీ ఆనంద్,తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాలు సంస్థ ఎండి శశాంక డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

# హోర్ముజ్ నుంచి ముంబైకి

**మొదటి పేజీ తరువాయి..**

ఇది ఓడ గుర్తింపు, ఎక్కడ ఉంది, వేగం, గమనాన్ని సమీపంలోని ఓడలు, తీర స్టేషన్‌లకు స్వయంచాలకంగా ప్రసారం చేస్తుంది, ఇది తీరంలో వేరే నౌకలను ఢీకొనకుండా నిరోధించడానికి, నావిగేషన్‌ను మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఈ నౌక బుధవారం మధ్యాహ్నం 1 గంటలకు ముం బై ఓడరేవుకు చేరుకుంది. సాయంత్రం 6:06 గంటలకు జవహర్ ద్వీపంలో లంగరు వేసింది. ఇది 1,35,335 మెట్రిక్ టన్నుల ముడి చమురును మోసుకువస్తోంది. దీనిని తూర్పు ముంబైలోని మహుల్‌లోని శుద్ధి కర్మాగారాలకు సరఫరా చేస్తారు. ముడి చమురు విడుదల ప్రక్రియకు దాదాపు 36 గంటలు పట్టవచ్చని అంచనా. ఈ ట్యాంకర్ షెన్‌లాంగ్ షిప్పింగ్ లిమిటెడ్ యాజమాన్యంలో ఉంది. దీనిని ఏథెన్స్‌కు చెందిన డైనకామ్ ట్యాంకర్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. ఈ నౌకలో భారతీయ, పాకిస్తానీ, ఫిలిప్పీన్స్ జాతీయులతో సహా 29 మంది సిబ్బంది ఉండగా, ఒక భారతీయుడు కెప్టెన్‌గా ఉన్నాడు. అంతకుముందు, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) నావల్ ఫోర్స్ కమాండర్ మాట్లాడుతూ, వ్యూహాత్మకంగా కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించాలనుకునే ఓడలు ఇరాన్ ఆమోదం పొందాలి లేదా ఇరాన్ దాడులకు లక్ష్యంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ హెచ్చరికలను విస్మరించిన రెండు నౌకలను జలసంధిలో బుధవారం లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్టు రేర్ అడ్మిరల్ అలీరెజా తంగ్సిరి తెలిపారు.

హోర్ముజ్ జలసంధి గుండా నౌకలు సురక్షితంగా ప్రయాణించగలవని హామీ ఇచ్చారా? ఈ ప్రశ్న ఎక్స్‌ప్రెస్ రోమ్, మయూరీ నరీ అనే నౌకల సిబ్బందిని అడగాలి. వారు నేడు ఖాళీ వాగ్దానాలను నమ్మి, హెచ్చరికలను విస్మరించి జలసంధిని దాటాలని అనుకున్నారు, కానీ పట్టుబడ్డారు. ఏదైనా నౌక దాటాలనుకుంటే ఇరాన్ నుండి అనుమతి పొందాలి అని ఇరాన్ జనరల్ ఎక్స్‌పై ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. థాయ్ జెండా కలిగిన కార్గో నౌక మయూరీ నరీ గుజరాత్‌లోని కాండ్లా ఓడరేవు వైపు ప్రయాణిస్తోంది. ఇరాన్ ప్రభుత్వ మీడియా ప్రకారం, హోర్ముజ్ జలసంధి గుండా నౌకల ప్రయాణంపై ఆంక్షలను ఇరాన్ తీవ్రతరం చేసింది. ముఖ్యంగా, యునైటెడ్ స్టేట్స్, ఇజ్రాయెల్ ప్రయోజనాలకు మేలు చేయని ఓడలు జలసంధి గుండా సురక్షితంగా ప్రయాణించవచ్చని చెప్పింది.

మధ్యప్రాచ్యంలో షిప్పింగ్, ఇంధన మౌలిక సదుపాయాలపై ఇరాన్ నిరంతర దాడుల కారణంగా చమురు ధరలు చుక్కలనంటుతున్నాయి.

ఇరాన్ తీరాన్ని ఒమన్ నుండి వేరుచేసే ఇరుకైన జలసంధి ద్వారా ప్రతిరోజూ 20 మిలియన్ బ్యారెళ్లకు పైగా ముడి చమురు వెళుతుంది. ఆ పరిమాణం ప్రపంచ చమురు వినియోగంలో దాదాపు ఐదవ వంతు, సముద్రమార్గ చమురు వాణిజ్యంలో దాదాపు పావు వంతును సూచిస్తుంది. ప్రపంచంలోని ద్రవీకృత సహజ వాయువులో గణనీయమైన వాటా కూడా అదే మార్గం గుండా వెళుతుంది. ఈ పడవల ప్రయాణం తగ్గినప్పుడు, దాని పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మార్కెట్లు, సరఫరా గొలుసులు, గృహ బడ్జెట్‌ల వరకూ విస్తరిస్తాయి.





ఇదిలా ఉండగా, భారత షిప్పింగ్ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి బుధవారం మాట్లాడుతూ, ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 28 భారత జెండాతో కూడిన నౌకలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 24 నౌకలు హోర్ముజ్ జలసంధికి పశ్చిమాన 677 మంది భారతీయ నావికులతో ఉన్నాయి, నాలుగు నౌకలు జలసంధికి తూర్పున 101 మంది భారతీయ నావికులతో ఉన్నాయి. వారి భద్రత, రక్షణను చురుగ్గా పర్యవేక్షిస్తున్నట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. పరిణామాలను పర్యవేక్షించడానికి, సహాయాన్ని సమన్వయం చేయడానికి ఫిబ్రవరి 28, 2026 నుండి మంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఆధ్వర్యంలో 24 గంటల కంట్రోల్ రూమ్ పనిచేస్తోంది. అధికారులు, షిప్ మేనేజర్లు, రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు భారత రాయబార కార్యాలయాలు, స్థానిక అధికారులతో సన్నిహితంగా సమన్వయం చేసుకుని భద్రతను నిర్ధారించడానికి, అవసరమైన చోట భారతీయ నావికులకు సహాయం అందిస్తున్నాయి.

## నాణ్యమైన విద్య అందిస్తే
# సంక్షేమ పథకాలతో పని లేదు



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అదే ఆలోచనతో విద్యా విధానంలో మార్పులు తెస్తున్నాం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ టు 12 తరగతి విధానం
- వచ్చే ఏడాది తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు
- అల్పాహారం, భోజనం, రవాణా సదుపాయం కల్పిస్తాం
- రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మంది మహిళల హెల్త్ డేటా నమోదు
- మహిళలందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు ఇస్తాం

**హైదరాబాద్, మార్చి 12 (వుదయం ప్రతినిధి) :** విద్యను సక్రమంగా అందిస్తే పేదలకు సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. చదువే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. అందుకే తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి తొలి ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. గురువారం హైదరాబాద్ లోని కోకాపేట్ లో మెడికవర్ హాస్పిటల్ ను ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అన్ని వర్గాలకు నాణ్యమైన విద్యను అందించాలన్న ఆలోచనతో విద్యా విధానం లో మార్పులు తెస్తున్నట్లు సీఎం తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి 12 తరగతి విధానం తీసుకువస్తామని ప్రకటించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, భోజనం తో పాటు రవాణా సదుపాయం కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితం గా లేదా 50 శాతం రాయితీతో రవాణా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఏ ప్రాంతమైనా అక్కడి మహిళల ఆరోగ్యం బాగుంటే కుటుంబం బాగుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మంది హెల్త్ డేటాను తయారు చేస్తున్నట్లు వివరించారు. 20 ఏళ్ల ఆరోగ్య శ్రీ డేటా ను ఉపయోగించి డేటా తయారు చేస్తున్నామన్న సీఎం త్వరలోనే మహిళలందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం క్యాన్సర్ పై ప్రధాన దృష్టి పెట్టిందని చెప్పారు. ఈ అంశంపై అధ్యయనం, లక్ష్యాసాధన కోసమే ప్రముఖ క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయ ను సలహాదారుడిగా నియమించినట్లు సీఎం తెలిపారు. నిరుపేదలకు వరంగా మారిన ఆరోగ్య శ్రీ,, సీఎంఆర్ ఎఫ్ పథకాల కోసం ఇప్పటి వరకు రూ. 1800 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం వెల్లడించారు. తాజాగా ఉస్మానియా, టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 10 వేల కోట్లు ఖర్చు పెడుతున్నట్లు వివరించారు. వైద్యం ఖర్చులు సామాన్యులు భరించలేని విధంగా పెరిగిపోయాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ రంగం లో ఉన్న డాక్టర్ లు ఏడాదిలో ఒక నెల ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాలని కోరారు. రాష్ట్రంలో కోటి ముప్పై లక్షల కుటుంబాలకు జీవిత బీమా అందించాలని భావిస్తున్నట్లు సీఎం వివరించారు. వైద్యం యాంత్రికం గా ఉండొద్దన్న సీఎం.. మానవత్వం తో కూడిన వైద్య సాయం అందించాలని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు సూచించారు. దేశంలో హైదరాబాద్ నుంచి 40 శాతం ఫార్మా ఉత్పత్తులు నమోదయ్యాయన్నారు. కరోనా వాక్సిన్ ల్లో మూడు మన జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి కావడం మనకు గర్వ కారణమన్నారు.

**దేశంలో..తెలుగు సినిమాదే కీలక పాత్ర....**

భారతదేశ సినిమా అభివృద్ధిలో తెలుగు సినిమాదే కీలక పాత్ర అని సీఎం రేవంత్ రెడ్డి కితాబిచ్చారు. ఇది వినోదంతో పాటు మధ్యతరగతి ప్రజలను ప్రభావితం చేస్తుందన్నారు. ఐటీ, ఫార్మాతో పాటు సినిమా ఇండస్ట్రీని కూడా ప్రభుత్వం గొప్ప పరిశ్రమగా భావిస్తోందని సీఎం చెప్పారు. చిత్రపరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ లోని కోకాపేటలో అల్లు అర్జున్ 'అల్లు సినిమాస్'ను సీఎం రేవంత్ రెడ్డి గురువారం రాత్రి ప్రారంభించారు. స్క్రీన్లను పరిశీలించి.. అల్లు రామలింగయ్య విగ్రహానికి సీఎం నివాళులు అర్పించారు. ఈ ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తెలుగు సినిమా ఇప్పుడు హాలీవుడ్‌తో పోటీ పడుతోందన్నారు. హాలీవుడ్ సినిమాలు హైదరాబాద్‌లో షూటింగ్ చేసేస్థాయికి తీసుకెళ్లే స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కాలేజీ రోజుల్లో తాను చాలా సినిమాలు థియేటర్లలో చూశానని చెప్పారు. లారీల్లో వెళ్లి సినిమాలు చూసి తిరిగొచ్చేవాళ్లమన్నారు. ఒకప్పుడు సూపర్ స్టార్ కృష్ణ ఏడాదికి నాలుగైదు సినిమాలు తీసేవారన్నారు. ఇప్పుడు స్టార్ హీరోలంతా ఏడాకొకటి, రెండేళ్లకో సినిమా తీస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లోని కృష్ణానగర్ చాలా గొప్ప వ్యక్తులను ఇండస్ట్రీకి ఇచ్చిందన్న సీఎం... అల్లు అర్జున్ హాలీవుడ్ లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ఆయన తన టాలెంట్‌ను దేశంలో ప్రూవ్ చేసుకున్నారని చెప్పారు. హాలీవుడ్ సినిమాలతో పోటీ పడేలా ఆయన భవిష్యత్ ఉండాలని రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వైద్యం బలోపేతం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- డిజిటల్ రూపంలో రోగి వైద్య చరిత్ర
- దశల వారీగా రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ వ్యవస్థ
- సంగారెడ్డి లో పైలెట్ ప్రాజెక్టు

**సంగారెడ్డి, మార్చి 12 (వుదయం ప్రతినిధి) :**



రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నట్లు వివరించారు. గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపకల్పన, అమలుపై రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమన్వయ సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సంగారెడ్డి జిల్లాను డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు పైలెట్ జిల్లాగా ఎంపిక చేసిన నేపథ్యంలో, ప్రాజెక్టు అమలు విధానం, ముందస్తు ఏర్పాట్లు, అవసరమైన సాంకేతిక సదుపాయాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టు అమలులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని మొత్తం 64 ప్రభుత్వ వైద్యశాలల్లో సేవలు పొందేందుకు వచ్చే ప్రతి రోగికి సంబంధించిన పూర్తి ఆరోగ్య వివరాలతో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ను రూపొందించి డిజిటల్ హెల్త్ కార్డు జారీ చేయడానికి కసరత్తు చేయాలని మంత్రి ఆరోగ్యశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంగారెడ్డి లో అమలు చేయనున్న ఈ పైలెట్ ప్రాజెక్టును అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ హెల్త్ కార్డు అమలులో సంగారెడ్డి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

**డిజిటల్ రూపంలో రోగి వైద్య చరిత్ర..**

రోగి ఆసుపత్రికి వచ్చిన మొదటి దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ఓపీ, మెడికల్ ఆఫీసర్, ల్యాబ్, ఫార్మసీ వంటి అన్ని విభాగాల్లో రోగి వైద్య చరిత్రను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధంగా అవసరమైన ఐటీ సదుపాయాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని మంత్రి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు సూచించారు. డిజిటల్ హెల్త్ కార్డు ద్వారా రోగి పూర్తి వైద్య చరిత్ర డిజిటల్ రూపంలో అందుబాటులో ఉండటం వల్ల వైద్యులు తక్షణమే సరైన చికిత్స అందించడానికి సౌలభ్యం కలుగుతుందని మంత్రి తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులలో అందిస్తున్న ఎన్‌సీడీ, కమ్యూనికేబుల్ డిసీజెస్, ఎంసిహెచ్, చైల్డ్ హెల్త్ సేవలు, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించి అవసరమైతే రిఫరల్ సిస్టమ్ ద్వారా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.

# సాగుకు 24 గంటల విద్యుత్ అబద్ధం

- మాజీ మంత్రి హరీశ్ రావు
- రైతులకు అందుతోంది 12 గంటలే
- కోహిర్ మండలం దిగ్వాల్ సబ్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**హైదరాబాద్, మార్చి 12 (వుదయం ప్రతినిధి) :**



రాష్ట్రంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నది అబద్ధమని, వాస్తవానికి కేవలం 12 గంటల కరెంట్ మాత్రమే అందుతున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. గురువారం కోహిర్ మండలంలోని దిగ్వాల్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి లాగ్‌బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తున్నామని అబద్ధాలాడుతున్నారని చెప్పారు. లాగ్‌బుక్‌లను పరిశీలిస్తే కేవలం 13 గంటల విద్యుత్ సరఫరా మాత్రమే నమోదైందన్నారు. అందులో కూడా ఎల్‌సి, లైన్ బ్రేక్, ట్రిప్పింగ్ వంటి సమస్యలు తీసేస్తే రైతులకు 12 గంటల కరెంట్ కూడా సరిగ్గా అందడం లేదని ఆరోపించారు. గత కొద్ది రోజులుగా కోహిర్ ప్రాంత రైతులు విద్యుత్ సరఫరా సరిగా లేదని తమకు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేశారని హరీశ్ రావు తెలిపారు. రోజుకు ఐదు నుంచి ఆరు సార్లు కరెంట్ ట్రిప్ అవుతుండడంతో పంటలకు నీరు అందడం లేదని రైతులు బాధపడుతున్నారని చెప్పారు. దిగ్వాల్ సబ్‌స్టేషన్ లాగ్‌బుక్ ప్రకారం ఈ నెల 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు త్రీఫేజ్ కరెంట్ నిలిపివేయగా, 11వ తేదీ ఉదయం 3 గంటలకు మాత్రమే మళ్లీ సరఫరా ప్రారంభమైందన్నారు. అంటే దాదాపు 11 గంటల పాటు కరెంట్ నిలిచిపోయిందని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిందన్నారు. కానీ ప్రస్తుతం కేవలం 12 గంటల కరెంట్ మాత్రమే అందుతున్నదని విమర్శించారు. రైతుబంధు, పంటల బీమా, బోనస్ వంటి పథకాలు కూడా అమలు కావడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ రూ.4,900కి ఇచ్చామని హరీశ్ రావు చెప్పారు. ప్రస్తుతం దాన్ని రూ.9,700కి పెంచారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది వ్యవసాయ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వెంటనే మార్పులు చేయడం లేదని విమర్శించారు. మూడో డిస్కం ఏర్పాటు చేసి అప్పులను మళ్లించే ప్రయత్నం జరుగుతుందని హరీశ్ రావు ఆరోపించారు. ప్రస్తుతం డిస్కంలపై రూ.55 వేల కోట్ల అప్పులు ఉన్నాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 19,647 మంది ఆర్టిజెన్స్ ఆరు నెలలుగా సమ్మె చేస్తున్నారని, వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. చనిపోయిన ఆర్టిజెన్స్ కుటుంబ సభ్యులకు అర్హతల ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు వెంటనే 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లు విడుదల చేయడంతో పాటు డబ్బులు చెల్లించిన ఇండ్లకు మీటర్లు ఏర్పాటు చేయాలన్నారు. రైతుబంధు వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నామని హరీశ్ రావు తెలిపారు.

## 16 న విచారణకు రావాలని
# కవితకు ఢిల్లీ హైకోర్టు నోటీసు


**మొదటి పేజీ తరువాయి..**



ఈ క్రమంలో గతనెల 27న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు సంచలన తీర్పునిచ్చింది. సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో సరైన ఆధారాలు లేవని పేర్కొంటూ కవితతో పాటు అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా 23 మందిని ఈ కేసు నుండి విముక్తి కల్పిస్తూ క్లీన్‌చిట్ ఇచ్చింది. అయితే, ఈ తీర్పును సీబీఐ హైకోర్టులో సవాలు చేయడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది.

**ఐదున్నర నెలలు తిహార్ జైలులో కవిత..**

మార్చి 15, 2024న హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించి, సాయంత్రం వేళ ఆమెను అరెస్ట్ చేసి ఢిల్లీకి తరలించారు. తొలుత ఈడీ కస్టడీలో, ఆ తర్వాత సీబీఐ అరెస్ట్ చేయడంతో కవిత సుమారు ఐదున్నర నెలల పాటు తిహార్ జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు ఆమెకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుతో ఊపిరి పీల్చుకున్న కవితకు.. సీబీఐ హైకోర్టును ఆశ్రయించడం కొత్త తలనొప్పిగా మారింది. ఛార్జిషీట్‌లో పేర్కొన్న ఆధారాలను మరోసారి పరిశీలించాలని, కింది కోర్టు తీర్పును రద్దు చేయాలని సీబీఐ పట్టుబడుతోంది.



# హస్తానికి అండగా దళితులు

**మొదటి పేజీ తరువాయి..**

గాంధీభవన్‌లో గురువారం జరిగిన మాన కొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ టీపీసీసీ ఎస్సీ విభాగ ఛైర్ పర్సన్ గా పదవి స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బరువైన బాధ్యతను నమ్మకంతో సీఎం తో కలిసి కవ్వంపల్లి సత్యనారాయణ పై పెట్టామని చెప్పారు. పీసీసీ బలోపేతం కావాలనే ఉద్దేశ్యం తో కవ్వంపల్లి కి పదవి ఇచ్చినట్లు వివరించారు. అధిష్టానం నమ్మకాన్ని కవ్వంపల్లి వమ్ము చేయరనే ధీమా పార్టీలో సీనియర్లందరికీ ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎస్సీ తరపున కవ్వంపల్లికి సూచించిన వారికి ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇస్తామని పార్టీ అధ్యక్షుడు ప్రకటించారు. దళితులు క్లిష్ట సమయాల్లో కాంగ్రెస్ పార్టీ కి అండగా నిలిచారని చెప్పారు. అందుకే తమ పాలనలో దళితులకు, ఆదివాసీలకు, బీసీలకు సముచిత స్థానం కల్పించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. 17 శాతం ఉన్న ఎస్సీలకు 5 ముఖ్యమైన స్థానాలు ఇచ్చామన్నారు. రాబోయే పదవుల పంపకాల్లో ఎస్సీలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ దళిత నాయకుడు రాజయ్యను అర్ధరాత్రి డిప్యూటీ సీఎం పదవి నుంచి ఎలా తొలగించారో వివరించారు.

టిపిసిసి ఎస్సి విభాగం ఛైర్మన్ కవ్వం పల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి లేకుంటే తానూ ఎమ్మెల్యే గా లేనన్నారు. ఆయన ఆశీస్సులతోనే ఎస్సి విభాగం ఛైర్మన్ అయ్యాయన్నారు. ఎస్సీ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ప్రస్తుతం రాష్ట్రంలో 19 మంది ఉంటే నలుగురికి రేవంత్ రెడ్డి మంత్రి పదవులు ఇచ్చారన్నారు. సమాజం పట్ల సామాజిక బాధ్యత, స్పృహ ఉందని సీఎం తనను ప్రోత్సహించారని చెప్పారు. 59 కులాల కు చెందిన ఎస్సిల ను ఏక తాటి పై తీసుకు వచ్చేలా బాధ్యతాయుతంగా పని చేస్తానని చెప్పారు. బ్యాక్ లాగ్ పోస్ట్ లు భర్తీ చేసేందుకు ప్రయత్నం చేస్తానని వెల్లడించారు. దళితులు ఎటు వైపు ఉంటే అదే పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. తెలంగాణ లో ప్రతి దళితుడు పార్టీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి,ఎమ్మెల్యేలు వేముల వీరేశం,లక్ష్మీ కాంత్, యెన్నం శ్రీనివాస్, మేడిపల్లి సత్యం,నాగరాజు, వినోద్,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతం,ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి నర్సింహులు పాల్గొన్నారు.





# ఒయుకి రూ.1000 కోట్లు

**మొదటి పేజీ తరువాయి..**

రాష్ట్ర అభివృద్ధిలో ఇంజినీరింగ్ విభాగం ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన చెప్పారు. నిజాం సాగర్,నాగార్జున సాగర్, శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టులతో పాటు ఎస్.ఎల్.బి.సి,దేవాదుల వంటి ఆధునిక ప్రాజెక్టులు ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగము విద్యార్థులకు ప్రాక్టికల్స్ పాఠాలుగా ఉపయోగ పడుతాయని ఆయన చెప్పారు. భవిష్యత్‌లో స్థిరమైన అభివృద్ధి,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం,జలవనరుల సమగ్ర నిర్వహణతో పాటు చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంజినీర్లు ప్రాజెక్టుల నిర్మాణాలకు మాత్రమే పరిమితం కాకుండా వాటి భద్రత,నిర్వహణ బాద్యతలు కుడా ఇంజినీర్లకు ఉంటాయన్నారు. నిర్మాణ్-26 వంటి సాంకేతిక సదస్సులు విద్యార్థులకు పరిశోధన,సృజనాత్మక తాను పెంపొందించే వేదికలని ఆయన చెప్పారు. మన నిర్మాణాలు కేవలము కట్టడాలకే పరిమితము కాకుండా ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు దోహద పడాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉద్బోధించారు.



# జాతీయం-అంతర్జాతీయం



## దేశ ముడి చమురు సరఫరా ఎల్‌పిజి పూర్తిగా సురక్షితం

### పెట్రోలియం మంత్రి పూరి

**న్యూఢిల్లీ, మార్చి 12 (వుదయం) :**



ఇరాన్‌ఇజ్రాయెల్‌అమెరికా వివాదం నడుస్తున్నప్పటికీ, భారతదేశ ముడి చమురు సరఫరా సురక్షితంగా ఉందని పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి గురువారం లోక్‌సభకు తెలిపారు. ప్రతిపక్ష సభ్యులు నినాదాల నడుమ ఎల్‌పిజి, ఇంధన లభ్యతపై ఆయన ప్రకటన చేశారు . కొన్ని ప్రాంతాలలో కనిపిస్తున్న ఒత్తిడి, ఉత్పత్తి లేదా సరఫరా వైఫల్యం వల్ల కాదని, తాత్కాలిక డిమాండ్ వక్రీకరణ కారణంగా ఉందని పూరి అన్నారు. ఎల్‌పిజి వినియోగదారులకు బట్వాడా ప్రామాణీకరణ కోడ్ కవరేజీని 50% నుండి 90%కి విస్తరిస్తున్నామని, దీని కింద వినియోగదారుడు ఒటిపి నిర్ధారణ చేసిన తర్వాత మాత్రమే సిలిండర్ బట్వాడా అవుతుందని, దీనివల్ల మళ్లింపు అవకాశాలు తగ్గుతాయని ఆయన సభకు తెలియజేశారు.

గృహ ఎల్‌పిజి సరఫరా పూర్తిగా సురక్షితమని, బుకింగ్‌టుడెలివరీ చక్రం దాదాపు 2.5 రోజులు కొనసాగుతుందని, ఆసుపత్రులు, విద్యా సంస్థలు నిరంతర ప్రాధాన్యత సరఫరా జాబితాలో ఉన్నాయని మంత్రి అన్నారు. డిమాండ్‌నిర్వహణ దశల్లో పట్టణ ప్రాంతాల్లో కనీస బుకింగ్ అంతరం 25 రోజులు, గ్రామీణ మరియు దుర్గం ప్రాంతాలలో 45 రోజులు ఉంటుందని ఆయన అన్నారు.

## చమురు కొంటామా?

### అమెరికా ఆదేశం మేరకే మనం

### లోక్‌సభలో ప్రభుత్వంపై రాహుల్ దాడి

**న్యూఢిల్లీ, మార్చి 12 (వుదయం) :**

ఇరాన్ తో ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం ప్రభావం భారతదేశంపై తీవ్రమైన పరిణామాలను కలిగి ఉంటుందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గురువారం లోక్‌సభలో హెచ్చరించారు. ఈ వివాదం దేశ ఇంధన భద్రతను ప్రభావితం చేస్తుందని, ఆర్థిక ఒత్తిడిని సృష్టించగలదని ఆయన అన్నారు. యుద్ధ పరిణామాలు ఇప్పటికే కనిపిస్తున్నాయని, ప్రజలు గ్యాస్ కొరతను ఎదుర్కొంటున్నారని, అనేక హోటళ్లు, రెస్టారెంట్లు మూసివేత అంచున ఉన్నాయని ఆయన అన్నారు. భారతదేశ ఇంధన నిర్ణయాలను అమెరికా ప్రభావితం చేస్తుందా అని ఆయన ప్రశ్నించారు.ఏ దేశానికైనా పునాది దాని ఇంధన భద్రత. మనం ఎవరి నుండి చమురు, గ్యాస్ కొనుగోలు చేయాలో అమెరికా నిర్ణయిస్తుందా? దాని నుండి చమురు కొనుగోలు చేయాలా వద్దా అని అది నిర్ణయిస్తుందా? అంటూ ఆయన ప్రశ్నించారు.

**హొర్ముజ్ జలసంధిపై ఆందోళన**

హొర్ముజ్ జలసంధిని మూసివేయడం ప్రపంచ ఇంధన సరఫరాపై పెద్ద ప్రభావాన్ని చూపుతుందని రాహుల్ గాంధీ అన్నారు.



ప్రపంచంలోని చమురులో ఎక్కువ భాగం ఈ మార్గం గుండా వెళుతుందని ఆయన అన్నారు.

హొర్ముజ్ జలసంధి మూతబడింది. ప్రపంచంలోని 20 శాతం చమురు అక్కడి నుంచే వస్తుంది. గ్యాస్ కొరత ఉంది. ఇది ప్రారంభం మాత్రమే. ఈ నిర్ణయం తీసుకోవడానికి అమెరికాకు ఎవరు అనుమతి ఇచ్చారు? మనం రష్యా నుండి చమురు ఎందుకు కొనుగోలు చేయలేము? అంటూ రాహుల్ ప్రశ్నలను సంధించారు.

**రాహుల్ గాంధీని అంశంపై ఉండమని కోరిన స్పీకర్**

కోలాహలం మధ్య, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రాహుల్ గాంధీని తాను నోటీసు ఇచ్చిన అంశంపైనే ఉండాలని కోరారు. మీరు నోటీసు ఇచ్చిన అంశంపై మాట్లాడండి. మీరు అంశం కాకుండా ఇతర విషయాలు మాట్లాడుతున్నారు, అని ఆయన అన్నారు.

దీని తర్వాత, పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరి సభలో స్పందించారు.

**బ్లాక్ మార్కెటింగ్‌కి వ్యతిరేకంగా హెచ్చరించిన ప్రభుత్వం**

బ్లాక్ మార్కెటింగ్ వల్ల కొన్ని చోట్ల ఆందోళన వ్యాపించిందని పెట్రోలియం మంత్రి పూరి అన్నారు. నికరమైన సరఫరాను ఖరారు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

బ్లాక్ మార్కెటింగ్ కారణంగా దేశంలో భయాందోళనలు నెలకొన్నాయి. దేశీయ గ్యాస్ ఉత్పత్తి 28 శాతం పెరిగింది. ముడి చమురు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిరంతరం వస్తోంది. భారతదేశం చాలా కాలం పాటు పరిస్థితిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది, ఇది అన్ని పార్టీలతో మాట్లాడుతోంది, అని ఆయన చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు కొనసాగితే పరిస్థితిని నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.

## సభా నియమాలకు ఎవరూ అతీతులు కారు : ఓం బిర్లా

**న్యూఢిల్లీ, మార్చి 12 (వుదయం) :**



ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని సభ తిరస్కరించడంతో లోక్‌సభ స్పీకర్ గురువారం తన స్థానాన్ని తిరిగి అలంకరించి, రెండురోజుల పాటు 12 గంటలపాటు జరిగిన తీవ్ర చర్చకు ముగింపు పలికారు.

ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య మౌఖిక ఓటు ద్వారా తీర్మానం వీగిపోయిన తర్వాత సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, అన్ని పార్టీలకు చెందిన సభ్యులూ తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు చర్చ అనుమతించిందని బిర్లా అన్నారు. ప్రతి ఎంపీకి లోక్‌సభలో మాట్లాడే అవకాశం కల్పించడానికి తాను ఎప్పుడూ ప్రయత్నిస్తానని అన్నారు. సభ నియమాలకు ఎవరూ అతీతులు కారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఎంపీల మైక్రోఫోన్లను నియంత్రించానననే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు.

స్వతంత్ర భారత పార్లమెంటరీ చరిత్రలో, లోక్ సభ స్పీకర్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానంపై సభ చర్చించడం ఇది మూడవ సారి అని ఆయన అన్నారు. గత రెండురోజులుగా, గౌరవ సభ్యులు అందరూ తమ అభిప్రాయాలు, వాదనలను సభకు వినిపించేందుకు విస్తృతమైన చర్చలు జరిపారని ఆయన అన్నారు.

పార్లమెంటరీ సంప్రదాయాలను బలోపేతం చేయడంలో మునుపటి స్పీకర్ల కృషిని గుర్తిస్తూ, సభా మర్యాదను కాపాడుకోవాలని బిర్లా అన్నారు.

నా ముందు స్పీకర్లు ఈ సభ గౌరవం, సంప్రదాయాలను బలోపేతం చేశారు. దాని ప్రతిష్టను ఎప్పుడూ పెంచారు. సంస్థలు, మర్యాద, సంప్రదాయాలు శాశ్వతంగా ఉంటాయి. సభ నాపై వ్యక్తం చేసిన విశ్వాసానికి సభ్యులందరికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ నమ్మకాన్ని నా బాధ్యతగా భావిస్తాని, పూర్తి అంకితభావం, నిష్పాక్షికత, రాజ్యాంగ ఔచిత్యానికి కట్టుబడి దానిని నెరవేర్చడానికి కృషి చేస్తానని నేను హామీ ఇస్తున్నాను, అని ఆయన అన్నారు.

దేశంలోని పౌరుల ప్రజాస్వామ్య సంకల్పాన్ని లోక్‌సభ ప్రతిఫలిస్తుందని, ప్రజా సమస్యలకు ప్రాతినిధ్య బాధ్యతతో సభ్యులు సభకు వస్తారని పేర్కొన్నారు. ఈ సభ 1.4 బిలియన్ల భారతీయ పౌరుల సార్వభౌమ సంకల్పాన్ని సూచిస్తుంది. ఇక్కడ ఉన్న ప్రతి సభ్యుడు లక్షలాది మంది పౌరుల సమర్థనతో వస్తారు. వారి సమస్యలు, లేమి, ఇబ్బందులను పరిష్కరించడంతోపాటు వారి ఆకాంక్షలు, అంచనాలను నెరవేర్చాలనే ఆశను వారు కలిగి ఉంటారు అని స్పీకర్ అన్నారు.

ఈ ప్రయోజనం కోసమే నేను సభ్యులందరికీ తగినన్ని అవకాశాలు కల్పించే ప్రయత్నం చేశాను. గౌరవ సభ రెండవ సారి స్పీకర్‌గా సేవలు అందించే అవకాశాన్ని, బాధ్యతను నాకు ఇచ్చింది. నేను నిష్పాక్షికంగా, క్రమశిక్షణతో, సమతుల్యంగా, నిబంధనలకు అనుగుణంగా సభను నడిపే ప్రయత్నించాను.

స్పీకర్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానానికి 118మంది ప్రతిపక్ష సభ్యుల సమర్థన ఉంది. దీనిపై చర్చలో 42మందికిపైగా సభ్యులు మాట్లాడారు.


## దాడులను ఉధృతం చేస్తున్న ఇరాన్

**వుదయం డెస్క్, మార్చి 12 :**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజు రోజుకూ ముదురుతున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ఇరాన్ దీటుగా స్పందిస్తోంది. హొర్ముజ్ జలసంధిపై పట్టుబిగించి ప్రపంచ చమురు సరఫరాకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. ఆ జలసంధి గుండా వెళుతున్న నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతోంది. ఆ జలసంధిలో మందుపాతరలను ఏర్పాటు చేసింది. ఇది ప్రపంచ మార్కెట్లను కుదిపివేసి, చమురు ధరలను చుక్కలనంటిస్తోంది. దీనితో, అగ్ర దేశాలు తమ వ్యూహాత్మక నిల్వలను విడుదల చేయక తప్పడం లేదు.

ఈ వివాదం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసే దీర్ఘకాలిక యుద్ధంగా మారవచ్చని ఇరాన్ అధికారులు హెచ్చరించారు. తెహ్రాన్ ఇప్పటికీ హొర్ముజ్ జలసంధిపై నియంత్రణను కొనసాగిస్తుందని, యునైటెడ్ స్టేట్స్, ఇజ్రాయెల్‌తో అనుసంధానమైన ఆర్థిక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. ఇరాన్ దళాలు గల్ఫ్‌లోని వాణిజ్య నౌకలను కూడా లక్ష్యంగా చేసుకున్నాయి, ఇది ఉద్రిక్తతలను మరింత పెంచింది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదలుపెట్టిన పనిని పూర్తి చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఇప్పటికే ఇరాన్‌కు చెందిన పలు ప్రధాన సైనిక లక్ష్యాలను ఇప్పటికే ధ్వంసం చేశామని, వాటిలో మందుపాతరలు వేసే ఓడలు, ఇతర



నావికాదళ ఆస్తులు కూడా ఉన్నాయని వాదించారు. అయితే, ఈ దాడులు ఇంకా పూర్తి కాలేదని, ఇరాన్ లోపల లక్ష్యాల విస్తృత జాబితా ఇంకా తమ వద్ద ఉందని ఇజ్రాయెల్ అధికారులు చెబుతున్నారు.

ఈ వివాదం తక్షణ యుద్ధభూమిని దాటి వ్యాపించింది. ఇరాన్ మద్దతుగల ఉగ్రవాద సంస్థ హిజ్బుల్లా లెబనాన్ నుండి ఇజ్రాయెల్‌పై దాడులు ప్రారంభించింది, దీని ఫలితంగా బీరుట్, తూర్పు లెబనాన్‌లలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిగాయి. వందలాది మంది మరణించారు, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. కాగా, ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేసిన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో దౌత్యపరమైన ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. పోరాటం రెండవ వారంలోకి అడుగుపెడుతున్నందున, ఈ వివాదం మరింత విస్తరించి ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలు, ప్రాంతీయ స్థిరత్వాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందనే భయాలు పెరుగుతున్నాయి.

**అమెరికా స్థావరాలపై పెరిగిన దాడులు**

అమెరికాఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో దుబాయ్‌లో ప్రధాన కేంద్రమైన అల్ బదాలో డ్రోన్ దాడులు జరిపింది. పేలుడు శబ్దాలతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. ప ఈ ప్రాంతంలోనే బుర్జ్ ఖలీఫా సహా ప్రముఖ భవనాలు ఉన్నాయి. అయితే, ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని స్థానిక అధికారులు పేర్కొన్నారు. ఇరాన్ దాడులను ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నామన్నారు.

దుబాయ్‌పై జరుగుతోన్న దాడులను దీటుగా ఎదుర్కొనేందుకు తాజాగా రెండుసార్లు గగనతల రక్షణ వ్యవస్థను యాక్టివేట్ చేసినట్లు యూఏఈ వెల్లడించింది. క్రీక్ హార్బర్‌లోని ఓ టవర్‌పై డ్రోన్ దాడి జరగ్గా.. వెంటనే అగ్నిమాపక బృందాలు మంటలను ఆర్పివేశాయని పేర్కొంది. మరోవైపు, బహ్రెయిన్‌లోని ముబారక్ ద్వీపం లక్ష్యంగా ఇరాన్ చేసిన దాడులతో అక్కడ ఓ చోట భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కువైట్‌లోనూ ఓ నివాస భవనంలోకి డ్రోన్ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడినట్లు కువైట్ రక్షణశాఖ వెల్లడించింది. రియాద్‌లోని దౌత్య కార్యాలయాలున్న ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొన్న డ్రోన్‌లను కూల్చివేసినట్లు సౌదీ అరేబియా వెల్లడించింది.

**చమురు ట్యాంకర్లపై దాడులు**

తాజాగా పర్షియన్ గల్ఫ్‌లోని ఓ ఆయిల్ ట్యాంకర్‌ను ఇరాన్ పేల్చేసినట్టు టర్కీ ఆధ్వర్యంలోని ఓ మీడియా సంస్థ వెల్లడించింది. 'పర్షియన్ గల్ఫ్‌లోని ఉమ్ ఖాసర్ ఓడరేవు దగ్గర దాడి తర్వాత, ఇరాక్‌లోని బాస్రా సమీపంలోని ప్రాదేశిక జలాల్లో విదేశీ చమురు ట్యాంకర్ మంటల్లో చిక్కుకుంది' అని ఆ మీడియా సంస్థ పేర్కొంది. మంటల్లో చిక్కుకున్న ఆయిల్ ట్యాంకర్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ చమురు ట్యాంకర్ నుంచి భారీగా మంటలు ఎగిసిపడుతున్నాయి. కాగా, ఈ దాడికి తమదే బాధ్యత అని ఇరాన్ అంగీకరించింది. చమురు ట్యాంకర్లపై దాడి చేయడానికి ఇరాన్ నావికాదళ డ్రోన్‌లను ఉపయోగిస్తున్నట్లు సమాచారం. కాగా, తాజా దాడిలో ఒకరు మరణించినట్టు వార్తలు వస్తున్నాయి

## కొత్త సుప్రీం నాయకుడి తొలి ప్రకటన

### శత్రువులపై ఒత్తిడి కోసమే హొర్మూజ్ మూసివేత

**వుదయం డెస్క్, మార్చి 12 :**

పదవీ స్వీకారం చేసిన తర్వాత తొలి ప్రకటన చేస్తూ ఇరాన్ సుప్రీం నాయకుడు మొజ్తాబా ఖమేనీ ఆ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలను తక్షణమే మూసివేయాలని, లేదంటే అవి తమ లక్ష్యాలుగా మారుతాయని హెచ్చరించారు. మొదటగా జాతీయ ఐక్యతకు పిలుపిచ్చిన ఆయన పొరుగుదేశాలతో స్నేహపూరిత సంబంధాలను కొనసాగిస్తూనే అమెరికా స్థావరాలకు వ్యతిరేకంగా దాడులు జరపడాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇరాన్ శత్రువులపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాల్లో భాగంగా హొర్ముజ్ జలసంధిని మూసివేస్తామని ఖమేనీ స్పష్టం చేశారు. తమ దేశంపై దురాక్రమణగా చేసిన వారిని ఎదుర్కోవడమే ఈ చర్య లక్ష్యం అని అన్నారు. ఇరాన్ తమ అమరవీరుల రక్తానికి ప్రతీకారం తీర్చుకోకుండా ఉండదని, ఇరాన్ శత్రువుల నుండి పరిహారం కోరుతుందని లేదా తదనుగుణంగా వారి ఆస్తులను నాశనం చేస్తుందని కూడా ఆయన అన్నారు.

## యుద్ధాన్ని ముగించడానికి ఇరాన్ సంసిద్ధత

### మూడు షరతుల జాబితా

**వుదయం డెస్క్, మార్చి 12 :**

తన ప్రధాన డిమాండ్లను అంగీకరిస్తే కొనసాగుతున్న యుద్ధం ముగియవచ్చని ఇరాన్ పేర్కొంది. ఏదైనా కాల్పుల విరమణ ఒప్పందానికి, ఇరాన్ హక్కులను గుర్తించడం, నష్టపరిహారం చెల్లించడం, భవిష్యత్ దాడులకు వ్యతిరేకంగా దృఢమైన హామీలు అవసరమని అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ పేర్కొన్నారు.



ప్రాంతీయ స్థిరత్వం, ప్రపంచ ఇంధన సరఫరాలు, కీలకమైన షిప్పింగ్ మార్గాలను ప్రభావితం చేస్తూ, అమెరికా, ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలు ఉధృతమవుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. వివాదాన్ని ముగించడానికి సిద్ధంగా ఉన్నట్టు తెహ్రాన్ సంకేతాలను ఇచ్చింది. అయితే దాని భద్రతా సమస్యలు, యుద్ధకాల నష్టాలను పూర్తిగా పరిష్కరించినట్లయితే మాత్రమే శాంతి సాధ్యమవుతుందని నొక్కి చెప్పింది.

**తెహ్రాన్ మూడు తిరుగులేని డిమాండ్లను జాబితా సిద్ధం చేసింది**

ఇరాన్ షరతులు నెరవేరితేనే వివాదం ముగుస్తుందని, దాని చట్టబద్ధమైన హక్కులు, యుద్ధ సమయంలో జరిగిన నష్టాన్ని విస్మరించే పరిష్కారాన్ని దేశం అంగీకరించదని అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ నొక్కి చెప్పారు.

యూదు ప్రభుత్వం, యుఎస్ రగిల్చిన ఈ యుద్ధాన్ని ముగించడానికి ఏకైక మార్గం ఇరాన్ చట్టబద్ధమైన హక్కులను గుర్తించడం, నష్టపరిహారాల చెల్లింపు, భవిష్యత్ దురాక్రమణకు వ్యతిరేకంగా దృఢమైన అంతర్జాతీయ హామీలు కావాలని ఇరాన్ ప్రధానంగా డిమాండ్ చేస్తోంది.

**ఇరాన్ ప్రధాన డిమాండ్లు**

ఇరాన్ చట్టబద్ధమైన హక్కుల గుర్తింపు

యుద్ధసమయంలో కల్పించిన నష్టానికి నష్టపరిహార చెల్లింపు భవిష్యత్ దాడులకు వ్యతిరేకంగా దృఢమైన అంతర్జాతీయ హామీలుపరిష్కారం గురించి చర్చలు జరిగినప్పటికీ కొనసాగుతున్న వివాదం ఇటీవలి సంవత్సరాలలో ఈ ప్రాంతంలో అత్యంత తీవ్రమైన ఘర్షణలలో ఇది ఒకటి. నిరంతర సమ్మెలు, షిప్పింగ్‌కు బెదిరింపులు, విస్తృత సంఘర్షణ భయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. ఈ పరిస్థితి ఇప్పటికే చమురు మార్కెట్లు, వాణిజ్య మార్గాలను ప్రభావితం చేసింది. ముఖ్యంగా ప్రపంచ ఇంధన సరఫరాలో ఎక్కువ భాగం రవాణా అయ్యే హొర్ముజ్ జలసంధి చుట్టూ ఉంది.

గల్ఫ్ ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య సముద్ర భద్రత, భారతదేశ ఇంధన భద్రతపై దృష్టి సారించి, విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్ ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చితో మూడుసార్లు సంభాషణలు జరిపారని భారతదేశం ధృవీకరించింది. వివాదం ప్రారంభమైనప్పటి నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గల్ఫ్ ప్రాంతంలోని అనేక మంది నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారని కూడా విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాల నిరసన



**న్యూఢిల్లీ, మార్చి 12 (వుదయం) :**

ఇంధన భద్రత విషయంలో కేంద్రం రాజీ పడిందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత తలెత్తిందంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు గురువారంనాడు పార్లమెంటు ఆవరణలో నిరసనకు దిగాయి. ఈ నిరసనలో పాల్గొన్న రాహుల్ గాంధీ సమస్య సంక్షోభంగా మారకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపైనే ఉందని అన్నారు. విదేశాంగ విధానాన్ని ప్రభుత్వం మార్చుకోవాల్సి అవసరం ఉందని, గ్యాస్, పెట్రోల్ సమస్యగా మారబోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం మీద ఇంధనం సమస్యగా మారనుందని ఆయన అన్నారు. దీనికంతటికీ ఇంధన భద్రతపై ప్రభుత్వం రాజీపడటమే కారణమని, లోపభూయిష్టమైన ఇంధన విధానమే సమస్యను తెచ్చిపెట్టిందని రాహుల్ విమర్శించారు. సమస్య సత్వర పరిష్కారానికి ప్రధాని వెంటనే చర్యలు చేపట్టాలని, తగిన ఏర్పాట్లు చేయకుంటే కోట్లాది మంది ప్రజలు ఇక్కట్ల పాలవుతారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చాయ్, బిస్కెట్ ప్రతిపక్ష నాయకులు తీసుకున్నారు. ఈ క్రమంలో గ్యాస్ సంక్షోభం కారణంగా ఛాయ్, బిస్కెట్లతోతాము సరిపెట్టుకోవాల్సి వస్తోందని నిరసన తెలిపారు.

**మోడీకి వ్యతిరేక నినాదాలు**

పార్లమెంటు మకర ద్వారం వద్ద విపక్షాలు జరిపిన నిరసనలో కాంగ్రెస్, డీఎంకె, టీఎంసీ, ఎస్పీ తదితర పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. నామ్ నరేందర్, కామ్ సరెండర్, మోదీ జీ, ఎల్పీజీ అంటూ ఎంపీలు నినాదాలు చేశారు. ఇటుకలతో ఏర్పాటు చేసిన కట్టెల పొయ్యిలతో ప్రియాంక గాంధీ తదితర మహిళా ఎంపీలు నిరసనలో పాల్గొన్నారు. పశ్చిమాసియాలో తలెత్తిన సంక్షోభం, భారత్‌పై పడుతున్న ప్రభావంపై పూర్తి స్థాయి చర్చ జరగాలని డిమాండ్ చేశారు.

## నేడు కిసాన్ సమ్మాన్ నిధుల విడుదల

- 9.32 కోట్ల మంది రైతులకు నేరుగా రూ. 18,640 కోట్ల నగదుపంపిణీ

**న్యూఢిల్లీ, మార్చి 12 (వుదయం) :**

వ్యవసాయ రంగం, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న విశేష చర్యల్లో భాగంగా, మార్చి 13న, అస్సాంలోని గువహతిలో జరిగే కార్యక్రమంలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకిసాన్) 22వ విడత కింద రూ. 18,640 కోట్లను దేశంలోని 9.32 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా బదిలీ చేస్తారని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఇప్పటివరకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డిబిటి) ద్వారా రూ. 4,09,000 కోట్లకు పైగా పంపిణీ చేశామని, ఇందులో 2.15 కోట్లకు పైగా మహిళా రైతులు ఉన్నారని వ్యవసాయ మంత్రి విలేకరులకు వెల్లడించారు. ఈ ప్రత్యక్ష ఆర్థిక సాయం వల్ల వ్యవసాయ పెట్టుబడులు పెరిగాయని, వడ్డీ వ్యాపారులపై రైతుల ఆధారపడటం తగ్గిందని, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమైందని అధ్యయనాలు చెబుతున్నట్లు ఆయన వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమ మహా యజ్ఞం నిరంతరాయంగా కొనసాగుతుందని శివరాజ్ సింగ్ పేర్కొన్నారు.



**గత దశాబ్ద కాలంలో వ్యవసాయరంగంలో సాధించిన విజయాలు**

గత 12 ఏళ్లలో వ్యవసాయ రంగంలో భారత ప్రభుత్వం సాధించిన పురోగతిని శివరాజ్ సింగ్ చౌహాన్ వివరించారు. ధాన్యాల కొరత ఎదుర్కొన్న స్థాయి నుంచి భారత్ ఇప్పుడు ప్రపంచ శక్తిగా ఎదిగిందని, ప్రభుత్వ విధానాలు, రైతుల కృషి వల్ల ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. బియ్యం ఉత్పత్తిలో భారత్ 150 మిలియన్ టన్నులతో చైనాను అధిగమించి ప్రపంచంలోనే మొదటి స్థానానికి చేరుకుందని ఆయన తెలిపారు. 2014లో 252 మిలియన్ టన్నులుగా ఉన్న దేశ మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి ఇప్పుడు 357 మిలియన్ టన్నులకు పెరిగిందని కేంద్ర వ్యవసాయ మంత్రి తెలిపారు. ఉద్యానవన రంగంలో కూడా గణనీయమైన వృద్ధి నమోదైంది. పండ్లు, కూరగాయల ఉత్పత్తి 277 మిలియన్ టన్నుల నుంచి 369 మిలియన్ టన్నులకు పెరిగింది. పప్పుధాన్యాల ఉత్పత్తిలో భారత్ నేడు స్వయంసమృద్ధి దిశగా సాగుతోందని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో పప్పుధాన్యాల ఉత్పత్తి, వినియోగంలో భారత్ అగ్రస్థానంలో ఉంది. కందులు, పెసలు, మినుము వంటి పప్పు ధాన్యాలను ప్రభుత్వం రికార్డు స్థాయిలో కొనుగోలు చేస్తోంది. రైతులకు సహాయం చేసేందుకు ప్రభుత్వం 'భారత్ విస్తార్' పేరుతో ఏఐ డిజిటల్ వేదిక మొదటి దశను ప్రారంభించినట్లు శివరాజ్ సింగ్ తెలిపారు. దీని ద్వారా కేవలం ఒక ఫోన్ కాల్‌తో రైతులు తమ స్థానిక భాషలో వ్యవసాయానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని పొందవచ్చని చెప్పారు. గత సంవత్సరాల్లో గోధుమలు, వరి, పత్తి, నూనెగింజలు, పప్పుధాన్యాలను కనీస మద్దతు ధరకు రికార్డు స్థాయిలో కొనుగోలు చేశామని, రైతులకు తక్కువ ధరకే ఎరువులు అందేలా చూశామని ఆయన వివరించారు.

**ఆర్థిక భద్రత పరంగా కీలక సంస్కరణలు**

2014లో రూ. 8,45,000 కోట్లుగా ఉన్న వ్యవసాయ రుణాలు ఇప్పుడు రూ. 28,69,000 కోట్లకు పెరిగినట్లు కేంద్ర వ్యవసాయ మంత్రి తెలిపారు. పంట బీమా పథకం కింద దాదాపు రూ. 2 లక్షల కోట్ల క్లెయిమ్ నగదు రైతుల ఖాతాల్లో జమ అయింది. దీనితో పాటు వ్యవసాయ బడ్జెట్ కూడా భారీగా పెరిగింది. యూపీఏ ప్రభుత్వం హయాంలో రూ.27,000 కోట్లుగా ఉన్న వ్యవసాయ బడ్జెట్ ఇప్పుడు ఏటా రూ. 1.40 లక్షల కోట్లకు పైగా పెరిగింది.






“ఈ యుద్ధం లెక్కలేనంత మంది ప్రాణాలను బలి తీసుకుంటుంది. అలాగే లెక్కలేనన్ని బిలియన్ల డాలర్లను బూడిద చేస్తుంది. దీని నుంచి తీవ్ర పరిణామాలు సంభవిస్తాయి. మనకు మిగిలి ఉన్న పరువును కూడా తీసేస్తుంది. కొంతమంది చెబుతున్నట్టు ఇరాన్ ప్రజలు తమ ప్రభుత్వం నుంచి తీవ్ర అణిచివేతకు గురైతే అయ్యి ఉండవచ్చు. ప్రస్తుత యుద్ధం వారిని దానిని నుంచి కాపాడజాలదు. ఇప్పు ఇరాన్ లో అధికారంలో ఉన్న మత ప్రభుత్వం క్రూరత్వానికి ఇరాన్ ప్రజలు బలి అవుతున్నారు. వారికి స్వేచ్ఛ కావాలి. వారు తమ జీవితాలపై తామే నిర్ణయం తీసుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. కానీ వారి దేశంపై బాంబు దాడులు చేస్తున్న వ్యక్తి (ట్రంప్)కి వారిపట్ల ఎటువంటి ఆసక్తి లేదు. వారికి మేలు చేయాలనే తపన బొత్తిగా లేదు. వారు స్వేచ్ఛ పొందడానికి అనువైన పరిస్థితులు సృష్టించగల ప్రాణాళిక ఏది ఆయన వద్ద లేదు. ఇప్పటి ప్రభుత్వానికి ప్రత్యామ్నాయాన్ని నెలకొల్పుకునే యత్నానికి మద్దతు ఇచ్చే సదుద్దేశము లేదు. ఆయన కష్టాల్లో ఉన్నాడు. ఇది ఆయన తెలుసు.”

* – మేరీ ఎల్ ట్రంప్, డోనాల్డ్ ట్రంప్ మేనకోడలు

## వే'మన'పద్యం

అన్నిదానములను నన్నదానమె గొప్ప
కన్నతల్లి కంటె ఘనము లేదు
ఎన్న గురునికన్న నెక్కుడు లేదయా
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# దిక్కుతోచని అమెరికా అధ్యక్షుడు !

పదమూడవ రోజు దాటుతున్న ఇరాన్ యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించడం లేదు. కట్టె కొట్టె తెచ్చె అన్నట్టు వారం రోజుల్లో ఇరాన్ ను చావబాది చెవులు మూసి సఫా చేసేసి యుద్ధానికి ముగింపు పలకవచ్చుని, మొత్తం పశ్చిమాసియా ను ఇజ్రాయెల్ కి రాసి ఇచ్చేవచ్చుని అనుకున్న ట్రంప్ అంచనాలు రుజువు కావడం లేదు. ఇరాన్ తాను విలాసంగా తినగల పంచదార కేక్ కాదని ఇనుప గుండని ఆయనకు ఇప్పుడిప్పుడే అర్థమతున్నట్లుంది.అందుచేత యుద్ధానికి ముగింపు పలకడం అమెరికా చేతుల్లో లేదు.అందుచేతనే సన్నిపాత వ్యాధిగ్రస్థుడి మాదిరిగా సంధి ప్రేలాపనలకు ట్రంప్ పాల్పడుతున్నాడనుకోవాలి. యుద్ధాన్ని త్వరలో ఆపేస్తామని ఒకటికి రెండు సార్లు అన్నాడు. యుద్ధం మొదటిరోజునే తమ లక్ష్యం నెరవేరపోయిందని అన్నాడు. అటువంటప్పుడు ఎందుకు యుద్ధాన్ని విరమించడం లేదు. ఈలోగా యుద్ధరంగంలో పరిస్థితి తారుమారవుతున్నది. ఇరాన్ దాడుల తీవ్రత విశేషంగా పెరుగుతున్నది. ఒకవైపు చమురు నౌకల మీద, ఇంకొకవైపు గల్ఫ్ లోని అమెరికా సైనిక స్థావరాలపైన క్షిపణులను డ్రోణులను ముమ్మరంగా ప్రయోగిస్తున్నది.తాము యుద్ధాన్ని ముగించాలంటే తమ మూడు షరతులను సంతృప్తిపరచాలని ఇరాన్ ఒక ప్రకటనలో తెలిపింది. స్వతంత్ర దేశంగా ఇరాన్ కు గల చట్టబద్ధ హక్కులను గుర్తించాలి. యుద్ధంలో తమకు కలిగిన నష్టాలకు పరిహారం చెల్లించాలి. భవిష్యత్తులో తమపై దాడులు చేయబోమని హామీ ఇవ్వాలి. ఇందులో ఆక్షేపించిందగినవి ఏమీ లేవు. ఇరాన్‌ఇ బేషరతుగా లొంగిపోవాలన్న ట్రంప్ షరతు ఫలించేలా కనిపించడం లేదు . ఇరాన్ తానుగా యుద్ధానికి కాలు దువ్వలేదు. అణు కార్యక్రమాన్ని అదుపులో ఉంచడానికి అంగీకరిస్తూ ఒబామా హయాంలో సమగ్ర ఒప్పందం కుదుర్చుకుని దానికి కట్టుబడి ఉన్నది.ట్రంప్ మళ్ళీ అధికారంలోకి రావడం తోనే ఆ ఒప్పందాన్ని రద్దు చేశాడు. ఇరాన్ పశ్చిమసియా లో బలమైన శక్తిగా కొనసాగడం ఇష్టం లేక ఒకవైపు అణు చర్చలకు తెరలేపి మరోవైపు దానిమీద భీకర దాడులకు తలపడ్డాడు. ఆటవిక కాలం నాటి బందిపోట్ల మాదిరిగా వ్యవహారించాడు. సుప్రీమ్ లీడర్ ఖమేని ని బంధు మిత్ర సహితంగా హతమార్చడం,ఆ దాడుల్లో భాగంగా ఒక పాఠశాలపైనా దాడి చేసి 160 మంది బాలికల ప్రాణాలను పొట్టన పెట్టుకోడం ఎదురులేని అగ్ర రాజ్యం చేయవలసిన పనేనా? అమెరికా, ఇజ్రాయెల్ పాల్పడిన అమానుషం ప్రపంచమంతా చమురు,వంట గ్యాస్ సంక్షోభాన్ని సృష్టించి దేశ దేశ ఆర్థిక వ్యవస్థలను కూల్చి వేస్తున్నది. అందుచేత యుద్ధం తక్షణమే ఆగాలి. ఇరాన్ షరతుల ప్రాతిపదిక మీద అది జరగాలి.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# యుద్ధం లేని చోటా యుద్ధమే!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చమురు కీలక స్థానం కలిగిన వనరు. ఆధునిక పారిశ్రామిక వ్యవస్థలన్నీ ఇంధనంపై ఆధారపడి నడుస్తున్నాయి. అందువల్ల ప్రపంచంలో ఎక్కడైనా యుద్ధం, రాజకీయ ఉద్రిక్తతలు లేదా అంతర్జాతీయ సంబంధాల్లో మార్పులు చోటుచేసుకున్నప్పుడు మొదట ప్రభావం చూపే రంగం చమురు మార్కెట్. చరిత్రను పరిశీలిస్తే యుద్ధాలు మరియు చమురు ధరల మధ్య గాఢమైన సంబంధం కనిపిస్తుంది. ముఖ్యంగా 1973 చమురు సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బగా నిలిచింది. ఆ సంఘటన తరువాత ప్రపంచం చమురు రాజకీయాలను మరింత జాగ్రత్తగా పరిశీలించడం ప్రారంభించింది. ప్రస్తుతం పశ్చిమ ఆసియా ప్రాంతంలో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో చమురు ధరల పెరుగుదలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 1973లో జరిగిన అరబ్-ఇజ్రాయిల్ యుద్ధం అనంతరం ఏర్పడిన చమురు సంక్షోభం ఆధునిక ప్రపంచ చరిత్రలో కీలక మలుపుగా నిలిచింది. 1973 అక్టోబర్ నెలలో ప్రారంభమైన ఈ సంఘటనకు మూలం అరబ్ దేశాలు మరియు ఇజ్రాయిల్ మధ్య ఉన్న దీర్ఘకాలిక వైరం. అక్టోబర్ 6న ఈజిప్ట్ మరియు సిరియా సంయుక్తంగా ఇజ్రాయిల్‌పై దాడి చేయడంతో యుద్ధం ప్రారంభమైంది. ఈ యుద్ధాన్ని ప్రపంచం “యోమ్ కిప్పూర్ యుద్ధం”గా కూడా పిలుస్తుంది. ఈ పోరాటంలో అమెరికా ఇజ్రాయిల్‌కు బహిరంగ మద్దతు ప్రకటించింది. దీనికి ప్రతిగా అరబ్ దేశాలు అమెరికా మరియు పాశ్చాత్య దేశాలపై ఆర్థిక ఒత్తిడి తేవాలని నిర్ణయించాయి. ఈ సందర్భంలో చమురు ఉత్పత్తి దేశాల సమాఖ్య అయిన OPEC కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా, పాశ్చాత్య దేశాలకు చమురు సరఫరాను తగ్గిస్తూ ఆంక్షలు విధించింది. ఈ నిర్ణయం ప్రపంచ మార్కెట్‌ను కుదిపేసింది. అప్పటివరకు ఒక బ్యారెల్ చమురు ధర సుమారు 3 డాలర్ల పరిధిలో ఉండగా కొన్ని నెలల్లోనే అది 12 డాలర్లకు పైగా పెరిగింది. ధరలు నాలుగు రెట్లు పెరగడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్ద షాక్‌గా మారింది. ఈ సంక్షోభం కారణంగా అమెరికా మరియు యూరప్ దేశాల్లో ఇంధన కొరత తీవ్రంగా కనిపించింది. పెట్రోల్ బంకుల వద్ద పొడవైన క్యూలు కనిపించాయి. అనేక దేశాల్లో ప్రభుత్వం ఇంధన వినియోగాన్ని పరిమితం చేయాల్సి వచ్చింది. కొన్ని దేశాల్లో వారానికి కొన్ని రోజులు మాత్రమే వాహనాలు నడపాలని ఆంక్షలు విధించారు. పరిశ్రమల ఉత్పత్తి తగ్గిపోయింది. రవాణా ఖర్చులు పెరిగాయి. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరిగి ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం నెలకొంది. ఈ సంఘటన ప్రపంచ దేశాలకు ఒక పెద్ద పాఠంగా మారింది.

చమురు సరఫరా కొన్ని దేశాల చేతుల్లో ఉండటం ఎంత ప్రమాదకరమో అప్పుడే స్పష్టమైంది. అందుకే తరువాతి కాలంలో అమెరికా, యూరప్ దేశాలు ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి పెట్టాయి. అణుశక్తి, సహజవాయువు, పునరుత్పాదక ఇంధన వనరులపై పరిశోధనలు వేగం పుంజుకున్నాయి. అయినప్పటికీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ చమురు మీదే ఎక్కువగా ఆధారపడి ఉంది. చమురు ధరల పెరుగుదల చరిత్రలో 1973 తర్వాత కూడా పలుమార్లు చోటుచేసుకుంది. 1979లో ఇరాన్ విప్లవం సమయంలో మరోసారి చమురు ధరలు భారీగా పెరిగాయి. అప్పట్లో ఇరాన్‌లో రాజకీయ అస్థిరత కారణంగా చమురు ఉత్పత్తి తగ్గిపోయింది. ఫలితంగా ప్రపంచ మార్కెట్లో కొరత ఏర్పడి ధరలు మళ్లీ పెరిగాయి. తరువాత 1990లో ఇరాక్ కువైట్‌పై దాడి చేసినప్పుడు కూడా చమురు మార్కెట్ కుదేలైంది. 2003లో ఇరాక్ యుద్ధం, 2011లో అరబ్ స్ప్రింగ్ ఉద్యమాలు కూడా చమురు ధరలపై ప్రభావం చూపాయి. ప్రస్తుతం పశ్చిమ ఆసియా ప్రాంతంలో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా Iran మరియు Israel మధ్య పెరుగుతున్న విభేదాలు అంతర్జాతీయ రాజకీయాలను కలవరపెడుతున్నాయి. ఈ పరిణామాల్లో United States కూడా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాత్ర పోషిస్తోంది. ఈ మూడు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగితే పశ్చిమ ఆసియాలో యుద్ధ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పశ్చిమ ఆసియా ప్రాంతం ప్రపంచ చమురు నిల్వలలో అత్యధిక వాటా కలిగిన ప్రాంతం. ఈ ప్రాంతం నుంచి ప్రపంచ మార్కెట్‌కు పెద్ద మొత్తంలో చమురు సరఫరా జరుగుతుంది. అందువల్ల అక్కడ యుద్ధం లేదా రాజకీయ సంక్షోభం తలెత్తితే వెంటనే చమురు ధరలు పెరిగిపోతాయి. ముఖ్యంగా హోర్ముజ్ సముద్ర మార్గం ద్వారా ప్రపంచ చమురు సరఫరాలో గణనీయమైన భాగం రవాణా అవుతుంది. ఆ మార్గం ప్రమాదంలో పడితే ప్రపంచ మార్కెట్లో భారీ అస్థిరత తలెత్తుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో చమురు ధరల పెరుగుదల మొదట ప్రభావం చూపేది ఇంధన ధరలపైనే. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు పెరుగుతాయి. ట్రక్కులు, బస్సులు, రైళ్లు వంటి రవాణా వ్యవస్థల ఖర్చులు పెరగడం వల్ల వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. వ్యవసాయ రంగం కూడా దీనికి



మినహాయింపు కాదు. ట్రాక్టర్లు, పంపుసెట్లు, ఎరువుల తయారీ అన్నీ ఇంధనంపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల రైతులకు ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. భారతదేశం వంటి దేశాలకు ఈ పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంటుంది. ఎందుకంటే భారత్ తన అవసరాలకు కావలసిన చమురులో ఎక్కువ భాగాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరిగితే దేశీయ మార్కెట్లో కూడా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం సహజం. ఇది ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థపై కూడా ఒత్తిడి పెంచుతుంది. సబ్సిడీలు పెరగడం లేదా పన్నుల తగ్గింపు వంటి చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. ఇంధన ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవన విధానాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. రవాణా ఖర్చులు పెరగడంతో కూరగాయలు, ధాన్యాలు, అవసర వస్తువుల ధరలు పెరుగుతాయి. విద్యుత్ ఉత్పత్తి ఖర్చులు పెరగడంతో విద్యుత్ చార్జీలు కూడా పెరిగే అవకాశముంది. ఈ పరిస్థితి మొత్తం ద్రవ్యోల్బణాన్ని పెంచుతుంది. ఇటీవలి కాలంలో వంటగ్యాస్ ధరల పెరుగుదల కూడా ప్రజలపై అదనపు భారం మోపుతోంది. ముఖ్యంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలు పెరగడం హోటల్ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. రెస్టారెంట్లు, చిన్న హోటళ్లు, టీ దుకాణాలు వంటి వ్యాపారాలు ఎక్కువగా కమర్షియల్ సిలిండర్లపై ఆధారపడుతుంటాయి. ధరలు భారీగా పెరగడంతో వారి వ్యాపార ఖర్చులు కూడా పెరిగాయి.

ఈ పరిస్థితిలో కొంతమంది వ్యాపారులు తమ వ్యాపారాన్ని కొనసాగించడం కష్టమై హోటళ్లను తాత్కాలికంగా మూసివేస్తున్నారు. మరికొందరు ధరలను పెంచడం ద్వారా నష్టాలను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే దీనివల్ల వినియోగదారులపై భారం మరింత పెరుగుతోంది. సాధారణంగా ఒక ప్లేట్ భోజనం లేదా టీ ధర కూడా పెరగడం ప్రజల దైనందిన ఖర్చులను ప్రభావితం చేస్తోంది. చమురు ధరల పెరుగుదల ఒక దేశం లేదా ప్రాంతానికి మాత్రమే పరిమితం అయ్యే సమస్య కాదు. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపే ఆర్థిక సమస్య. అందువల్ల దీనికి పరిష్కారం కూడా అంతర్జాతీయ సహకారంతోనే సాధ్యమవుతుంది. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అభివృద్ధి, పునరుత్పాదక శక్తి వినియోగం, ఇంధన వినియోగంలో పొదుపు వంటి చర్యలు భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రపంచ దేశాలు సౌరశక్తి, గాలిశక్తి, జలశక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరులపై ఎక్కువ దృష్టి పెట్టడం కూడా ఇదే కారణంతో. చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి బయటపడటం ద్వారా ఇలాంటి సంక్షోభాల ప్రభావాన్ని తగ్గించవచ్చని భావిస్తున్నారు. అయితే ఈ మార్పు ఒక్కరోజులో జరగదు. ఇంకా చాలా కాలం వరకు చమురు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన ఇంధన వనరుగా కొనసాగుతుందనే అభిప్రాయం ఉంది.

చరిత్ర చెబుతున్న ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే యుద్ధాలు ఎప్పుడూ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తాయి. ముఖ్యంగా చమురు వంటి వ్యూహాత్మక వనరుల విషయంలో యుద్ధాల ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది. 1973 చమురు సంక్షోభం దీనికి స్పష్టమైన ఉదాహరణ. ఆ సంఘటన ప్రపంచాన్ని ఇంధన రాజకీయాల గురించి కొత్తగా ఆలోచించేటట్లు చేసింది. ప్రస్తుతం కూడా పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచం మళ్లీ అదే భయాలను ఎదుర్కొంటోంది. యుద్ధం మరింత విస్తరించినట్లయితే చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అందువల్ల శాంతి, దౌత్య చర్చలు, అంతర్జాతీయ సహకారం ద్వారా సమస్యలను పరిష్కరించడం మాత్రమే శాశ్వత మార్గం. యుద్ధం వల్ల కలిగే నష్టాలను చరిత్ర ఎన్నోసార్లు చూపించింది. ప్రపంచ దేశాలు గత అనుభవాలను గుర్తు చేసుకొని సమన్వయంతో ముందుకు సాగితేనే చమురు సంక్షోభాల నుంచి ప్రపంచం బయటపడగలదు.



సంగనబట్ల
9440595494

# ప్రైవేటు రంగం చేతుల్లో ప్రాణాలు

ప్రకృతి సహజమైన నీరు సకల జీవ రాసులకు సహజంగా లభించాలి. నీటిని తాగు, సాగు అవసరాలకు ప్రజలకు అందేలా చూడటం ప్రభుత్వాల బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చడంలో అత్యధిక దేశాల పాలక ప్రభుత్వాలు విఫలం అయ్యాయి. సహజమైన నీటి వనరులు లేక పోతే మానవ మనుగడ ప్రశ్నార్థక మారుతుంది. ఇంతటి ప్రాధాన్యత గల సహజ నీరు ని ప్రపంచ వ్యాప్తంగా ప్రైవేట్ పరం చేయడం తీవ్రమైంది. ప్రపంచ వ్యాప్తంగా నీటి వ్యాపారం పెద్దఎత్తున కొనసాగుతూ ఉన్నది. అనేక దేశాలు బడా కంపెనీల నీటి వ్యాపారానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి.2023 నాటికి సుమారు 303బిలియన్ల అమెరికా డాలర్ల నుంచి 333 బిలియన్ల డాలర్లకు పెరిగింది. 2030-32 నాటికి 430 నుంచి 538 బిలియన్ల అమెరికా డాలర్ల కు చేరుతుందని ఆర్థిక నిపుణుల అంచనాగా ఉంది. వివిధ దేశాల్లో బహుళ జాతి సంస్థలు ప్రభుత్వాల నుంచి నీటి హక్కులు పొంది నీటి వ్యాపారం ద్వారా వేల కోట్ల రూపాయలు తరలించుకు పోతున్నాయి. ఫలితంగా సహజ నీటి వనరులపై ప్రజలు హక్కులు కోల్పోతున్నారు. 1992లో డబ్లిన్ వాటర్ కాన్ఫరెన్స్, వరల్డ్ వాటర్ విజన్ నీటిని ఒక ఆర్థిక వస్తువుగా అంటే సరుకుగా అభివర్ణించింది. జీవించే హక్కు అనేది ప్రజల మౌలిక హక్కు. ఆహారం, నీరు, గూడు ప్రజల మౌలిక హక్కుల్లో భాగం. నీరు లేక పోతే జీవితమే ఉండదు. అది ప్రజల హక్కు. నీరును సరుకుగా మారడం నేరం.

ఏ ప్రైవేటీకరణ అయినా,అది ప్రజల కోసం కాదని, బడా వ్యాపారుల కోసమే అన్నది వాస్తవం. నీటి ప్రైవేటీకరణ జరగడం వల్ల ఉచితంగా అందించాల్సిన తాగు నీరు డబ్బులు చెల్లించి కొనుక్కోవాలి. ప్రైవేట్ కంపెనీలు అధిక మొత్తంలో లాభాలు గడించడమనే కోణం నుంచి నీటి నిర్వహణకు సంబంధించిన నిర్ణయాలు ఉంటాయి తప్ప ప్రజల అవసరాలను, దీర్ఘకాలిక మనుగడ దృక్పదం ఉండదు. బహుళజాతి సంస్థలు, ప్రపంచ బ్యాంక్, ఐ ఎం ఎఫ్ ల ద్వారా పబ్లిక్ నీటి వనరులను ప్రైవేటికరించి తమతో కాంట్రాక్ట్ కుదుర్చుకోవాలని అర్ధ వలస దేశాలపై విపరీతమైన వత్తిడి చేస్తున్నాయి. నీటి ప్రైవేటీకరణ మొదట లాటిన్ అమెరికాలో ప్రారంభమైంది. నేడు ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలకు విస్తరించింది. ఇందుకు ప్రపంచ బ్యాంకు, ఐ ఎం ఎఫ్ పాత్ర కీలకంగా ఉంది. వెనకబడిన దేశాలకు రుణాలు మంజూరు చేసేటప్పుడు నీటిని ప్రైవేటీకరణ చేయాలనే షరతులు విధిస్తున్నాయి. ప్రైవేట్ కంపెనీలు అత్యధిక లాభాలకు నీటిని అమ్మడం అంటే, అత్యంత మౌలిక అవసరమైన నీటిని సాధారణ ప్రజలకు నిరాకరించడమే. 75% వరకు నీటి వ్యాపారం కొన్ని యూరోపియన్ దేశాల, అమెరికా బహుళ జాతి సంస్థల అదుపు లో ఉంది. నీటి ప్రైవేటీకరణ వల్ల అనేక దేశాల్లో నీటి బిల్లులు విపరీతంగా పెరిగాయి. భారతదేశంలో నీటి ప్రైవేటీకరణ: భారతదేశంలో మార్చి నుంచి వేసవి ప్రారంభమై ఎండలు తీవ్రం దాలుస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో 40 డిగ్రీల పైగా వేడి గాలులు నమోదు అవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో తాగు నీటి సమస్య తీవ్రం కానుంది. సామాన్య ప్రజలు కిలోమీటర్ల దూరం మండుటెండలో నడచి వెళ్లి గుంటల నుంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత పాలక ప్రభుత్వాలు నేటి మోదీ ప్రభుత్వం తాగు నీటిని ప్రజలకు అందించే విధానాలు చేపట్టకుండా,



ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంకు కనుసన్నుల్లో దేశ జల విధానాలు రూపొందించి నీటి ప్రైవేటీకరణ విధానాలు అమలు జరిపాయి, జరుపుతున్నాయి. 2002 లో భారత ప్రభుత్వం జాతీయ జల విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ విధానం ప్రకారం ఎక్కడ సాధ్యమైతే అక్కడ జల వనరుల ఫ్లాషింగ్, అభివృద్ధి, నిర్వహణ కోసం ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఒక దశాబ్దం కాలంలోనే దేశంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో నడిచే ప్రాజెక్టుల సంఖ్య 300 చేరింది. నీటి సరఫరాలో ఇతర దేశాల్లో లాగానే భారత్ లోనూ ప్రైవేట్ రంగం విఫలమైంది. టాటా సమూహానికి చెందిన జే యూ ఎస్ సి ఓ జెంషెడ్ పూర్ తో పాటు మైసూర్, భోపాల్, గ్వాలియర్, కలకత్తా, హాల్దియా, ముజఫర్ పూర్, చెన్నయ్ నగరాల్లో జల నిర్వహణ బాధ్యతలు తీసుకుని విఫలం అయ్యాయి. జాతీయ జల విధానం రాక ముందే భారతదేశం జల వనరుల ప్రైవేటీకరణ ప్రారంభమైంది. శివనాథ్ నదిలో 23 కిలోమీటర్ల దూరం పాటు రేడియస్ వాటర్ సప్లయ్ కి 22 సంవత్సరాల పాటు మధ్యప్రదేశ్ ప్రభుత్వం 1998లో ఒక కార్పొరేట్ సంస్థకు లీజుకి ఇచ్చింది. ఫలితంగా మొదటి సారి ఒక నదికి కార్పొరేట్ సంస్థ కంచె వేసింది. ఆ పరిధిలోని గ్రామాల ప్రజలు నీటిని వాడుకోవడం పైనా, చేపల వేట పైనా నిషేధానికి గురయ్యారు. సూయజ్, లివెండి, థేమ్స్ వాటర్, బెకెల్డ్ వంటి పెద్ద బహుళజాతి కంపెనీలు భారతదేశంలో నీటి ప్రాజెక్టులు నడుపుతున్నాయి. నీటి వ్యాపారం ద్వారా బడా కంపెనీలు వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తుండగా, ప్రజల జేబులు మాత్రం ఖాళీ అవుతున్నాయి.1990లో పార్లే కంపెనీ భారతదేశంలో బిస్లరీ పేరుతో వాటర్ బాటిల్స్ ప్రవేశ పెట్టింది. నేడు దేశంలో 3వేల ఆర్గనైజ్డ్ కంపెనీలు మరో12వేల అన్-ఆర్గనైజ్డ్ కంపెనీలు ఉన్నాయనే అంచనా ఉంది.

పెప్సి, కోకాకోలా బహుళజాతి కంపెనీలు ఆక్వాఫీనా, కిన్లీ వంటి బ్రాడ్లతో నీటి వ్యాపారం ద్వారా వేల కోట్ల భారత సంపదను కొల్లగొడుతున్నాయి. బిస్లరీ, కీన్లే, ఆక్వాఫీనా, బెయిలా, హిమాలయన్ మినరల్ వాటర్, మానిక్ చంద్ ఆక్సీరిస్ మినరల్ వాటర్, టాటా వాటర్ ప్లస్, రైల్ నీర్ లు భారతదేశంలో అతిపెద్ద వాటర్ కంపెనీలు. 2022 నాటికి భారత్ లో 43,663 కోట్ల నీటి వ్యాపారం జరిగింది. 2025-26 నాటికి మార్కెట్ నీటి విలువ 69 వేల కోట్ల రూపాయలుగా ఉందనే అంచనా వేయబడింది. 2026 నాటికి భారతదేశంలో రోజు తలసరి వాటర్ వినియోగం 35 లీటర్లకు మించి ఉండి, 2031 నాటికి సుమారు లక్షా,2వేల కోట్ల మార్కెట్ పరిమాణానికి చేరుకుంటుందని ఆర్థిక వేత్తల అంచనా గా ఉంది. వాటర్ వ్యాపారంలో లాభాలు 20% నుండి 60% వరకు ఉండే అవకాశం ఉంది. బడా సంస్థల నీటి వ్యాపారం ప్రమాదంగా మారి 2050 నాటికి భారతదేశంలో నీటి సంక్షోభం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని అనేక నివేదికలు తెలుపుతున్నాయి. ఈ పరిస్థితులు ఏర్పడ కుండా ఉండాలంటే సహజ నీటి వనరులపై ప్రజల దే హక్కుని, నీటి వనరులను ప్రైవేటీకరణ చేసే హక్కు ప్రభుత్వాలకు లేదని, బహుళజాతి సంస్థల నీటి వ్యాపార అనుమతులు రద్దు చేయాలని భారత ప్రజలు ఉద్యమించాలి.




బొల్లిముంత సాంబశివరావు
9885983526

# సర్వరోగ నివారిణి నాణ్యమైన నిద్ర

నేటి అత్యాధునిక వేగవంతమైన డిజిటల్ యుగంలో ఒత్తిడి, టెక్నాలజీ, రోజుకు దాదాపు 10 గంటల విధి నిర్వహణ లాంటి సవాళ్ల నడుమ గాఢ నిద్ర ఒక అరుదైన అనుభవం అవుతున్నది. నిద్ర ఒక సాధారణ విశ్రాంతి మాత్రమే కాదు నాణ్యమైన నిద్రతో శారీరక, మానసిక, భావోద్వేగ ఆరోగ్యం సిద్ధిస్తుంది. నాణ్యమైన నిద్ర వల్ల జ్ఞాపక శక్తి, రోగ నిరోధకత, ఉత్పత్తి పెరుగుతాయి. మానవ శారీరక మానసిక ఎదుగుదలకు పునాదిగా మంచి నిద్ర ఉపకరిస్తున్నది. 2008 నుంచి ప్రతి ఏట వసంత కాలంలో సమరాత్రి (రాత్రి పగలు సమాన గంటలు) రోజు, అనగా మార్చి 10 - 20 తారీఖల మధ్య వచ్చే శుక్రవారం రోజున, అనగా 13 మార్చి 2026 రోజున “ప్రపంచ నిద్ర దినోత్సవం(వరల్డ్ స్లీప్ డే)”పాటించడం జరుగుతోంది. ప్రపంచ నిద్ర దినోత్సవ వేదికగా ప్రజల్లో నిద్ర ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు నిద్ర లేమి ఫలితాల వివరణ, ఆరోగ్యకర నిద్ర అలవాట్లు, నిద్ర ప్రయోజనాలు లాంటివి చర్చించడం జరుగుతున్నది.

ఒక నిష్కల్మష నవ్వు, నాణ్యమైన నిద్ర అనేవి అనేక రోగాల నివారణకు ఉత్తమ ఔషధాలని భావించాలి. నిద్ర అనేది ఒక రకమైన ధ్యానం లాంటిది. మన భవిష్యత్తు మనం కనే కలల మీద ఆధారపడి ఉన్నందున, నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం మన కనీస అవసరం అని తెలుసుకోవాలి. నిరాశకు ఆశకు మధ్య వారధిగా నాణ్యమైన రాత్రి నిద్ర ఉపయోగపడుతుందని మరువరాదు.



### నాణ్యమైన నిద్ర ఆరోగ్య ప్రయోజనాలు

మంచి నిద్ర ద్వారా వ్యక్తుల నిర్ణయం తీసుకునే సామర్థ్యం, పనిలో ఏకాగ్రత, ఉత్తమ ఉత్పత్తి లాంటి ప్రధాన ప్రయోజనాలు వస్తాయి. నాణ్యమైన నిద్రతో భావోద్వేద నియంత్రణ, స్థిరమైన మానసిక స్థితి, ఒత్తిడి లేమి, సమస్యల పరిష్కార సామర్థ్యం, చురుకైన శారీరక కదలికలు, సరైన జీర్ణక్రియ, సక్రమ జీవక్రియలు, కండరాల రిపేర్, హార్మోన్ల ఉత్పత్తి, సరైన బీపీ, హృద్రోగాల కట్టడి లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. నిద్ర లేమి వల్ల మానసిక చంచలత్వం, చికాకు, ఒత్తిడి, ఆందోళన లాంటి పలు అనారోగ్యాలు కలుగుతాయి.

### ప్రపంచ నిద్ర దినోత్సవం-2026 ఇతివృత్తం

2026 ప్రపంచ నిద్ర దినోత్సవం ఇతివృత్తంగా “నాణ్యమైన నిద్ర పొండి, ఆరోగ్యంగా జీవించండి (స్లీప్ వెల్, లివ్ బెట్టర్)” అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. నిద్ర వల్ల శరీర అవయవాలన్నీ విశ్కడరాంతి తీసుకుంటాయనే అభిప్రాయం సరైనది కాదు. వ్యక్తి నిద్రలో ఉన్నపుడు తన శరీర అవయవాలు, మెదడు చురుకుగా పని చేస్తూ మన సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఉత్పాదకత, భావోద్వేగ సమతాస్థితి ఒనగూడుతాయి. ఒక సాధారణ వయోజనుడు ప్రతి రోజు 7 - 9 గంటలు నిద్ర పోవడం జరుగుతుంది. పని ఒత్తిడిలో తరుచుగా నిద్రకు సరైన సమయం కేటాయించని యెడల నిద్రలేమి వల్ల ప్రాణాంతక వ్యాధులు కూడా అనుభవించాల్సి వస్తుందని తెలుసుకోవాలి.

ప్రపంచ నిద్ర దినోత్సవం వేదికగా నిద్ర ప్రాధాన్యతను ప్రచారం చేయడంతో పాటు నిద్రలేమి దుష్ఫలితాలను వివరించడం జరుగుతుంది. నిద్రతో ఆరోగ్యానికి ఉన్న ప్రత్యక్ష సంబంధాలను వివరించడం, నిద్ర కేంద్రంగా సెమినార్ల నిర్వహణ, నిద్ర పట్ల లోతైన పరిశోధనల అవసరం, నిద్ర లేమి సవాళ్లు, సడలింపు పద్ధతులు, ఉత్పాదకతకు చేయూత, నాణ్యమైన జీవనశైలి పాటించడం లాంటి అంశాలను చర్చించడం జరుగుతుంది. ఒక నిష్కల్మష నవ్వు, నాణ్యమైన నిద్ర అనేవి అనేక రోగాల నివారణకు ఉత్తమ ఔషధాలని భావించాలి. నిద్ర అనేది ఒక రకమైన ధ్యానం లాంటిది. మన భవిష్యత్తు మనం కనే కలల మీద ఆధారపడి ఉన్నందున, నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం మన కనీస అవసరం అని తెలుసుకోవాలి. నిరాశకు ఆశకు మధ్య వారధిగా నాణ్యమైన రాత్రి నిద్ర ఉపయోగపడుతుందని మరువరాదు.

*(13 మార్చి “ప్రపంచ నిద్ర దినోత్సవం” సందర్భంగా)*



మధుసూదన్ రెడ్డి
9949700037



# గ్రేటర్ హైదరాబాద్



## నీలం ఇంజెటికి పీహెచ్‌డీ



**పటాన్చెరు, మార్చి 12 (వుదయం):**

ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థిని నీలం ఇంజెటిని డాక్టరేట్ వరించింది. 'ప్రయోగాత్మక జంతువులలో నాడీ సంబంధిత రుగ్మతలకు వ్యతిరేకంగా సంభావ్య మూలికల యొక్క న్యూరోప్రొటెక్టివ్ ప్రభావం' అనే అంశంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ పరిశోధన అల్జీమర్స్ వ్యాధిని పరిష్కరించడంలో ఔషధ మొక్కల యొక్క న్యూరోప్రొటెక్టివ్ సామర్థ్యాన్ని అన్వేషించినట్టు తెలియజేశారు. సాంప్రదాయకంగా మూలికా వైద్యంలో ఉపయోగించే మొక్కలైన ఇండిగోఫెరా ప్రోస్ట్రాటా, లాంటానా కమారా యొక్క ఫైటోకెమికల్, చికిత్సా లక్షణాలపై ఈ అధ్యయనం దృష్టి సారించిందన్నారు. సిలికో మాలిక్యులర్ డాకింగ్, జీసీఎంఎస్ విశ్లేషణ, ప్రయోగాత్మక జంతు అధ్యయనాలలో అధునాతనమైన పురోగతి ద్వారా, పరిశోధన అమిలాయిడ్‌బీటా, ఎసిటైల్ కోలినెస్టెరేస్‌తో సహా కీలకమైన అల్జీమర్స్ వ్యాధి లక్షణాలతో మొక్కల నుంచి ఉత్పన్నమైన సమ్మేళనాల యొక్క ఆశాజనక పరస్పర చర్యలను ప్రదర్శించినట్టు వివరించారు. ప్రయోగాత్మక నమూనాలలో గణనీయమైన యాంటీ ఆక్సిడెంట్ కార్యకలాపాలు, జ్ఞాపకశక్తి, అభ్యాసంలో మెరుగుదల కూడా ఈ పరిశోధన ఫలితాలు తేల్చాయని, ఇది మొక్కల బలమైన న్యూరోప్రొటెక్టివ్ సామర్థ్యాన్ని వెల్లడిస్తోందన్నారు. ఈ మూలికా వనరులు అల్జీమర్స్ వ్యాధికి కొత్త చికిత్సా విధానాల అభివృద్ధికి దోహదపడతాయని, తదుపరి క్లినికల్ పరిశోధనలను ప్రోత్సహిస్తాయని అధ్యయనం సూచిస్తున్నట్టు తెలిపారు. డాక్టర్ నీలం సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రైతుల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి దామోదర రాజనర్సింహ

**సంగారెడ్డి, మార్చి 12 (వుదయం):**



రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా ఆధునిక వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్ సముదాయ ఆవరణలో ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు మినీ ట్రాక్టర్లను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ముగ్గురు ఎస్సీ, ఎస్టీ రైతులకు ఒక్కోటి రూ.4.9 లక్షల విలువ గల 20 హెచ్‌పి కెపాసిటీ మినీ ట్రాక్టర్లను 60 శాతం సబ్సిడీతో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వ్యవసాయం మరియు ఉద్యాన రంగాల అభివృద్ధికి యాంత్రీకరణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులు ఆధునిక పద్ధతులు, యంత్రాలను వినియోగించి సాగు ఖర్చును తగ్గించుకోవడంతో పాటు ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. రైతుల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని, రైతులకు అండగా ప్రభుత్వం ఎల్లప్పుడూముందుంటుందని మంత్రి అన్నారు.

ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వరరావు, డీఆర్‌డీఓ జ్యోతి తదితర జిల్లా అధికారులు, సంబంధిత లబ్ధిదారులు పాల్గొన్నారు.



## సహనం, సేవా భావానికి ప్రతీక రంజాన్

### కాంగ్రెస్ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, మార్చి 12 (వుదయం ప్రతినిధి ):**

రంజాన్ పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ముస్లిం సోదరులకు తోడ్పాటు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న "ఈద్ కా తోఫా" (రంజాన్ కానుక) పథకం పంపిణీ కార్యక్రమం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతి నగర్‌లోని మసీద్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై మసీదుల ద్వారా అర్హులైన ముస్లిం కుటుంబాలకు ఈద్ కా తోఫాలు (దుస్తులు, ఇతర నిత్యావసర వస్తువులు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రంజాన్ పండుగ సోదరభావం, సహనం, సేవా భావానికి ప్రతీక అని అన్నారు. పేద, అవసరమైన కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈద్ కా తోఫా పథకం వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుధీర్ రెడ్డి, మహమ్మద్ నబి , వాసు, మెడ శ్రీను, రమేష్, నారాయణ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, రఫియా బేగం, బికాంషా, సురేందర్ రెడ్డి, అరవింద్, రవీందర్, తులసి దాస్, ఆది రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, ఏ.వి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్య పట్ల ఆసక్తి పెంపొందించాలి

### బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, మార్చి 12 (వుదయం ప్రతినిధి) :**

126 జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరి గుట్ట లోని ఇన్ఫాంట్ జీసస్ స్కూల్ లో ప్రీ ప్రైమరీ గ్రేడ్ విద్యార్థులకు నిర్వహించిన "గ్రాడ్యుయేషన్ డే" కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....పిల్లల్లో విద్య పట్ల ఆసక్తి పెంపొందేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారికి కొంత సమయాన్ని కేటాయిస్తూ ఉన్నట్లయితే వారికి తల్లిదండ్రులకు మధ్య సంబంధం, క్రమశిక్షణ, మంచి వాతావరణం మరింత పెంపొంది వారి భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ ఏరువ బాల సుధీర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, సీనియర్ నాయకులు ఎండి. ఆజం, బ్రహ్మానంద్ చారి, ఇందిరా గౌడ్, మెట్ల శ్రీను, ఖయూమ్, కోల శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దలోడిలో ఉచిత వైద్య శిబిరం



**పెద్దలోడి మార్చి 12 (వుదయం):**

పెద్దలోడి గ్రామంలో సర్పంచ్ హనుమంతు రాజు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ బాచుపల్లి ప్రాంతానికి చెందిన మమత హాస్పిటల్ వైద్య సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొని గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు వివిధ రకాల వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా రక్తపోటు (బిపి), షుగర్ పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ప్రేమానంద్, వార్డు సభ్యులు అది రత్నం, కోరమని శంకర్, పత్తి శివకుమార్ పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు నరేష్, హనుమంత్, రాములు, ప్రహ్లాద్, చిట్కుల వీరేశం తదితరులు హాజరయ్యారు. గ్రామ యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య శిబిరాన్ని విజయవంతం చేశారు. గ్రామ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఈ శిబిరం ఉపయోగపడిందని గ్రామస్తులు తెలిపారు.


## కలిసి పనిచేస్తేనే అభివృద్ధి, సంక్షేమం

**రంగారెడ్డి, మార్చి 12 (వుదయం) :**



ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లకు, కౌన్సిలర్లకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులపై అనేక బాధ్యతలు ఉన్నాయని, ప్రజలతో మమేకమై పనులు చేసినప్పుడే ప్రజల మన్ననలను పొందుతారని అన్నారు. మున్సిపల్ పట్టణాలలో ప్రజలు అనేక సమస్యలతో ఉంటారని, వారి సమస్యలను తెలుసుకొని వాటిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా విద్యతోనే మార్పు వస్తుందని ప్రతి ఒక్కరు చదువుకునేలా చూడాలని, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు పారిశుధ్యం పై దృష్టిసారించాలని, మున్సిపాలిటీలను సవ్యంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ,వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక రూపొందించాలని, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలపై దృష్టి సారించాలని అన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులందరూ కలిసి పనిచేసి అభివృద్ధి, సంక్షేమాన్ని సాధించాలని కలిసికట్టుగా పనిచేస్తే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. అభివృద్ధితో పాటు, రోడ్డు భద్రత ,యువత మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండడం, తదితర సామాజిక అంశాలపై కూడా దృష్టి సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్లు కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**జహీరాబాద్ మర్చి 12 (వుదయం) :**

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని పస్తాపూర్ జర్నలిస్ట్ కాలనీ ఎదురుగా చలివేంద్రమును ప్రారంభించడం జరిగింది. మధు ఫోటోగ్రఫీ మధు తన తండ్రి గొల్ల రాములు జ్ఞాపకార్థంగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి విచ్చేసి రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి జ్ఞాపకార్థంగా మధు ఫోటోగ్రఫీ చలివేంద్రం ప్రారంభించడం అభినందనీయమన్నారు. చలివేంద్రాన్ని బాటసారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇలాంటి స్వచ్ఛంద కార్యక్రమాలలో భాగంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.

## ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

### జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి



**రంగారెడ్డి, మార్చి 12 (వుదయం) :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు దిగ్విజయం చేసేందుకు ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కాచారం గ్రామంలోని వర్ధమాన ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఒక రోజు శిక్షణ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి చేవెళ్ళ శాసన సభ్యులు కాలే యాదయ్యతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొనీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగా సర్పంచులు గా ఎన్నికైన అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, జిల్లా అధికారులు, మండలాల అధికారులు, సర్పంచులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్స్ స్వాధీనం



**సిద్దిపేట, మార్చి 12 (వుదయం ప్రతినిధి) :**

సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు, జిల్లా పోలీసులు పోగొట్టుకున్న చరవాణుల (మొబైల్ ఫోన్లు) కోసం ప్రత్యేక గాలింపు చేపట్టి, కేంద్ర పరికరాల గుర్తింపు నమోదు విభాగం (కేరిర్) పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించి 109 చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. వీటిని గురువారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, చరవాణి పోగొట్టుకున్నవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ (www.ceir.gov.in) ద్వారా వాటిని తిరిగి పొందవచ్చని సూచించారు. స్వాధీనం చేసుకున్న ఈ 109 చరవాణుల విలువ సుమారు పది లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు.చరవాణి పోయినప్పుడు నిర్లక్ష్యం వహిస్తే అది వ్యక్తిగత మరియు సామాజిక భద్రతకు ముప్పుగా మారుతుంది.వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో వివరాలు నమోదు చేసి, ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలి. ఎవరికైనా అపరిచిత చరవాణులు దొరికితే వెంటనే పోలీసులకు అందజేయాలి. ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 200 చరవాణులను రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు.సాంకేతికతను ఉపయోగించి వీటిని వెలికితీసిన బృందాన్ని, తనిఖీ అధికారి శ్రీధర్ గౌడ్ మరియు కానిస్టేబుల్ రమేష్‌ను కమిషనర్ గారు ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కుశాల్కర్, శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారిణి ఆయేషా ఫాతిమా, ఏసీపీలు రవీందర్, నర్సింలు మరియు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టు

### మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి, మార్చి 12 (వుదయం) :**



రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ వ్యవస్థను అమలు చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపకల్పన, అమలు పై రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమన్వయ సన్నాహక సమావేశం నిర్వహించారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంగారెడ్డి జిల్లాను డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు పైలెట్ జిల్లాగా ఎంపిక చేసిన నేపథ్యంలో, ప్రాజెక్టు అమలు విధానం, ముందస్తు ఏర్పాట్లు, అవసరమైన సాంకేతిక సదుపాయాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు.

పైలెట్ ప్రాజెక్టు అమలులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని మొత్తం 64 ప్రభుత్వ వైద్యశాలల్లో సేవలు పొందేందుకు వచ్చే ప్రతి రోగికి పూర్తి ఆరోగ్య వివరాలతో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించి డిజిటల్ హెల్త్ కార్డు జారీ చేయాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందులో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి-1, ఏరియా ఆసుపత్రులు-4, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు-5, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు-4, ప్రైమరీ హెల్త్ సెంటర్లు-31, బస్తీ దవాఖానాలు-19 ఉన్నాయి. రోగి ఆసుపత్రికి వచ్చిన మొదటి దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ఓపీ, మెడికల్ ఆఫీసర్, ల్యాబ్, ఫార్మసీ వంటి అన్ని విభాగాల్లో రోగి వైద్య చరిత్రను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధంగా అవసరమైన ఐటీ సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించాలని మంత్రి సూచించారు. అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యకు ఆదేశించారు. డిజిటల్ హెల్త్ కార్డు ద్వారా రోగి పూర్తి వైద్య చరిత్ర డిజిటల్ రూపంలో అందుబాటులో ఉండటం వల్ల వైద్యులు తక్షణమే సరైన చికిత్స అందించగలరని మంత్రి తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న ఎన్‌సీడీ, కమ్యూనికేబుల్ డిసీజెస్, ఎంసిహెచ్, చైల్డ్ హెల్త్ సేవలుతో పాటు క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి అవసరమైతే రిఫరల్ సిస్టమ్ ద్వారా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు పంపే అవకాశం ఉంటుందని చెప్పారు.

సంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్న ఈ పైలెట్ ప్రాజెక్టును అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ హెల్త్ కార్డు అమలు కోసం సంగారెడ్డిలో చేపట్టే ఈ ప్రాజెక్టు ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టు రూపకల్పనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు.

సమావేశంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చొంగ్తు, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో ఉదయ్ కుమార్, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యతో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, డి.ఆర్.డి.ఓ., ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు శిక్షణ

**షాద్‌నగర్ మార్చి 12 (వుదయం):**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సర్పంచులు, మున్సిపల్ చైర్మన్, చైర్‌పర్సన్, వార్డు సభ్యులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పలకవర్గానికి ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందేమోహన్ తదితర కౌన్సిలర్లు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు వచ్చి ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవు తాయని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే ఉటంకిస్తున్న విషయాన్ని వారు గుర్తు చేశారు. ప్రజలకు ఏ విధంగానైతే ప్రామాణికమైన ఫలితాలు అందుతాయో, ఆ కోణంలో ఈ శిక్షణా కార్యక్రమం ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగేలా ఉండాలన్నారు. ప్రత్యేక శిక్షణ తరగతులపై పాలకవర్గం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విశాల, జమాల్పూర్ సంతోషి బాయ్, నడికుడ శ్రావణి, ఎస్పీ శివ, సింగపగ శిరీష, ఒగ్గు జయలక్ష్మి, ఆరిఫా బేగం, గౌస్ జానీ, పెంటయ్య, రాజు నాయక్, పినమోని గోపాల్, పిల్లి శారద, సుధీర్, బచ్చలి నరేష్, మురళీ మోహన్ అప్పి, ప్యాట అశోక్, కళ్యాణ్ కార్ దిలీప్, కొప్పునూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు..

## అంబరానంటిన మహిళా దినోత్సవ సంబరాలు





**పటాన్చెరు (వుదయం) :**

పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి ల ఆధ్వర్యంలో గురువారం పటాన్చెరు పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అంబరాన్ని అంటాయి. నియోజకవర్గ పరిధిలోని మహిళా ప్రజాప్రతినిధులు, వేలాదిమంది మహిళలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ అంశాలపై ప్రముఖులచే ఉపన్యాసాలు, బహుమతుల పంపిణీ కార్యక్రమాలు అందరిని ఉత్సాహపరిచాయి.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఒక కుటుంబంలో మహిళా విద్యావంతురాలు అయితే ఒక తరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. సర్వైకల్ క్యాన్సర్ విముక్తి కోసం ప్రభుత్వం అందిస్తున్న హెచ్ పీ వీ వ్యాక్సిన్ ను బాలికలతో మొదలు మహిళలందరూ వేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన పక్షంలో పటాన్చెరు నియోజకవర్గంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతి మహిళకు వ్యాక్సిన్ అందిస్తామని హామీ ఇచ్చారు. గత 25 సంవత్సరాలుగా పటాన్చెరు కేంద్రంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆడ కూతురు ఉన్నత చదువులు చదువుకోవాలన్న సమున్నత లక్ష్యంతో పటాన్చెరు పట్టణంలో కేజీ నుండి పీజీ వరకు ఆధునిక వసతులతో ప్రభుత్వ విద్యాసంస్థలు నెలకొల్పడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని కోరారు.

జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు వంటిల్లు నుండి అంతరిక్షం వరకు తమ సత్తా చాటుతున్న నేటికీ గృహ హింసకు గురి కావడం బాధాకరమన్నారు. మహిళల పట్ల మార్పు తమ గృహాల నుండే మొదలు కావాలని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మహిళల ఆర్థిక సమృద్ధికి పెద్దపీట వేస్తూ వేల కోట్ల రూపాయలు కేటాయించారని గుర్తు చేశారు. ప్రముఖ వైద్యులు, ఎమ్మెల్యే జిఎంఆర్ కోడలు గూడెం కిరణ్మయి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళా విజయం వెనుక ఎందరో మహిళల త్యాగం నెలకొని ఉందని తెలిపారు. మహిళ ఆర్థిక అభ్యున్నతి, ఉన్నత అవకాశాలు పొందాలంటే సంపూర్ణ సహకారం అందించాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కుటుంబానికి వెన్నెముకగా నిలిచే మహిళ తన ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు మహిళల పట్ల ఏ విధంగా ప్రవర్తించాలో బాల్యం నుండే అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ కవితా రెడ్డి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ఆర్తి, ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, గూడెం కల్పన మధుసూదన్ రెడ్డి లు ప్రసంగించారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఆదాయ వనరుల పెంపు

**గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి**

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

జయశంకర్ భూపాలపల్లి మార్చి 12 (వుదయం జిల్లా ప్రతినిధి):



ఆదాయ మార్గాలను పెంచుకుని గ్రామాలను, పట్టణాలను అభివృద్ధి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాలులో సర్పంచులు, కౌన్సిలర్లుకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విరిగిన వంగిన విద్యుత్తు పోల్స్, విద్యుత్తు వైర్లు, ఇండ్లపై నుండి వెళ్తున్న 11 కెవి విద్యుత్తు వైర్లు గుర్తించి వాటిని తొలగించాలని తెలిపారు. విరిగిన పోల్స్ స్థానంలో నూతన పోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. 99 రోజుల ప్రణాళికలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పంచాయతిలు, మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా తయారు చేయాలని తెలిపారు. వ్యర్థాలు తొలగించాలని, మురుగు కాల్వలు పరిశుభ్రం చేయాలని తెలిపారు. ప్రజలను ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని, శిక్షణ ద్వారా ఆచరణలో అమలు చేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణంలో కోతులు, కుక్కల బెడద నివారణకు స్థానిక వనరులు ద్వారా ఆదాయం సమకూర్చుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, 14 నుండి 15 సంవత్సరాలు మధ్య వయస్సున్న బాలికలు గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ బారిన పడకుండా హెచ్ పివి వాక్సిన్ వేయించాలని తెలిపారు. జిల్లాలోని 2425 మంది బాలికలను గుర్తించామని వారందరు తప్పకుండా వాక్సిన్ తీసుకునే విధంగా అవగహన కల్పించాలని తెలిపారు. అలాగే మహిళా సంఘాలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. మార్చి 6 నుండి జూన్ 12వ తేదీ వరకు శాఖల వారిగా చేపట్టాల్సిన కార్యక్రమాల షెడ్యూల్ వివరించారు. గ్రామాలు, మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి జాబితా తయారు చేసి ప్రజలకు తెలియ చేయాలని తెలిపారు. ఈ నెల 3వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. గ్రామాలు, పట్టణంలో సర్పంచు లు, చైర్మన్లు ఈ కార్యక్రమాన్ని ఒక మూవ్ మెంట్ లాగా చేసి పరిశుభ్ర గ్రామాలు, పట్టణాలుగా తయారు చేయాలని స్పష్టం చేశారు. అన్ని గ్రామాల సర్పంచు లకు, మున్సిపల్ చైర్మన్ కు 99 రోజుల కార్యక్రమం షెడ్యూల్ ఇచ్చామని తుచ తప్పక పాటించాలని తెలిపారు. అనంతరం పంచాయతి, మున్సిపల్, వైద్య, పోలీస్, రవాణా, సంక్షేమ శాఖల అధికారులు, వ్యవసాయ, ఎక్సైజ్, విద్యా,

యువజన సర్వీసులు క్రీడల శాఖ, అటవీ శాఖల అధికారులు ఆయా శాఖల ద్వారా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి ,

ఆర్డిఓ హరికృష్ణ, ఎఎస్పీ నరేష్ కుమార్మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతికి ప్రజాప్రతినిధులే వారధులు



- ★ 99 రోజుల కార్యచరణపై అవగాహన సదస్సు
- ★ గ్రామాలు,డివిజన్ల అభివృద్ధే ధ్యేయంకావాలి
- ★ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపు

హనుమకొండ, మార్చి 12 (వుదయం జిల్లా ప్రతినిధి) :

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యచరణలో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు నిర్వహించిన అవగాహన సదస్సును మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాలు, డివిజన్ల అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. గ్రామ అభివృద్ధిలో ఎన్నారైలు, పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాకు అత్యధిక నిధులు కేటాయించారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీలు కేవలం ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా సొంత వనరుల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. వరంగల్ నగరం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం నిధులు కేటాయించినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ.. 10 ముఖ్య అంశాలతో 99 రోజుల కార్యచరణను రూపొందించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో అంగన్ వాడీలు, ప్రకృతి వనాలు ఆదర్శవంతంగా ఉండాలన్నారు. గ్రామ పంచాయతీలకు ఇంటి పన్నులు, భవన నిర్మాణ అనుమతుల ద్వారా రెవెన్యూ పెంచేందుకు సర్పంచులు కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రభుత్వ పథకాలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను ప్రతినిధులు తిలకించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, ఆర్డీవో రాథోడ్ రమేష్, జడ్పీ సీఈవో శేషాద్రి, వివిధ విభాగాల అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ఫోటో ప్రదర్శనను వీక్షించిన జిల్లా కలెక్టర్

హనుమకొండ, మార్చి (వుదయం ప్రతినిధి) :

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమం సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో హన్మకొండ కలెక్టరేట్ లో గురువారం రోజున ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ను జిల్లా కలెక్టర్ చాహేత్ బాజ్ పాయి తిలకించారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, ముఖ్యంగా పారిశుద్ధ్యం మరియు ఇతర థీమ్లపై జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే విధంగా ఈ ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. వివిధ శాఖల ద్వారా అమలు చేసిన పనులు, ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించిన కార్యక్రమాలు,

సాధించిన ప్రగతిని చిత్రాల రూపంలో ప్రదర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రదర్శనలోని చిత్రాలను ఆసక్తిగా పరిశీలించి, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరే విధంగా అవగాహన కల్పించడంలో ఇటువంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ రవి, డిఆర్డిఓ మేన శ్రీను సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఎంఈఓగా రాజేశ్వరరావుకు అవార్డు



ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘన సత్కారం

సత్తుపల్లి ,మార్చి 12 (వుదయం ప్రతినిధి)

తెలంగాణ ప్రభుత్వ స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) నక్కా రాజేశ్వరరావుకు "ఉత్తమ ఎంఈఓ" అవార్డును ప్రదానం చేశారు. మండలంలో విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం, మధ్యాహ్న భోజన పథకాన్ని విజయవంతంగా నిర్వహించడం, విద్యార్థులు, ఉపాధ్యాయులకు అంకితభావంతో సేవలందించడం, అక్షరాస్యత అభివృద్ధికి కృషి చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం రాజేశ్వరరావును ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చీకటి శ్రీనివాస రావు, పులి శ్రీనివాసరావు,

నాయుడు వెంకటేశ్వరరావు, పసుపులేటి నాగేశ్వరరావు, ఎదుల్ల మురళి తదితరులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మెగా వైద్య శిబిరం



నర్సంపేట మార్చి 12 వుదయం ప్రతినిధి.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భానుజీపేట ఏ ఏ ఎం నర్సంపేట -3 లో స్పెషలిస్ట్ వైద్యులచే మెగా వైద్య శిబిరాన్ని డాక్టర్ జూనిద్ కాన్ ఆధ్వర్యంలో స్పెషలిస్ట్ డాక్టర్లు రోగులను పరీక్షించి రక్తన మూనాలను సేకరించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేసినారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ శ్రవణ్ కుమార్ మరియు పల్లె దావకాన వైద్యాధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మన్ననలే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు పని చేయాలి

- శిక్షణ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలి
- గ్రామ పంచాయతీ నిధులను ప్రణాళిక బద్ధంగా వినియోగించాలి
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి, జిల్లా కలెక్టర్

ఖమ్మం, మార్చి 12 (వుదయం ప్రతినిధి)



ఫలానా నాయకుని హయంలో మా ప్రాంతం బాగా అభివృద్ధి చెందిందని ప్రజల మన్ననలు పొందేలా ప్రజా ప్రతినిధులు పని చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, గురువారం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో

నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచులు, మునిసిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్ లు, ఇతర ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి, రాష్ట్ర కేబినెట్ ఆలోచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నామని, ప్రజల కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గురించి అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన లబ్ధిదారు లకు అవి చేరేలా చూడాలని తెలిపారు.

డబ్బు సంపాదించడం కోసం ప్రజా ప్రతినిధులు ఎవరు రాజకీయంలోకి రాలేదని అన్నారు. సర్పంచ్ నుంచి కలెక్టర్ వరకు ప్రజలకు సేవ చేసే అవకాశం భగవంతుడు మనకు అందించారని, మనం అధికారంలో ఉన్న సమయంలో గ్రామంలో మంచి అభివృద్ధి జరిగింది, మంచి పనులు జరిగాయనే మంచి పేరు సంపాదించాలని తాపత్రయ పడతామని మంత్రి అన్నారు.ఓట్లు వేసిన ప్రజలకు మంచి చేయాల్సిన బాధ్యత మనపై నేడు ఉందని అన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కొంత సమయం కేటాయిస్తే క్షేత్రస్థాయిలో మంచి మార్పు కనిపిస్తుందని అన్నారు. పాలక వర్గాలు లేక గ్రామాలకు నిధులు రాలేదని, గత నెలన్నర కాలంలో పెద్ద ఎత్తున నిధులు విడుదల అయ్యాయని, మార్చి 31 లోపు మరిన్ని నిధులు విడుదల అవుతాయని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామానికి జనాభా ఆధారంగా 5 లక్షల నుంచి 60 లక్షల రూపాయల వరకు నిధులు విడుదల అయ్యాయని, ఈ నిధులు ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని అన్నారు. చట్ట పరిధిలో నిధులను సద్వినియోగం చేయాలని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా కాపలాదారుగా ఉండాలని తెలిపారు.పేద ప్రజలకు నిరంతరం మంచి చేసే విధంగా, రాజకీయాలకతీతంగా ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం గెలిచిన ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి ఆ ప్రాంతాల అభివృద్ధి కోసం పని చేయాలని కోరారు. ప్రతి ప్రాంత అభివృద్ధికి పార్టీలకతీతంగా తన సహకారం ఉంటుందని ఆయన తెలిపారు.

రాబోయే వేసవిలో త్రాగునీటి సమస్య ఏ గ్రామంలో లేకుండా ఉండే విధంగా అధికారులు, నూతన ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని మంత్రి సూచించారు. గ్రామ పంచాయతీకి విడుదలైన నిధులు సద్వినియోగం అయ్యే విధంగా ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు తెలిపారు.గ్రామాలలో సమస్యలు కేవలం డబ్బుతో మాత్రమే పరిష్కారం కావని అన్నారు. సిసి రోడ్ల, డ్రైయిన్ నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టడం చాలా కీలకమని అన్నారు. గ్రామాలలో నిర్మించే నూతన రోడ్లు, డ్రైయిన్ సమయంలో అధికారులు ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ అధికంగా ఉండాలని, ఎక్కడ కూడా మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. ప్రజలతో నిరంతరం ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉంటూ సమయస్ఫూర్తితో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని అన్నారు. నేటి శిక్షణ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు సరిగ్గా వినియోగించు కోవాలని సూచించారు.<

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతం చేసేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయడం కీలకమని తెలిపారు. 99 రోజుల కార్యక్రమం పై స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు

ప్రజా ప్రతినిధులకు గుర్తింపు కార్డులు, 99 రోజుల కార్యక్రమంపై మెటీరియల్ అందించామని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల పాటు 10 థీమ్స్ లో చేపట్టే ప్రోగ్రాంలలో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం, ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలైన వివిధ సంక్షేమ, అభివృద్ధి పనుల అమలు గురించి అవగాహన, పంచాయతీ, మున్సిపల్ చట్టాల గురించి కూడా శిక్షణ అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

నేటి శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటే క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఇంటారాక్టివ్ సెషన్ లాగా నేటి శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమకు ఉన్న సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ కోరారు.సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచ్, పట్టణ ప్రాంత ప్రజా ప్రతినిధులకు విధి నిర్వహణ, ప్రభుత్వ ముఖ్యమైన కార్యక్రమాలు ప్రజలకు అందించేందుకు ఉన్న నిబంధనలు విధివిధానాల గురించి తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో 99 రోజుల కార్యాచరణ చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్క



ప్రజా ప్రతినిధి తమ గ్రామం, మున్సిపల్ వార్డు/డివిజన్ పరిధిలో నిబంధనల ప్రకారం బాగా పనిచేసి జాతీయస్థాయిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. సంబంధిత అధికారులు, సర్పంచులు, మునిసిపల్ చైర్ పర్సన్లు, వార్డు కౌన్సిలర్ లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

## సమన్వయంతోనే సంక్షేమం

**ప్రజాప్రతినిధులు, అధికారుల కలయికే పేదల ప్రగతికి బాట – మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

నల్గొండ,మార్చి 12 (వుదయం ప్రతినిధి)



ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా గురువారం నల్గొండ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, మున్సిపల్ కాన్సిలర్లకు ఉద్దేశించి ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులపై అనేక బాధ్యతలు ఉన్నాయని, ప్రజలతో మమేకమై పనులు చేసినప్పుడే ప్రజల మన్ననలను పొందుతారని అన్నారు. మున్సిపల్ పట్టణాలలో ప్రజలు అనేక సమస్యలతో ఉంటారని, వారి సమస్యలను తెలుసుకొని వాటిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని, ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, తన వంతు సహకారం మున్సిపాలిటీల అభివృద్ధికి ఎల్లప్పుడు ఉంటుందని మంత్రి వెల్లడించారు. ప్రతి ఒక్కరు చదువుకునేలా చూడాలని, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు పారిశుధ్యం పై దృష్టి సారించాలని, అలాగే బడ్జెట్ సమావేశాలు నిర్వహించి మున్సిపాలిటీలను సవ్యంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ,వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక రూపొందించాలని, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలపై దృష్టి సారించాలని అన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులందరూ కలిసి పనిచేసి అభివృద్ధి, సంక్షేమాన్ని సాధించాలని కలిసికట్టుగా పనిచేస్తే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. వన్నుల వసూలు పై కూడా దృష్టి పెట్టాలన్నారు. 10400 కోట్ల రూపాయలతో చేపట్టనున్న హైదరాబాద్– విజయవాడ జాతీయరహదారి విస్తరణ పనులకు టెండర్లు పిలవడం జరిగిందని ,320 కోట్ల రూపాయలతో నల్గొండ నుండి ధర్వేశిపురం వరకు రహదారి విస్తరణకు టెండర్లు పిలిచామని, మాల్ – హైదరాబాద్ లైన్ విస్తరణ పనులు కూడా చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.

నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ పథకాలను తెలుసుకొని అవగాహన పొందినప్పుడే క్షేత్రస్థాయిలో ప్రజలకు మంచి చేయగలుగుతారని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి శాఖల ద్వారా అమలు చేసే పలు ప్రభుత్వ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా, వీడియోల ద్వారా మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు అవగాహన కల్పించారు. పలువురు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన తమకు ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికతో పాటు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం సంతోషంగా ఉందని, ఇది తమకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ జే, శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపుకలెక్టర్,, నల్గొండ ఆర్ డి వై. అశోక్ రెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్,చండూరు ఆర్డీవో శ్రీదేవి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు

ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.

## ఎగ్జిబిషన్‌ను వీక్షించిన జిల్లా కలెక్టర్

**అభివృద్ధి–సంక్షేమ కార్యక్రమాలపై ఫోటో ఎగ్జిబిషన్‌ను వీక్షించిన జిల్లా కలెక్టర్**




సూర్యాపేట, మార్చి 12(వుదయం)

జిల్లా కేంద్రంలోని రవి మహల్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ గురువారం వీక్షించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిపిఆర్ఓ వల్లోజి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ఈ ఫోటో ఎగ్జిబిషన్‌లో వివిధ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన చిత్రాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.ఎగ్జిబిషన్ ఏర్పాట్లలో సీనియర్ అసిస్టెంట్ పి. సుధాకర్, రికార్డు అసిస్టెంట్ అనిల్ కుమార్, డ్రైవర్లు రహీం, అశోక్, నరేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, జడ్పీ సీఈఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చండూరు, (వుదయం విలేఖరి)

చండూరు మండలంలో ఈ నెల 14 నుంచి మొదయ్యే పదో తరగతి పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఈవో సుధాకర్ రెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గాంధీజీ పాఠశాల, సన్‌షైన్ పాఠశాలలను పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా ప్రభుత్వం ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.మండల వ్యాప్తంగా మొత్తం 632 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, మూడు పరీక్షా కేంద్రాల నిర్వహణకు వివిధ హోదాల్లో మండల స్థాయి అధికారులను నియమించినట్లు ఆయన వెల్లడించారు.



# ముగిసిన ధర్మకర్తల మండలి పదవీ కాలం

## ధర్మపురి ఆలయంలో నేటి నుంచి అధికారుల పాలన

**ధర్మపురి, మార్చి 12 (వుదయం ప్రతినిధి) :** ప్రాచీన పుణ్యక్షేత్రంగా పేరొందిన ధర్మపురి లక్ష్మీనరసింహా స్వామి దేవస్థానంలో కీలక పరిపాలనా మార్పులు చోటుచేసుకున్నాయి. ఆలయ ధర్మకర్తల మండలి పదవీకాలం గురువారంతో ముగియడంతో శుక్రవారం నుంచి ఆలయ వ్యవహారాలు పూర్తిగా అధికారుల పర్యవేక్షణలోకి వెళ్లాయి.ఇప్పటివరకు ఆలయ పరిపాలనను నిర్వహించిన 13 మంది సభ్యులతో కూడిన ధర్మక ర్తల మండలి తన పదవీకాలాన్ని పూర్తి చేసింది. మండలి గడువు ముగియడంతో ఆలయ దైనందిన కార్యకలాపా లు,పూజా కార్యక్రమాలు,భక్తులకు అందించే సేవలు ఇకపై ఎగ్జిక్యూటివ్ అధికారి సంక టాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొన సాగనున్నాయి.ఆలయ అర్చకు లు, వేదపండితులు,ఉద్యోగులు, సిబ్బంది విధులు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

### ధర్మకర్తల పదవికి ముగ్గురు ముందే రాజీనామా...

ధర్మకర్తల మండలి పదవీకాలం ముగియకముందే గత కొన్ని నెలల క్రితం ముగ్గురు ధర్మకర్తలు తమ పదవులకు రాజీనామా చేసినట్లు సమాచారం.వారి రాజీనామాకు కారణాలు ఆలయ అధికారులు కానీ, ధర్మకర్తల మండలి ఇప్పటివరకు ప్రకటించ లేదు.కొత్త ధర్మకర్తల మండలిని ప్రభుత్వం ఎప్పుడు నియమిస్తుందన్న దానిపై స్థానికుల్లో ఆసక్తి నెలకొంది. అప్పటి వరకు ఆలయ పరిపాలన పూర్తి గా అధికారుల ఆధీనంలోనే కొనసాగనుంది.

### బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.1.10 కోట్లు...

ఇటీవల ఆలయంలో నిర్వహిం చిన బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ముగిశాయి. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 11 వరకు 13 రోజుల పాటు జరిగిన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ ఉత్సవాల ద్వారా దేవస్థానానికి రూ.1.10 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు అధికా రులు తెలిపారు.గత ఏడాది బ్రహ్మోత్స వాల ముందు హుండీ లెక్కింపు జరిగేద ని,ఈ ఏడాది జాతర తరువాత హుండీ లెక్కించడంతో గత ఏడాది కంటే 14లక్షల ఎక్కువ ఆదాయం వచ్చిన్నట్లు కనబడితుందనిఈఓ తెలిపారు. సమ్మక్కసారక్కజాతర,చంద్రగ్రహ ణం కారణంగా ఆలయానికి సుమారు 30 లక్షల వరకు ఆదాయం తగ్గిందని ఈఓ శ్రీనివాస్ వెల్లడించారు.

### విజయవంతమైన ఉత్సవాలు...

బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో దేవస్థానం కార్యని ర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ కీలక పాత్ర పోషించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశాలు,సూచనల మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం, ప్రసాదాల పంపిణీ, అన్నదానం, భద్రత, తాగునీరు, వసతి వంటి ఏర్పాట్లను ముందుగానే ప్రణాళి కాబద్ధంగా చేపట్టడం ద్వారా ఉత్సవాలను సాఫీగా నిర్వహించినట్లు భక్తులు,స్థానికులు పేర్కొన్నారు. ప్రతి రోజూ జరిగే పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు, వాహనసేవ లను ఆయన స్వయంగా పర్యవేక్షించా రు. దేవస్థానం సిబ్బంది,అర్చకులు, వేదపండితులు, స్వచ్ఛంద సేవకులను సమన్వయం చేస్తూ ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేయడంపై ప్రశంసలు అందుకుంది.

### పుష్కరాల దిశగా ముందస్తు ఏర్పాట్లు...

రానున్న గోదావరి పుష్కారాలను దృష్టిలో ఉంచుకొని మంత్రి అడ్లూరి.లక్ష్మణ్ చొరవతోఆలయ అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు ధర్మపురికి వచ్చే అవకాశముండటంతో వారికి తగిన సౌకర్యాలు కల్పించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఈఓ సంకటాల శ్రీనివాస్ తెలిపారు.భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో, ఆలయ ప్రతిష్టను మరింత పెంచడంలో సంకటాల శ్రీనివాస్ చేసిన కృషి ప్రశంసనీయమని స్థానిక భక్తులు, ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో కూడా ధర్మపురి క్షేత్రం మరింత అభివృద్ధి చెందేలా చేపడుతున్న చర్యలు అభినంద నీయమని వారు అభిప్రాయపడ్డారు.

# పరిపాలనపై అవగాహన పెంచుకోవాలి

**• అభివృద్ధిలో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పాత్ర కీలకం • కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్ మార్చి 12 (వుదయం ప్రతినిధి) :** నగరం, పట్టణాల అభివృద్ధిలో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పాత్ర కీలకమని, అందరం కలిసికట్టుగా జిల్లాను అభివృద్ధిలో ముందు వరుసలో నిలుపుదామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పలు అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, వివిధ ప్రభుత్వ శాఖలు ప్రజల కోసం అందించే సేవా కార్యక్రమాలు, పథకాల గురించి పీపీటీ ద్వారా వివరించారు. మున్సిపల్ చట్టాలు, మున్సిపాలిటీలోని వివిధ విభాగాలు నిర్వహించే కార్యక్రమాలు, అధికారులు, సిబ్బంది విధులు, బాధ్యతలు గురించి వివరించారు.

### సమస్యల పరిష్కారానికి ప్రణాళిక తయారు చేసుకోవాలి...

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ.. కార్పొరేటర్లు, వార్డు సభ్యులు ఎంత బాధ్యతగా ఉంటే ఆ పట్టణాలు అంతలా అభివృద్ధి చెందుతాయన్నారు. వివిధ విభాగాల ప్రభుత్వ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ వార్డు స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు, సమస్యల పరిష్కారానికి ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. నిత్యం శానిటేషన్ విధానం పర్యవేక్షించాలని, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వార్డులను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు అధికారుల ఎదురుగానే పరిష్కారం కావాలని ఉద్దేశంతో మున్సిపాలిటీల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్, దరఖాస్తుల పరిష్కారం చురుగ్గా సాగుతోందని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పాలుపంచుకుంటూ అంతిమంగా ప్రజా సేవే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

### పౌరుల సేవలకు ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి...

నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పౌరుల సేవలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. అవినీతి రహిత పాలనతో ఆదర్శంగా నిలవాలని సూచించారు. మున్సిపల్ చట్టాలపై అవగాహన పెంచుకొని ప్రజలకు సేవలు అందించాలన్నారు. ప్రతి కార్పొరేటర్ డివిజన్లలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ మున్సిపల్ చేపట్టే పనులను పర్యవేక్షించాలని కోరారు. వేసవి దృష్ట్యా తాగునీరు వృథా చేయకుండా అవగాహన కల్పించాలని, ఎక్కడైనా పైపు లైన్ మరమ్మతులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రాణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రతి కార్పొరేటర్ డివిజన్లో పర్యటించి సమస్యలను గుర్తించాలని తెలిపారు. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని అధికారులతో చర్చించి పరిష్కారం అయ్యే విధంగా చూడాలని తెలిపారు.



కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లకు ఇలాంటి శిక్షణ వారికి ఉపయోగకరమన్నారు. కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లు డివిజన్లలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకోవాలని డిప్యూటీ మేయర్ సునీల్ రావు అన్నారు. నగరంలో మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

కరీంనగర్ నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లకు మున్సిపల్ చట్టాలు, వ్యవస్థ, విభాగాలు వాటి పనితీరుపై అవగాహన చాలా ముఖ్యమన్నారు. దీనివల్ల ప్రజలకు మరింత చేరువై సేవ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేష్, హుజురాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, వైస్ చైర్ పర్సన్ గూడూరి అంజలి, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ మహమ్మద్, చొప్పదండి మున్సిపల్ చైర్పర్సన్ వద్లూరి సరిత, వైస్ చైర్పర్సన్ పెరుమాండ్ల మానస, మున్సిపల్ కమిషనర్లు సయ్యద్ ముసాబ్ అహ్మద్, మనోహర్, మహమ్మద్ ఆయాజ్ పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ధర్మపురి, మార్చి 12 (వుదయం ప్రతినిధి ) :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కీలక మైన వైద్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. గురువారం ధర్మపురిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆశా వర్కర్లు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యం గా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సిబ్బంది అందరూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. ఆశా వర్కర్ల న్యాయమైన కోర్కెలను తీర్చేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# ప్రభుత్వ పథకాల అమలులో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

**• పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన కోసమే శిక్షణ తరగతులు • కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మార్చి 12 (వుదయం ప్రతినిధి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలులో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపాలిటీ మేయర్/చైర్ పర్సన్‌లు, డిప్యూటీ మేయర్/ వైస్ చైర్ పర్సన్‌లు, కార్పొరేటర్లు/ కౌన్సిలర్లకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతన ఎన్నికైన ప్రజాప్రతినిధులకు విధులు, అధికారాలపై అవగాహన కోసమే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా పంచాయతీ రాజ్ చట్టాలు అవగాహన కలిగిస్తున్నామని తెలిపారు. మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల పాటు ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలలో కార్యచరణ అమలు చేస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్ తదితర అంశాలపై కార్యాచరణ, సమాజ హిత అంశాలపై ప్రణాళికలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ పంచాయతీరాజ్ & మున్సిపల్ యాక్ట్ ల గురించి ప్రజాప్రతినిధులకు సంక్షిప్తంగా వివరించారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటు చేయబడినందున మున్సిపల్ అభివృద్ధి కొరకు నిధులు మంజూరు అవుతాయని, ఈ నిధులను సక్రమంగా వినియోగిస్తూ ప్రజా ప్రయోజనకర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. వేసవిలో ప్రజలకు నిరంతరం నీటిని సరఫరా చేసే విధంగా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులు తమ పరిధిలో పకడ్బందీగా అమలు చేయాలని, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ దీపాల ఏర్పాటులో సౌర విద్యుత్ దీపాల ఏర్పాటుపై దృష్టి సారించాలని, తద్వారా విద్యుత్ వినియోగాన్ని నియంత్రించవచ్చన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలులో ప్రజా ప్రతినిధుల విధులు, అధికారాలు తెలుసుకొని ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజాసంక్షేమం ఉందిగా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం అమలులో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమైనదని తెలిపారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే గ్యాస్ కొరత

## మంత్రి పొన్నం ప్రభాకర్





**కరీంనగర్, మార్చి 12 (వుదయం ప్రతినిధి):** కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో గ్యాస్ కొరత సమస్య తీవ్రతరమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న కేంద్ర ప్రభుత్వం నిమ్మకుండినట్లు వ్యవహరిస్తుందని, రాష్ట్రం నుండి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రాష్ట్రానికి సరిపడ గ్యాస్ తీసుకురాలేక పోతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా, భారతదేశానికి గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడి వంటగ్యాస్, కమర్షియల్ సిలిండర్ల కొరత తీవ్రమైందన్నారు. ఈ సంక్షోభం వల్ల హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడుతుండగా, సామాన్యులు గ్యాస్ బుకింగ్స్, డెలివరీలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,దీనితో వంట కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఇబ్బందులు ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించాలని, గతంలో ఉక్రెయిన్ రష్యా యుద్ధాన్ని ఆపమని చెప్పిన నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇప్పుడెందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు తెలియచేయాలన్నారు. గ్యాస్ ఇప్పటికిప్పుడు కొరత లేకున్న వంట గ్యాస్‌కి సంబంధించి ప్రజలు ఆందోళన చెందుతున్నారని, గ్యాస్ విషయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకుంటామని కేంద్ర ప్రభుత్వం నుంచి నిర్దిష్ట ప్రకటన ఎందుకు రావడం లేదో స్పష్టం చేయాలన్నారు.గ్యాస్ కొరత లేనప్పుడు గ్యాస్ ధరలు ఎందుకు పెంచారో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు సమాధానాలు చెప్పడం లేదని పొన్నం ప్రశ్నించారు. గ్యాస్‌తో పాటు భవిష్యత్తులో ఎరువుల కొరత సంభవించే అవకాశం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు శాస్త్రవేత్తలు చెబుతున్నారని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగాలి గ్యాస్ కొరత నివారించాలి. ఎరువుల కొరత రాకుండా చూసుకోవాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్యాస్ సరఫరా పెంచాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని మంత్రి పేర్కొన్నారు. అయితే కేంద్రం రాష్ట్రాల అవసరాలను పరిగణలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం వల్ల సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం గ్యాస్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాల వల్ల రవాణా రంగం, చిన్న వ్యాపారాలు, గృహ వినియోగదారులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటోందని ఆయన చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన గ్యాస్ సరఫరా పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్రాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్యాస్ పంపిణీపై స్పష్టమైన విధానాలు తీసుకురావాలని ఆయన కోరారు. ప్రజల ప్రయోజనాలను కాపాడటం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కేంద్రం సహకరిస్తే సమస్యకు త్వరగా పరిష్కారం లభిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# 166 సీనియర్ సిటిజన్ కేసుల పరిష్కారం

**కలెక్టర్ కోయ శ్రీ హర్ష | వయో వృద్ధులు ఫిర్యాదులను ఆర్డీఓ వద్ద నమోదు చేయాలి**



**పెద్దపల్లి, మార్చి 12 (వుదయం ప్రతినిధి) :** జిల్లాలో సీనియర్ సిటిజన్‌ల నుండి వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని వయో వృద్ధుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత రెవెన్యూ ట్రిబ్యునల్‌ల ద్వారా పరిశీలించి పరిష్కరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి ఆర్డీఓ కార్యాలయంలో 130 కేసులు నమోదు కాగా వాటిలో 121 కేసులు పరిష్కరించగా 9 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, మంథని ఆర్డీఓ కార్యాలయంలో 28 కేసులు నమోదు కాగా వాటిలో 26 కేసులు పరిష్కరించగా 2 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు, అలాగే అప్పీలేట్ కేసులు 19 నమోదు కాగా అన్ని 19 కేసులు పూర్తిగా పరిష్కరించబడినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విధంగా జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 166 కేసులకు పరిష్కారం చూపినట్లు పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టం ప్రకారం వృద్ధుల ఫిర్యాదులను ట్రిబ్యునల్‌లో క్షుణ్ణంగా విచారించి, తల్లిదండ్రుల పోషణ బాధ్యత పూర్తిగా వారి పిల్లలదేనని స్పష్టం చేస్తూ అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను పాటించని పక్షంలో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గురువారం కొట్టె రాజయ్య (96) గారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నప్పటికీ ప్రస్తుతం ఎవరూ తనను పట్టించుకోవడం లేదని తెలియజేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. రాజయ్య పేరుపై ఉన్న భూమిని వారికే అమ్ముకునే హక్కు ఉందని, ఆ భూమి ద్వారా వచ్చే డబ్బును రాజయ్య పేరుపై బ్యాంకులో జమ చేసి భద్రపరచాలని ఆదేశించారు. అలాగే తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ పూర్తి బాధ్యత కుమారులదేనని, ఈ నిబంధనలను ఉల్లంఘించినట్లయితే చట్టరీత్యా శిక్షలు తప్పవని కుటుంబ సభ్యులకు హెచ్చరించారు. వయో వృద్ధులు తమ పల్లలు సరైన విధంగా చూసుకోవడం లేదనే ఫిర్యాదులను ముందుగా సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) వద్ద నమోదు చేయాలని, అక్కడ సమస్య పరిష్కారం కాని పక్షంలో కలెక్టర్ వద్ద ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్



**జగిత్యాల మార్చి 12 (వుదయం ప్రతినిధి) :** పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలో జగిత్యాల మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సిరాజుద్దీన్ మన్సూర్ స్వగృహంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్ కుమార్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్యలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం అబ్దుల్ ఖాదర్ ముజాహిద్ ఎంఐఎం అధ్యక్షులు సుమేర్ కౌన్సిలర్ లు మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పేదింటి వధువుకు పుస్తె మట్టెలు అందజేత

**కామారెడ్డి, మార్చి 12 (వుదయం) :** పేదింటి వధువు పెళ్లికి కావాల్సిన పుస్తెమట్టెలు అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి. కామారెడ్డి కామారెడ్డి నియోజకవర్గ కేంద్రంలోని చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన గద్దె లహరి వివాహానికి అవసరమైన పుస్తె మట్టెలను వారు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ, మాజీ కౌన్సిలర్లు పిడుగు మమత ఉన్నారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## చట్టాలపై అవగాహనతో పని చేయాలి

- మంత్రి దామోదర్ రాజనర్సింహ
- సంగారెడ్డి జిల్లా కందిలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అవగాహన సదస్సు



**సంగారెడ్డి, మార్చి 12: వుదయం :** నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా కంది ఎల్.ఎన్. కన్వెన్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య నేతృత్వంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్లు, గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లకు నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అవగాహన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ప్రజాప్రతినిధికి తన గ్రామం, పట్టణం అభివృద్ధి చేయాలనే లక్ష్యం ఉంటుందని, అందుకోసం పంచాయతీరాజ్, మున్సిపల్, అటవీ శాఖ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ ఐదు దశలు, పది అంశాలుగా అమలు అవుతుందని తెలిపారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల ఏప్రిల్ 2 నుంచి గ్రామాల్లో గ్రామసభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా గ్రామసభలకు హాజరై ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా కృషి చేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించి అంకితభావంతో పనిచేస్తే ప్రజల విశ్వాసం పొందగలరని పేర్కొన్నారు. సేవాభావంతో పనిచేసే ప్రజాప్రతినిధులకు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని అన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యత నిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో మహిళలే అధికంగా ఉన్నారని మంత్రి తెలిపారు. మహిళా శక్తి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే నిధుల సమీకరణ, రెవెన్యూ–అటవీ భూముల పరిరక్షణ, పంచాయతీరాజ్ చట్టాలపై సర్పంచులు అవగాహన కలిగి ఉండటం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.

### రైతులకు పంటలపై మార్గదర్శకాలు, బీమా పథకాల అవగాహన

ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు, చిన్నారుల ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీస్, రవాణా శాఖల ద్వారా రహదారి భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల అమలు చేపడతారని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ లబ్ధిదారుల గుర్తింపు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, హాస్టళ్ల పరిశుభ్రతపై పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రైతులకు పంటలపై మార్గదర్శకాలు, బీమా పథకాల అవగాహన, ఎరువులు–విత్తనాల లభ్యత, విద్యా రంగంలో పాఠశాలల మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ, పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యువత అభివృద్ధికి క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మహిళా సాధికారత, స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, బాల్య వివాహాల నివారణ, మహిళల భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిషేధం, మొక్కల సంరక్షణ, వనమహోత్సవం ఏర్పాట్లు, పర్యావరణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

### గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి పథంలో ముందుకు



జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావాలంటే ప్రజాప్రతినిధులు చట్టాలు, విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వ పథకాలు అందించేందుకు ఈ అవగాహన కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి తగిన ప్రణాళికలు రూపొందిస్తే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. టి.జి.ఐ.ఐ.సీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రజల కోసమేనని, ప్రజాప్రతినిధులు ప్రజల్లో ఉండి అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని అన్నారు. జహీరాబాద్ నిమ్జ్ పారిశ్రామిక ప్రాంతం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ ప్లాస్టిక్ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు.ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ ఐదేళ్ల పాలనలో గ్రామాలు, పట్టణాలను అభివృద్ధి పథంలో నడిపించాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణకు కృషి చేయాలని, మున్సిపాలిటీల్లో అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కింద చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యాచరణను వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫయిమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల మార్చి 12 (వుదయం ప్రతినిధి)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజుల పాటు దిగ్విజయం చేసేందుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై నూతన కౌన్సిలర్లు, సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు తో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ లు, అదనపు కలెక్టర్లు, జిల్లా ఎస్పీ లతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అమలు చేసేలా ఎక్కడ ఎలాంటి వైరుధ్యాలు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తేనే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జోగులాంబ గద్వాల జిల్లాలో మహిళలు పెద్ద ఎత్తున సర్పంచులుగా, కౌన్సిలర్లుగా గెలుపొందడం శుభ పరిణామమని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. 99 రోజులపాటు పది అంశాలతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 2న గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి ఇందులో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజాప్రతినిధులు కీలకంగా ఉండాల్సినందున వారికి సమగ్రంగా అవగాహన కల్పించేందుకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఏమైనా సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనర్స్, అధికారులు నివృతి చేస్తారన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో బాల్యవివాహాలతో పాటు పలు సామాజిక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి కూడా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసుకొని వివిధ మైనర్ రిపేరీలు చేయించడం జరిగిందన్నారు. నూతనంగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కూడా ప్రభుత్వ పాఠశాలల పనితీరు మెరుగుపడేందుకు తరచూ పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బడిబాట నిర్వహించడం జరుగుతుందని, బాలికలు చదువులు మధ్యలోనే ఆపివేయకుండా ఉన్నత విద్యాభ్యాసం చేసేలా ప్రోత్సహించాలన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మన జిల్లా అక్షరాస్యతలో చివరి స్థానంలో ఉందని త్వరలో మరోసారి జనాభా గణన చేపడుతున్నందున జిల్లాలో అక్షరాస్యత శాతం పెరిగేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. న్యూట్రిషన్ సమస్యల నివారణకు అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా సర్పంచులు, కౌన్సిలర్లు తమ పరిధిలోని కేంద్రాలను ప్రతి బుధవారం పర్యవేక్షణ చేయాల్సిందిగా కోరారు.

### జోగులాంబ గద్వాల జిల్లా ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజనకు ఎంపిక

పోలీస్ శాఖ తరపున డ్రగ్స్, రహదారి భద్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువులను ఎక్కువగా వినియోగిస్తే భూములు సారవంతత కోల్పోయి భవిష్యత్తు తరాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నందున అన్నదాతలు ప్రకృతి వ్యవసాయంపై కూడా దృష్టి సారించేలా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్, మిల్లెట్స్ వంటి భిన్నమైన పంటలను సాగు చేయడం వలన అధిక మంచి ఆదాయం పొందవచ్చన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజనకు ఎంపికవ్వడంతో వ్యవసాయ రంగంతోపాటు అనుబంధ రంగాల్లోని లబ్ధిదారులందరూ ఆర్థికంగా ఎదిగేందుకు ఆస్కారం ఏర్పడిందన్నారు. ఇందిర మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నందున మహిళలు వివిధ వ్యాపారాలు, వృత్తులు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని అభిలషించారు. జిల్లాలో డయాబెటిస్ రోగులు పెరుగుతుండడంతో షుగర్, బీపీ వంటి వ్యాధులు రాకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టడమే కాక ఎన్సీడీ స్క్రీనింగు, హెచ్.పి.వి వ్యాక్సిన్, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 99 రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు 99 రోజులపాటు పది అంశాలను తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ థీమ్స్ ప్రతి కుటుంబంలో అందరి జీవితాలను ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని సూచించారు. చెత్తను కాల్చడం వలన వెలువడే పొగతో శ్వాస సంబంధ సమస్యలు ఉత్పన్నమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. మన ఆరోగ్యంతో పాటు పర్యావరణంలోని అన్ని జీవులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలన్నారు. రహదారి ప్రమాదాలతో ప్రతినిత్యం పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారని, దీనికి గల కారణాలను విశ్లేషించుకుని అవసరమైన నివారణ చర్యలు చేపడితే ఎన్నో కుటుంబాలకు మేలు చేసిన వారమవుతామన్నారు. డ్రగ్స్ నివారణకు ఈ కార్యక్రమం ద్వారా కృషి చేయాలన్నారు.

### మహిళలకు పోలీస్ శాఖ తరఫున భరోసా కేంద్రాలు

ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారి సంక్షేమానికి పోలీస్ శాఖ తరపున భరోసా కేంద్రాలు, షి టీమ్స్ ఏర్పాటు చేసి ముందుకెళ్తున్నామన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సూచించిన పది అంశాలు విజయవంతం కావాలంటే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులందరూ తమ ప్రాంతాల్లోని యువత, విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. అనంతరం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలోని 10 ప్రధాన అంశాలను సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. అంతకు ముందు బాల భవన్ విద్యార్థులు అద్భుతమైన సాంస్కృతిక నృత్యాలతో ప్రేక్షకులను అలరించగా, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై రూపొందించిన పాటలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు, అదనపు ఎస్పీ కె శంకర్, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, పలు మండలాల అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామాలకు దిశా నిర్దేశం

- ప్రజాప్రతినిధులు పారదర్శకంగా బాధ్యతతో పనిచేయాలి
- మంత్రి వాకిటి శ్రీహరి

**నారాయణపేట టౌన్ మార్చి 12(వుదయం ప్రతినిధి)** బాపుజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం కోసం మనందరం కృషి చేయాలని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక ,మత్స్య ,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్ అమలులో భాగంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో ప్రజాప్రతినిధులకు శిక్షణ అందించేందుకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మంత్రి పాల్గొని ప్రారంభించారు. నారాయణపేట లోని స్థానిక గాయత్రి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 272 మంది సర్పంచులు 72 మంది కౌన్సిలర్లు పాల్గొన్న శిక్షణ కార్యక్రమంలో మంత్రి వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచులకు చెక్ పవర్ ఇచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. సర్పంచ్ పదవి అంటే ఆషామాషీ కాదని ,మున్సిపల్ చైర్మన్ పదవి కూడా ఎంతో కీలకమని తెలిపారు. పుట్టిన ,మరణ ధ్రువీకరణ పత్రం అందజేసే సర్పంచ్, చైర్మన్ పదవులు ఎంతో కీలకమని అన్నారు. మనం పుట్టిన ప్రాంతానికి సేవ చేసే అవకాశం దొరకడం గొప్ప అదృష్టమని సర్పంచ్ లకు హితోపదేశం చేశారు. తాను సర్పంచ్ నుండి మంత్రి స్థాయికి ఎదిగానని తెలిపారు. మన గ్రామాలను అభివృద్ధి చేసి పది తరాల వరకు గుర్తుండిపోయేలా చైర్మన్ లు, సర్పంచ్ లు పనిచేయాలన్నారు. 99 రోజులు ఈ కార్యక్రమం లో పలు అంశాలను చేర్చడం జరిగిందని మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుందని తెలిపారు. గ్రామాలకు ఏ అవసరం ఉన్నా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. మన ప్రాంత వాసి అయిన ముఖ్యమంత్రి ఉన్నందున ఈ గడ్డ అంతా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. 5 వేల కోట్ల తో మక్తల్ –నారాయణపేట –కొడంగల్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయని తెలిపారు. ఎకరానికి 20 లక్షలు ఇచ్చి భూ నిర్వాసితులను ఈ ప్రభుత్వం ఆదుకున్నదని మంత్రి వెల్లడించారు. వరికి మద్దతు ధరతో పాటు బోనస్ ఇచ్చి, పండిచిన పంటను సన్న బియ్యం గా మార్చి రేషన్ షాపుల ద్వారా పేదలకు ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. సంక్షేమ పథకాల్లో ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటేశ్వరులను చేయడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఆర్ టీ సి అద్దె బస్సుల నిర్వహణ తో వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. పిల్లల ఆరోగ్యం పట్ల, డ్రగ్స్ పట్ల జాగ్రత్త వహించాలని అన్నారు. 25 కోట్ల రూపాయలతో స్టేడియం నిర్మాణం కొరకు మంజూరు చేస్తాం అని మంత్రి వాకిటి శ్రీహరి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఫణిందర్ రెడ్డి, ఎస్పీ డాక్టర్ వినీత్, అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీను, నారాయణపేట జిల్లా లోని మున్సిపల్ చైర్మన్లు , వైస్ చైర్మన్లు, సర్పంచ్లు ,కౌన్సిలర్లు ,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు మెచ్చేలా ప్రజా ప్రతినిధుల పాలన

దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



**మహబూబ్ నగర్ మార్చి 12(వుదయం ప్రతినిధి)** నూతన ప్రజా ప్రతినిధుల పాలన ప్రజలు మెచ్చేలా ఉండాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం మహబూబ్ నగర్ లోని అనంత గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్త ,రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల కొత్వాల్, ఎస్పీ జానకి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రజా ప్రతినిధుల శిక్షణ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ బాపు జీ కలలు గన్న గ్రామ స్వరా జ్యం కోసం మనందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచులకు చెక్ పవర్ ఇచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. సర్పంచ్ పదవి అంటే ఆషామాషీ కాదని , మున్సిపల్ చైర్మన్ పదవి కూడా ఎంతో కీలకమని తెలిపారు. పుట్టిన ,మరణ ధ్రువీకరణ పత్రం అందజేసే సర్పంచ్, చైర్మన్ పదవులు ఎంతో కీలకమని అన్నారు. మనం పుట్టిన ప్రాంతానికి సేవ చేసే అవకాశం దొరకడం గొప్ప అదృష్టమని సర్పంచ్ లకు హితోపదేశం చేశారు. తాను సర్పంచ్ నుండి మంత్రి స్థాయికి ఎదిగానని తెలిపారు. మన గ్రామాలను అభి వృద్ధి చేసి పది తరాల వరకు గుర్తుండిపోయేలా చైర్మన్ లు, సర్పంచ్ లు పనిచేయా లన్నారు. 99 రోజులు ఈ కార్యక్రమం లో పలు అంశాల ను చేర్చడం జరిగిందని మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సిద్దిస్తుం దని తెలిపారు. గ్రామాలకు ఏ అవసరం ఉన్నా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. మన ప్రాంత వాసి అయిన ముఖ్యమంత్రి ఉన్నందున ఈ గడ్డ అంతా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. వరికి మద్దతు ధరతో పాటు బోనస్ ఇచ్చి, పండిచి న పంటను సన్న బియ్యం గా మార్చి రేషన్ షాపుల ద్వారా పేదలకు ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. సంక్షేమ పథకాల్లో ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటేశ్వరులను చేయడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఆర్ టీ సి అద్దె బస్సుల నిర్వహణ తో వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. పిల్లల ఆరోగ్యం పట్ల, డ్రగ్స్ పట్ల జాగ్రత్త వహించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత ,మధుసూదన్ రెడ్డి,మేయర్ జి.మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,రెవెన్యూ కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, పురపాలక శాఖ జాయింట్ డైరెక్టర్ మమత,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అట్టడుగు స్థాయి వరకు చేరడమే లక్ష్యం

- సిద్దిపేటలో 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' అవగాహన సదస్సు
- 99 రోజుల కార్యాచరణపై ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్





**సిద్దిపేట, మార్చి 12 (వుదయం ప్రతినిధి)** ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అట్టడుగు స్థాయి వరకు చేరడమే లక్ష్యంగా, సిద్దిపేటలోని రెడ్డి సంక్షేమ సంఘ భవనంలో 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణపై మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు మరియు సర్పంచులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

### సమాజమే దేవాలయం : బక్కి వెంకటయ్య

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు సమాజమే దేవాలయంగా భావించి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న విద్య, వైద్యం, పారిశుధ్య కార్యక్రమాలపై నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 99 రోజుల కార్యాచరణను ఐదు అంచెల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. మార్చి 6 నుండి 15 వరకు గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం. ఏప్రిల్ 6 నుండి 11 వరకు ప్రత్యేక ఆరోగ్య పరిరక్షణ చర్యలు. ఏప్రిల్ 13 నుండి 18 వరకు రోడ్డు భద్రత, ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు డ్రగ్స్ నిర్మూలన మరియు మహిళా భద్రతపై అవగాహన. మే 4 నుండి 9 వరకు రైతు సంక్షేమం మరియు పంటల వైవిధ్యంపై దృష్టి. మే 18 నుండి 30 వరకు క్రీడలు, మహిళా అభివృద్ధిపై కార్యక్రమాలు; జూన్ 1 నుండి 12 వరకు పర్యావరణ పరిరక్షణ. ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని, మిషన్ భగీరథ నీటిని వాడాలని మరియు సోలార్ విద్యుత్ సబ్సిడీని ప్రజలు వినియోగించుకునేలా చూడాలని ఆమె కోరారూ. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి స్పష్టమైన ఎజెండా రూపొందించుకోవాలని సూచించారు. స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ ప్రజలు సమస్యల కోసం ముందుగా ప్రజాప్రతినిధులనే ఆశ్రయిస్తారని, అందువల్ల వారు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి దశరథ్, అటవీ శాఖ అధికారి పద్మజా రాణి, అదనపు డీసీపీ కుషాల్కర్, డీపీఓ రవీందర్, డి.ఆర్.డి.ఓ జయదేవ్ ఆర్య మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేల సమావేశం

### నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్ దృష్టికి పలు అంశాలు

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 12:వుదయం** సంగారెడ్డి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు మరియు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య దృష్టికి ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు తీసుకువెళ్లారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలు, పెండింగ్‌లో ఉన్న పనులను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా బోర్‌వెల్స్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. అలాగే ఆరుట్ల, రాజంపేట్, సదాశివపేట, పెద్దాపూర్ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. చిమ్నాపూర్ గ్రామంలో పాఠశాల భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని, భవన నిర్మాణానికి దాతలు సిద్ధంగా ఉన్నారని కలెక్టర్‌కు వివరించారు. సంగారెడ్డి, సదాశివపేట మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లలో పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని కోరారు. సంగారెడ్డి బైపాస్‌లో నిర్మాణంలో ఉన్న 80 అడుగుల రహదారి పనులు నాణ్యత లేకుండా నిదానంగా సాగుతున్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించాలని కలెక్టర్‌ను కోరారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో రూ.44 కోట్లు, సదాశివపేట మున్సిపాలిటీలో రూ.8.50 కోట్లతో అమృత్ పథకం కింద మంజూరైన పనులు టెండర్ అయినప్పటికీ పూర్తికాలేదని, వాటిని త్వరగా పూర్తి చేయాలని కోరారు. ల్యాండ్ పూలింగ్ కింద ఇంద్రకరణ్, కంది, ఆరుట్ల, ఫసల్వాది గ్రామాల రైతుల నుంచి తీసుకున్న భూములను ఇప్పటివరకు అభివృద్ధి చేయలేదని, రైతులకు ఇవ్వాల్సిన 600 గజాల ప్లాట్లను కూడా అందించలేదని తెలిపారు. బేగంపేట్ గ్రామంలో వాటర్ ట్యాంక్ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, దీనిపై స్థానిక సర్పంచ్ ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రావీణ్య విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంగారెడ్డిలో నిర్మాణంలో ఉన్న మినీ హజ్ హౌస్ పనులు పూర్తి కావడానికి ఇంకా రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే మాజీ సర్పంచ్‌లకు సంబంధించిన 15వ ఫైనాన్స్ కమిషన్ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. హనుమాన్ నగర్‌లో ముస్లిం, క్రిస్టియన్ సమాధుల కోసం కేటాయించిన స్థలంలో సరైన వసతులు లేవని, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన సమస్యలపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# పదవ తరగతి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల మార్చి 12 (వుదయం ప్రతినిధి)** జిల్లాలో నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల నిర్వహణలో అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో పనిచేసి విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని ఆయన సూచించారు. ఈ సంవత్సరం జిల్లాలో పదో తరగతి పరీక్షలకు మొత్తం 8,110 మంది విద్యార్థులు హాజరుకానున్నారని కలెక్టర్ తెలిపారు. వీరిలో 3,858 మంది బాలురు, 4,199 మంది బాలికలు, అలాగే 53 మంది ఒకసారి విఫలమైన విద్యార్థులు ఉన్నారని చెప్పారు. జిల్లాలో మొత్తం 40 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, పరీక్షల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని నియమించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆయన వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లు లేదా ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని, విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది తప్పనిసరిగా ఐడి కార్డులు ధరించాలని ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో క్లాక్ రూమ్ ఏర్పాటు చేసి మొబైల్ ఫోన్లు తదితర వస్తువులను అక్కడే భద్రపరచాలని సూచించారు. ప్రశ్నాపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తోనే కేంద్రాలకు తరలించి పరీక్ష అనంతరం పోస్టాఫీసులో డిపాజిట్ చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ప్రైవేట్ పాఠశాలల సిబ్బందిని అనుమతించ రాదని స్పష్టం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లకు సంబంధించిన ఎస్.ఎస్.సి ఇన్‌స్ట్రక్షన్ బుక్‌లెట్లు అందుబాటులో ఉంచాలని, పదవ పరీక్షల టైమ్ టేబుల్‌ను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని తెలిపారు.

చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీటీవీ కెమెరా తప్పనిసరిగా ఉండాలని, సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ ను కలిసి బందోబస్తు కోసం లేఖ ఇవ్వాలని సూచించారు. పరీక్ష ప్రారంభమైన 30 నిమిషాల లోపల విద్యార్థుల హాజరు వివరాలను 9440081300, 8247672086 , 9491528193 నంబర్లకు తెలియజేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని, ఏ.ఎన్.యం సిబ్బంది తప్పనిసరిగా విధుల్లో ఉండాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అనుమానాస్పద మెటీరియల్ ఉండకూడదని, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు ప్రతి గదిని ముందుగా పరిశీలించాలన్నారు. రూమ్ అలాట్‌మెంట్ వివరాలను విద్యార్థులు సులభంగా చూడగలిగే విధంగా అనేక ప్రదేశాల్లో ప్రదర్శించాలని సూచించారు. పరీక్ష ప్రారంభానికి ముందు ఫ్రిస్కింగ్ జాగ్రత్తగా నిర్వహించాలని, బాలికలకు మహిళా ఉపాధ్యాయులచే ప్రత్యేక గదిలో తనిఖీ చేయించాలని తెలిపారు. విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ టైమ్ ఇవ్వాలని, జిరాక్స్ హాల్ టికెట్లు ఉన్న విద్యార్థులను కూడా పరీక్షకు అనుమతించాలని పేర్కొన్నారు. సెట్–II ట్రంక్ బాక్సులను త్రాడుతో కట్టి ఉంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని ఉపయోగించరాదని స్పష్టం చేశారు. పరీక్ష జరుగుతున్న సమయంలో ఎవరినీ బయటకు అనుమతించరాదని తెలిపారు. 4ఎస్, 3టీ పరీక్షలు ఉన్న కేంద్రాల్లో హాల్ టికెట్ నంబర్ పక్కన సబ్జెక్టు వ్రాయాలని సూచించారు.

ప్రశ్నాపత్రాలను పరీక్ష ప్రారంభానికి 10–15 నిమిషాల ముందు మాత్రమే తెరవాలని, పరీక్షా కేంద్రాల్లో ప్రెస్ ప్రతినిధులను అనుమతించరాదని చెప్పారు. ఏ.యెన్.యం వద్ద కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్ ఉండకూడదని ఆదేశించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ లేదా మాస్ కాపీయింగ్ వంటి ఘటనలు జరిగితే 1997 చట్టం మరియు సీసీఏ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సి కేటగిరీ సెంటర్లలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు ప్రశ్నాపత్రాలను సి సెంటర్ కస్టోడియన్ వద్ద నుంచి పొందాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్, లైటింగ్, టాయిలెట్లు, స్వచ్ఛమైన త్రాగునీరు పూర్తిస్థాయిలో ఉండాలని ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఒక గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆన్సర్ బుక్‌లెట్లు, ఓఎంఆర్ షీట్లు, డి–ఫార్మ్స్ ముందుగానే సరిచూసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల హాజరు వివరాలను పోలీస్ వారి ఫోన్ ద్వారా పంపించాలని, స్టేషనరీ అకౌంట్స్ జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు.

# జహంగీర్ పీర్ దర్గా అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**మైనారిటీ సంక్షేమం, ప్రజా సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ కు వినతి**

**రంగారెడ్డి జిల్లా వుదయం మార్చి 12 :** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని ప్రఖ్యాత జహంగీర్ పీర్ దర్గా అభివృద్ధికి మరిన్ని నిధులు అదనంగా మంజూరు చేయాలని మైనారిటీ సంక్షేమం, ప్రజా సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ కోరారు. గురువారం రాజధాని లో మంత్రి అజారుద్దీన్ ని తన కార్యాలయంలో ప్రత్యేకంగా కలుసుకుని జహంగీర్ దర్గా అభివృద్ధి గురించి మాట్లాడారు. దాదాపు 12 కోట్ల హెచ్.ఎం.డి.ఏ నిధులతో దర్గా అభివృద్ధి పనులు జరుగుతున్నాయనీ మరో 8 కోట్ల రూపాయలు నిధులు అదనంగా మంజూరు చేయగలరని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా దర్గా అభివృద్ధికి తమ వంతు సహకారం పెద్ద ఎత్తున అందించాలని ఎమ్మెల్యే మంత్రికి విన్నవించారు. దీనిపై స్పందించిన మంత్రి అజారుద్దీన్ ఇటీవల దర్గాను సందర్శించడం జరిగిందని దర్గా అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక



ప్రణాళిక చర్యలు చేపట్టి అభివృద్ధి చేసేందుకు ముందుకు వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు..

# శిశు గృహంలో చిన్నారుల పట్ల శ్రద్ధ ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య
- శిశు గృహం, సఖీ కేంద్రం ఆకస్మిక తనిఖీ



**సంగారెడ్డి, మార్చి 12 వుదయం :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర సూచనలతో గురువారం సంగారెడ్డి జిల్లాలోని శిశు గృహం, సఖి కేంద్రంలో న్యాయ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిశు గృహంలో ఉన్న పిల్లల పట్ల అధికారులు మరియు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి వారి సంరక్షణ, సంక్షేమంపై మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పిల్లలు క్రమశిక్షణతో ఉండేలా మార్గ నిర్దేశం చేయడంతో పాటు, వారి ఆరోగ్యం, విద్య మరియు సాధారణ బాగోగులను పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే, శిశు గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

సఖి కేంద్రాన్ని సందర్శించే బాధిత మహిళల సమస్యలను సున్నితంగా పరిగణించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. న్యాయ సంబంధిత సమస్యలు ఎదుర్కొనే వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. ఎవరికైనా న్యాయ సహాయం అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, సంగారెడ్డిలో సంప్రదించవచ్చని తెలిపారు.

# కొండపోచమ్మ అమ్మవారికి కాసుల వర్షం

**64 రోజుల్లో రూ. 14.19 లక్షల హుండీ ఆదాయం**





**సిద్దిపేట (జగదేవపూర్), మార్చి 12: (వుదయం ప్రతినిధి)** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండల పరిధిలోని తీగుల్ నర్సాపూర్ గ్రామంలో వెలిసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, భక్తుల కొంగుబంగారం శ్రీ కొండపోచమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం అధికారులు లెక్కించారు. గత 64 రోజులకు గాను అమ్మవారికి రూ. 14,19,800/– ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో రవి కుమార్ మరియు జిల్లా డివిజనల్ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి సంయుక్తంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఈవో రవికుమార్ మాట్లాడుతూ.. భక్తులు సమర్పించిన ఈ కానుకలను పూర్తిస్థాయిలో ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ఈ నిధులను ఆలయ అభివృద్ధి పనులకు మరియు భక్తుల సౌకర్యార్థం వినియోగిస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రమేష్, ఆలయ మాజీ చైర్మన్ లక్ష్మీ నరసింహ రెడ్డి, సిబ్బంది మహేందర్ రెడ్డి, కనకయ్య, అర్చకులు లక్ష్మణ్, తిరుపతి పాల్గొన్నారు. భద్రతా పరంగా పోలీస్ సిబ్బంది లింగం, బాలకిషన్ పర్యవేక్షించగా, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మోడల్ కాలనీగా వెలుగుమట్లను తీర్చిదిద్దుతాం

- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- ఉగాదిలోపు విద్యుత్ సరఫరా పనులు పూర్తి
- వెలుగుమట్ల భూదాన్ భూములలో 38 ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన



**ఖమ్మం, వుదయం బ్యూరో మార్చి 12:** తెలంగాణ రాష్ట్రంలోనే మోడల్ కాలనీగా వెలుగుమట్లను తీర్చి దిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు గురువారం వెలుగుమట్ల భూదాన్ భూములలో 38 ఇండ్ల నిర్మాణ పనులకు ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ పేదరికం ఆసరా చేసుకొని ధనార్జన కోసం దళారులను అడ్డుపెట్టి ఇతర జిల్లా, రాష్ట్రాల వారిని రెచ్చగొట్టి ఫేక్ డాక్యుమెంట్ లతో భూమి పేదలకు మోసపూరితంగా అప్పగించారని తెలిపారు. 1953 లో ఆసామి 31 ఎకరాల 7 గుంటల భూమి దానం చేశారని తెలిపారు. గత 8 సంవత్సరాల కాలంలో అనేక సమస్యలు పేదలు ఎదుర్కొన్నారని, త్రాగునీటి, విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పన లేకుండా బాధలు పడ్డారని తెలిపారు. కరెంట్, మంచి నీరు ప్రతి అంశానికి డబ్బులు డిమాండ్ చేస్తూ మాఫియా నడిపించారని మంత్రి తెలిపారు. పేదలను దిన దిన గండం నుంచి కాపాడాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించిందని అన్నారు. భూదాన్ భూములు ఆక్రమించుకోవాలని సిసిఎల్ఏ ఇచ్చిన ఆదేశాల ప్రకారం కూల్చివేతలు జరిగాయని అన్నారు. మోడల్ కాలనీగా వెలుగు మట్లను తీర్చి దిద్దుతామని, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించిన తల్లి సోనియాగాంధీ పుట్టిన రోజు డిసెంబర్ 9 నాటికి కాలనీ పూర్తి చేస్తామని తెలిపారు. పేదలకు పంచిన తర్వాత మిగిలిన భూమిలో స్కూల్, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. నిరుపేదలకు సున్నా వడ్డీతో రుణాలు అందిస్తామని తెలిపారు. పేదలకు ఇంటి నిర్మాణంలో హౌసింగ్ శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. వెలుగుమట్ల లేఔట్ లో కరెంటు పోల్స్, విద్యుత్ సరఫరా పనులు యుద్ధ ప్రాతిపదికన ఉగాది లోపు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా త్రాగునీటి పైప్ లైన్ పనులు చేపట్టాలన్నారు. దళారులకు ఎవరు ఎంత డబ్బులు ఇచ్చారు వివరాలు పోలీసు అధికారులకు అందించాలని అన్నారు. ప్రజలను మోసం చేసిన ఎవరిని విడిచి పెట్టే సమస్య లేదని కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.



కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

- విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి
- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా
- 99 రోజుల కార్యాచరణలో చేపట్టాల్సిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన




**కరీంనగర్, మార్చి 12 (వుదయం ప్రతినిధి):** గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని, విధులు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి గ్రామాల స్వయం సమృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని సర్పంచులకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు హాజరై 99 రోజుల కార్యాచరణలో చేపట్టాల్సిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై ప్రసంగించారు.2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు వచ్చే నిధులు, ఆదాయ వ్యయాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై సర్పంచులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు.ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపరిచేలా నాణ్యమైన విద్య వైద్యం అందించడం తోపాటు పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.పన్నుల వసూలుతో పాటు సొంతంగా ఆదాయం పెంచుకోవాలని సర్పంచులకు సూచించారు. ఆదాయం పెంపుపై దృష్టి పెట్టి గ్రామాల అభివృద్ధికి నిరంతరం పాటుపడాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ సమావేశాలు గ్రామసభలు నిర్వహిస్తూ నిత్యం వార్డులను పర్యవేక్షిస్తూ సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించాలని సూచించారు. బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం అందరం కలిసి కట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు సర్పంచులు వార్డు సభ్యుల సహకారంతోనే పేదలకు సక్రమంగా అందుతాయని పేర్కొన్నారు. గ్రామానికి సర్పంచి సుప్రీమ్ అని ఉద్ఘాటించారు అధికారులతో సమన్వయం చేసుకుం టూ గ్రామాలను ప్రగతి పథంలో తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. పుట్టిన ప్రాంతానికి సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టమని ఆ విధంగా భావిస్తూ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నా రు. గ్రామాలను అభివృద్ధి చేసి పది తరాలకు గుర్తుండిపోయేలా సర్పంచులు పనిచేయాలన్నారు. గ్రామ సర్పంచులు అన్నీ తామై వ్యవహరిస్తూ ప్రజలకు భరోసా నింపాలన్నారు.

## అధికారులను సమన్వయం చేసుకుంటూ పని చేస్తాం..

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుందన్నారు.



ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇందులో సగానికి పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. తెల్ల రేషన్ కార్డుల జారీ చేపట్టామన్నారు. సర్పంచులు బాగా పనిచేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.99 రోజుల కార్యాచరణలో అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక బృహత్తర కార్యక్రమమని దీన్ని సర్పంచులు వినియోగించుకోవాలని సూచించారు. భారతావానికి పల్లెలే పట్టుకొమ్మలు అన్న గాంధీజీ మాటలను స్ఫూర్తిగా తీసుకొని 99 రోజుల కార్యాచరణలో భాగస్వాములు కావాలన్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని,గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ఇది సదా అవకాశమని నూతన సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందినవారు , ఉన్నత స్థానాల్లో నిలిచిన వారి సహకారం తీసుకొని గ్రామపంచాయతీలను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. అందరి సహకారంతో గ్రామాలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూస్తూ అన్ని శాఖల అధికారుల సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. వివిధ అంశాలపై సర్పంచులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, డిపిఓ జగదీశ్వర్, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డిఆర్డిఓ శ్రీధర్, డీఏవో భాగ్యలక్ష్మి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

---

**IN THE COURT OF THE HON'BLE III ADDL.SENIOR COURT JUDGE, CITY CIVIL COURTS, AT: SECUNDERABAD**
**O.S.NO. 42 OF 2026**

**Between:**
Smt. K. Pranathi
...Plaintiffs

**AND**

**Smt. MuddanaAruna Devi & Others**
**Whomsoever concerned**
...Defendant

Please take notice that the above OS is filed for Declaration of legal Heir by the plaintiff for the property House bearing H. No.12-13-253, admeasuring 797.56 Sq. Yards, and 45 Sq. Yards common passage area situated at Tarnaka, Hyderabad, Telangana – 500089 and Bounded by NORTH: Plot no.440, SOUTH: Plot no.441/Part, EAST: 30' Wide Road, WEST: Plot no.453 and the above suit stands posted to 10-04-2026, at 10-30 am for appearance persons interested if any. If any person having any interest or objection for grant of legal heir, they should appear either in person or through their counsel. If you do not appear in person or through your counsel on the said date, the OS will be heard and determined in your absence.

**(BY ORDER OF THE COURT)**

Sd/-
**PREACH LAW LLP**
**KRISHNA KUMAR MISHRA**
**S. MALLA REDDY**
**ADVOCATE FOR PLAINTIFFS**
**Phone: 9394766532 [cell]**
**(COUNSEL FOR THE PLAINTIFF)**

---

**IN THE COURT OF THE HONBLE I ADDL. JUNIOR CIVIL JUDGE CUM V ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS : MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: Medipally : MEDIPALLY**
**O.S. NO. 76 OF 2026**

**Between:**
Chirunagula Santhosha & Others,
...Plaintiffs

**AND**

**The Tahsildar,**
**UPPAL Mandal**
**Medchal-Malkajgiri Dist,**

**2. All Concerned**
...Defendant

**To,**
**D2-All Concerned**
...Defendant

**NOTICE**

Take Notice That the Plaintiffs herein filed the above suit for declartion of legal heirs under section 26, order-7, rule-1 & 2 of c.p.c plaintiffs is the relief of declaration to declare themselves as the owners and legal heirs of his LATE Chirunagula Bikshapathi S/O LATE Muthaiah, to declare the plaintiffs is the successors of the suit schedule property and to pass judgement and decree in favour the plaintiffs. That the above matter is posted to 02 -04 -2026 ( ) calling for general public or Concerned person or persons for putting his/their grievance or Any Objections in this regard. Then they may appear either in person or through their counselon the above referred date at10-30 AM before the Hon'ble Court. Failing which the matter will be decided basing on the documents available on record.
Hence this Notice.

**SCHEDULE OF THE PROPERTY**

All that the House No. 3-13-1/1C. On Plot. No. 91, Southern part., in Survey no. 108, admeasuring 100 sq. yards or 83.06 sq. Mtrs, situated at Block no.13, Surya Nagar Colony, Mallapur., under GHMC, Kapra Circle, Uppal Mandal, Medchal-Malkajgiri District., Telangana state., and bounded by as follow:

NORTH : PLOT NO. 91 NORTHERN PART
SOUTH : PLOT NO.90.
EAST : 30'-0 WIDE ROAD.
WEST : PLOT. No. 92.

***(BY ORDER OF THE COURT)***

Sd/-
**M/S K.P LAW FIRM**
**Rep,By P.SHIVALINGAM**
**H.No. 596, Kranthi colony**
**Chengicherla,Medchal-malkajgiri -500092,**
**Cell: 8555927737**

---

**IN THE COURT OF THE HON'BLE VJUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT: HYDERABAD**
**O.S. No. 716 of 2026**

**Between:**
**1. Smt. Alapati Usha Prasad,**
**D/o. Lakshmi Narayana Prasad Dodapaneni,**
**Aged about 66 years, Occ. House Wife,**
**R/o. Plot No. 266/AMLA Colony, Road No.12,**
**Banjara Hills,Khairatabad, Hyderabad,**
**Telangana, 500 034**

**2. Smt. Gogineni Uma, W/o. Lakshmi Prasad,**
**Aged about 67 years, Occ. House Wife,**
**R/o. 22-7-34, Motupalli Vari Street,**
**Kothapet, Tenali, Guntur, A.P. - 522201**
...Plaintiffs

**AND**

**The Mandal Revenue Officer,**
**Shaikpet Mandal, & Others** ...Defendant

**To,**
**All Concerned** ... Defendants

Whereas the above named Plaintiffs filed the above suit to declare them as Legal Heirs of Late Dr. D.L.N. Prasad, and the suit is posted to 10/04/2026 for your appearance at 10:30 A.M. before the Hon'ble Court, in person, failing which the matter will be decided on merits.

**// BY ORDER OF THE COURT//**

Sd/-
**A.GOVINDA REDDY**
**C. RAMA SUBBA REDDY**
**Advocate**
**#1-9-285/1/B, Vidyanagar,**
**Hyderabad – 500 044 Mobile No. 9441885086**
**Counsel for the Plaintiffs**

# చక్కని ఆరోగ్యం

## ఉంగరాల జుట్టు.. సంరక్షణ ఇలా!



జుట్టు సిల్కీగా ఉన్న వారికి కర్లీగా ఉంటే బాగుంటుందని పిస్తుంది.. అదే కర్లీ హెయిర్ ఉన్న వాళ్లేమో 'ఈ చింపిరి జుట్టు నా వల్ల కాదు బాబోయ్..' అంటూ సిల్కీ జుట్టును కోరుకుంటారు. నిజానికి ఎవరి జుట్టు తత్వం వారికి నచ్చదు.. అయితే ఉంగరాల జుట్టు సాధారణంగానే పొడిగా ఉంటుంది.. దాంతో నిర్జీవంగా కనిపిస్తుంది.. మెయింటెయిన్ చేయడం కూడా కొందరికి కష్టంగా అనిపిస్తుంటుంది. ఇలాంటప్పుడు కొన్ని సింపుల్ చిట్కాలు పాటిస్తే కర్లీ హెయిర్‌నూ అందంగా కనిపించేలా చేయచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..! కొంతమందికి రోజూ తలస్నానం చేయడం అలవాటు. కర్లీ హెయిర్ ఉన్న వారూ కొందరు ఇలాగే చేస్తుంటారు. దీనివల్ల జుట్టు మరింత పొడిబారుతుందంటున్నారు నిపుణులు. కాబట్టి, జుట్టు తత్వాన్ని బట్టి వారానికి రెండు నుంచి మూడుసార్లు మాత్రమే తలస్నానం చేయాలంటున్నారు. అది కూడా గాఢత తక్కువగా ఉండే షాంపూని నీళ్లలో కలుపుకొని చేయడం మంచిదని చెబుతున్నారు. తలస్నానం తర్వాత నాణ్యమైన కండిషనర్‌ను రాయడం మర్చిపోవద్దు. ఇది కేశాలు పొడిబారిపోకుండా చేస్తుంది. అలాగే తలస్నానానికి వేడి నీళ్లు కాకుండా గోరువెచ్చటి లేదంటే చల్లటి నీళ్లు ఉపయోగించడం మంచిదట.

కర్లీ హెయిర్ సంరక్షణ కోసం వారానికి మూడుసార్లు నూనె పెట్టుకోమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కొబ్బరి నూనెను కుదుళ్లు, వెంట్రుకలకు అప్లై చేసి కాసేపు మర్దన చేయాలి. ఇలా రాత్రుళ్లు నూనె పెట్టుకొని మరుసటి రోజు ఉదయాన్నే తలస్నానం చేస్తే జిడ్డుగా కూడా అనిపించదని చెబుతున్నారు. ఒకవేళ ఇలా నూనె పెట్టుకున్న మరుసటి రోజు తలస్నానం చేయకపోతే.. జెల్ ఆధారిత కండిష నర్‌ని కొద్దిగా తీసుకొని జుట్టుకు పట్టించాలి. ఇలా చేయడం ద్వారా నూనె వల్ల జుట్టు జిడ్డుగా అనిపించకుండా జాగ్రత్తపడచ్చు. తడిగా ఉన్న జుట్టును దువ్వడం, టవల్‌తో గట్టిగా రుద్దుతూ తుడవడం.. వంటివి అస్సలు చేయకూడదు. ఎందుకంటే ఇవి జుట్టు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. మెత్తటి కాటన్ క్లాత్‌తో జుట్టును పొడిగా తుడుచుకొని.. ఆరిన తర్వాత చెక్క దువ్వెనతో చిక్కు తీసుకోవడం మంచిదట. తడిగా ఉన్న కర్లీ హెయిర్‌ను బిగుతుగా జడ వేసుకోవడం లేదంటే ముడేయడం.. వంటివి చేస్తే జుట్టు చివర్లు చిట్లిపోయే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. కాబట్టి జుట్టును ముడేసే ముందు సహజసిద్ధంగా ఆరనివ్వడం ఉత్తమం. షియా బటర్, నువ్వుల నూనె.. వంటివి కర్లీ హెయిర్ సంరక్షణకు చక్కగా ఉపయోగపడతాయట. ఉంగరాల జుట్టు పొడిబారకుండా ఇంట్లోనే తయారుచేసుకునే హెయిర్ స్ప్రే కూడా చక్కగా పనిచేస్తుంది. ఈ క్రమంలో ఒక స్ప్రే బాటిల్‌లో డిస్టిల్డ్ వాటర్ నింపి అందులో కొన్ని చుక్కల చొప్పున వెజిటబుల్ ఆయిల్, రోజ్‌మేరీ ఆయిల్, లావెండర్ నూనె.. వేసి ఒకసారి షేక్ చేసి పెట్టుకోవాలి. దీన్ని జుట్టుపై అప్పుడప్పుడూ స్ప్రే చేస్తుండడం వల్ల మంచి ఫలితం ఉంటుందట. అలాగే నీళ్లు, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, నీటి శాతం ఎక్కువగా ఉండే కీరా, పుచ్చకాయ వంటి పండ్లు.. కాయగూరలు తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

## బాడీ లోషన్ రాస్తున్నారా..?



ఎప్పటికప్పుడు మారే వాతావరణం చర్మం పైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది. తద్వారా చర్మం పొడిబారి నిర్జీవంగా మారుతుంది. అయితే చర్మంలో తేమని నిలిపి ఉంచడానికి ఏదో ఒక క్రీమ్/బాడీ లోషన్ రాసుకుంటే సరిపోతుందనుకుంటారు చాలా మంది. కానీ వీటిలో కూడా చర్మ తత్వానికి నప్పే లోషన్లను ఎంచుకోవడం ముఖ్యమంటున్నారు నిపుణులు. అలాగే వీటిని ఉపయోగించే క్రమంలోనూ పలు జాగ్రత్తలు పాటించాలంటున్నారు. అప్పుడే ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ముఖానికి లేదా చర్మానికి క్రీమ్‌లు, లోషన్లు.. మొదలైనవి రాసుకునే ముందు చర్మాన్ని శుభ్రం చేసుకోవడం తప్పనిసరి. అలాగే చర్మం కాస్త తడిగా ఉన్నప్పుడే వాటిని రాసుకోవాలి. అప్పుడే అది చర్మ గ్రంథుల్లోకి చేరే అవకాశం ఉంటుంది. తద్వారా చర్మం తేమను కోల్పోకుండా జాగ్రత్తపడచ్చు. క్రీమ్ లేదా బాడీ లోషన్స్ ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా.. స్నానం చేసిన వెంటనే రాసుకోవాలి. ఎందుకంటే ఆ సమయంలో చర్మంలో తేమ ఎక్కువగా ఉండడం వల్ల లోషన్ రాసుకుంటే మంచి ఫలితం ఉంటుందట. అలాగే స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టిన తర్వాత కూడా తప్పకుండా క్రీమ్ లేదా బాడీ లోషన్ రాసుకోవాలి. లేదంటే నీటిలో ఉండే క్లోరిన్ వల్ల చర్మం మరింత పొడిగా మారే ప్రమాదం ఉంటుంది. అలాగే చర్మం కాస్త వేడిగా ఉన్నప్పుడే క్రీమ్ లేదా లోషన్స్ రాసుకుంటే అవి చర్మంలోకి సులభంగా ఇంకుతాయంటున్నారు నిపుణులు. అందుకే క్రీమ్ లేదా లోషన్ రాసుకునే ముందు చర్మం చల్లగా అనిపిస్తే.. గోరువెచ్చని నీళ్లలో ముంచిన టవల్‌తో తుడుచుకొని ఆపై లోషన్‌ను చర్మానికి అప్లై చేసుకోవాలంటున్నారు. పొడిబారి నిర్జీవంగా మారిపోయిన చర్మానికి క్రీమ్ లేదా లోషన్ రాసుకోవడం వల్ల అది తేమను సంతరించుకోవడంతో పాటు పునరుత్తేజితం అవుతుంది. బాడీ లోషన్ చర్మంపై ఉన్న మచ్చల్ని క్రమంగా తగ్గించడానికీ ఉపయోగపడుతుంది. అలాగే బాడీ లోషన్ వెదజల్లే పరిమళాలు మానసిక ప్రశాంతతనూ అందిస్తాయి. గరుకుగా ఉండే చర్మ భాగాలపై తరచుగా క్రీమ్ లేదా లోషన్స్ అప్లై చేయడం వల్ల కొన్నాళ్లకు అవి మృదువుగా మారతాయంటున్నారు నిపుణులు.

## పాలిచ్చే తల్లులూ ఇవి తినండి!



మాతృత్వం ప్రతి మహిళకూ ఓ గొప్పవరం. తల్లిపాలు... పిల్లలకు అమృతం. కానీ, చాలామంది అమ్మలకు అవి సరిపడినంతగా ఉండకపోవచ్చు. ప్రసవమయ్యాక పథ్యం పేరుతో పోషకాలను తీసుకోకుండా ఉంటే... పిల్లలకూ అందవు. అందుకే, సమతులాహారాన్ని ఎంచుకోవాలి. పాలు పడటానికీ, పోషకాలు అందడానికీ కీలకమైన విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలి. ముఖ్యంగా పాలకూరలో ఎక్కువ మోతాదులో ఐరన్ దొరుకుతుంది. దీన్ని ఉడికించి తినడం మంచిది. లాక్టేషన్‌కి సాయపడే వాటిల్లో క్యారెట్ ఒకటి. దీనిలో ఎక్కువ మొత్తంలో లభించే విటమిన్ ఎ పాపాయి ఎదుగుదలలోనూ కీలంగా పనిచేస్తుంది. సొరకాయ, బీరకాయ వంటివాటిల్లో 90-95శాతం నీరు ఉంటుంది. ఇవి సహజంగా తేమనందించే ఆహారం. పాలు పడటానికి శరీరంలో నీటి స్థాయి కూడా చాలా కీలకం. నీరు తక్కువగా ఉంటే పాల ఉత్పత్తి తగ్గుతుంది. బీరకాయ, సొరకాయ వంటివి తినడం వల్ల నీటితో పాటు ఎలక్ట్రొలైట్స్ కూడా లభిస్తాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పైగా వీటిల్లో తక్కువ కెలోరీలు ఉంటాయి. బరువు నియంత్రణలో సాయపడతాయి. ఎ, సి విటమిన్లు, పొటాషియం, మెగ్నీషియం వంటి మినరల్లు కూడా తగినంతగా లభించడం వల్ల రోగనిరోధకత మెరుగుపడుతుంది. వీటితోపాటు చిలగడదుంపలు, గుమ్మడి, టొమాటోలు, తృణధాన్యాలు, ఓట్స్, వెల్లుల్లి, పచ్చిబొప్పాయి వంటివీ మేలు చేస్తాయట.

## చేతులు నాజూగ్గా మారాలంటే!



బరువు తగ్గాలనేది కొందరి ఆలోచన అయితే... మరికొందరు మహిళలు మాత్రం చేతులు నాజూగ్గా కనిపించాలనుకుంటారు. ఇవి సన్నగానే కాదు... బలంగానూ ఉండాలి. అందుకోసమే ఈ వ్యాయామాలు... కుర్చీతో... బలమైన కుర్చీని తీసుకోండి. దాని అంచుల్ని పట్టుకుని మీరూ అక్కడే కూర్చోండి. ఇప్పుడు మీ కాళ్లను ముందుకు చాచి, మెల్లగా కుర్చీ నుంచి కిందకి రావాలి. ఈ సమయంలో మీ బరువంతా చేతుల మీద ఉండాలి. తిరిగి మళ్లీ పైకి లేవాలి. ఇలా రోజులో పది సార్లైనా చేస్తూ ఉండండి. వీటినే 'చెయిర్ డిప్స్' అంటారు. ఇవి భుజాలు, చేతుల దగ్గర ఉన్న కొవ్వుని తగ్గిస్తాయి. బలంగానూ మారుస్తాయి. చున్నీతో... రెసిస్టెన్స్ బ్యాండ్‌లా చున్నీని ఉపయోగించి చేతుల్ని టోన్ చేయవచ్చు. చున్నీ కొనలను రెండు చేతులతో పట్టుకుని తల వెనక్కీ ముందుకీ తీసుకురండి. ఇలా కనీసం ఓ పదిహేను సార్లు చేయండి. క్రమంగా ఫలితం మీకే కనిపిస్తుంది. నీళ్ల సీసాలతో... రెండు చేతుల్లో లీటరు బరువున్న నీళ్ల సీసాలను పట్టుకుని పక్కకు చాచండి. అలా చాచిన చేతులను చిన్నగా సవ్యదిశలో 50 సార్లు, అపసవ్యదిశలో 50 సార్లు తిప్పాలి. ఇలా తిప్పడం వల్ల మీ భుజాలు, చేతుల దగ్గరున్న కొవ్వు తగ్గి, బలంగా మారుతాయి.

## పింక్ కాఫీ... ప్రయోజనాలెన్నో!



'కొంచెం కాఫీ తాగితే ఎంత హాయిగా ఉంటుందో..!' కాఫీ ప్రియులు తరచూ చెప్పే మాట ఇది. మూడ్‌ని ఉల్లాసంగా మార్చే దీంతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అంతేనా కాఫీ తాగేవారు ఎక్కువకాలం జీవిస్తునట్లు అధ్యయనాలు వెల్లడించాయి. కాఫీల్లో చాలా రకాలే ఉన్నప్పటికీ ఈసారి పింక్ కాఫీని ప్రయత్నించమంటున్నారు పోషకాహార నిపుణులు. దీనిలో ఉండే ఐరన్, ఫోలెట్‌లు మహిళల్లో అనీమియాని తగ్గిస్తుందట. నెలసరి సమయంలో అలసటను మాయం చేసి తక్షణ శక్తినిస్తుందీ కాఫీ. అంతేకాదు, ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్నీ మెరుగుపరుస్తాయి. దీన్ని తాగడం వల్ల డోపమైన్ విడుదలై ఒత్తిడి తగ్గుతుందని చెబుతున్నారు నిపుణులు. దీని తయారీ కోసం ఒక టీస్పూన్ బీట్‌రూట్ పొడిని వేడినీటిలో కలిపి చిక్కని డికాక్షన్ సిద్ధం చేసుకోవాలి. తరవాత దానిలో అరటీస్పూన్ కాఫీ పొడి, వేడి లేదా చల్లని పాలు రుచికి సరిపడా తేనె లేదా బెల్లం కలుపుకోవాలి. అంతే పింక్ కాఫీ రెడీ. అయితే గర్భిణులు మాత్రం దీన్ని కూడా మితంగానే తీసుకోవాలంటున్నారు నిపుణులు.

## వీటికీ ఎక్స్‌పైరీ ఉంటుంది..!



చాలావరకు తినే ఆహార పదార్థాల విషయంలోనే తయారీ, గడువు తేదీల్ని ఒకటికి రెండుసార్లు పరిశీలిస్తుంటాం. అదే.. రోజూ వాడే వస్తువులకూ ఎక్స్‌పైరీ ఉంటుందన్న విషయం విస్మరిస్తుంటాం. నెలసరి సమయంలో ఉపయోగించే శ్యానిటరీ ఉత్పత్తులూ ఇందుకు మినహాయింపు కాదు. అయితే ఈ నిర్లక్ష్యమే జననేంద్రియాల్లో ఇన్ఫెక్షన్లకు కారణమవుతుందని చెబుతున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో శ్యానిటరీ ఉత్పత్తుల గడువు తేదీ గురించి కొన్ని విశేషాలు తెలుసుకుందాం..! నెలసరి సమయంలో పరిశుభ్రతను పాటించేందుకు ప్రస్తుతం వివిధ రకాల శ్యానిటరీ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. న్యాప్కిన్లు, మెన్‌స్ట్రువల్ కప్స్/డిస్కులు, ట్యాంపన్స్.. వంటి వాటిని ఎక్కువగా ఉపయోగిస్తుంటాం. అయితే వీటిని కొనుగోలు చేసే క్రమంలో చాలామంది ప్యాకెట్లపై ఉండే తయారీ, గడువు తేదీల్ని పట్టించుకోరు. ఎందుకంటే ఇవి శరీరానికి బయట వాడే ఉత్పత్తులు కాబట్టి ప్రమాదమేమీ ఉండదన్నది చాలామంది ఆలోచన. కానీ అన్ని వస్తువుల్లాగే వీటికీ ఎక్స్‌పైరీ ఉంటుందని, దాన్ని పరిగణనలోకి తీసుకొనే వాటిని ఎన్ని రోజులు వాడాలో పరిశీలించుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో.. శ్యానిటరీ న్యాప్‌కిన్ల ప్యాకెట్లపై తయారీ తేదీ రాసి ఉంటుంది.. దాని కిందే ఎప్పటిలోగా వాడాలో కూడా రాసి ఉంటుంది. కాబట్టి ఈ విషయాన్ని దృష్టిలో ఉంచు కొని ఎప్పటికప్పుడు కొత్తగా తయారైన న్యాప్‌కిన్లనే కొనుగోలు చేయడం మంచిది. సహజసిద్ధమైన ఉత్పత్తులతో తయారుచేసిన ట్యాంపన్లను.. ఎక్కువ కాల మే వాడచ్చంటున్నారు నిపు ణులు. అలాగని ఏళ్ల తరబడి మూలన పడి ఉన్న ట్యాంపన్లను అస్సలు ఉపయోగించకూడదట! ఎందుకంటే అవి చూడ్డానికి తాజాగానే కనిపించినా.. వాటిపై సూక్ష్మ క్రిములు పెరిగి హాని కలిగించే ప్రమాదం ఉందంటున్నారు. ఈ క్రమంలో ఎక్స్‌పైరీ తేదీని పరిశీలించడమూ మర్చిపోవద్దు. చాలావరకు మెన్‌స్ట్రువల్ కప్స్ తిరిగి ఉపయోగించే విధంగానే ఉంటాయి. అయి తే వీటి నాణ్యత, మనం పాటించే పరిశుభ్రతను బట్టి కూడా ఇది ఆధారపడి ఉంటుంది. ఈ క్రమంలో వీటి లేబుల్‌ని ఓసారి పరిశీలించడం ముఖ్యమంటున్నారు నిపుణులు. శ్యానిటరీ ఉత్పత్తుల్ని కొనే క్రమంలో.. ప్యాకెట్ కొత్తగా ఉందా, లేదా అనేది పరిశీలిస్తుంటాం.. కానీ దాని ఎక్స్‌పైరీ తేదీపై మన దృష్టి పడదు. అయితే కొన్నిసార్లు ప్యాకెట్ కొత్తగా ఉన్నా.. గడువు తేదీ ముగియడం వల్ల వాటిపై సూక్ష్మ క్రిములు వృద్ధి చెందే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి వాటిని ఉపయోగించడం వల్ల జననేంద్రియాల్లో ఫంగల్ ఇన్ఫెక్షన్ల ముప్పు పెరుగుతుంది అంటున్నారు నిపుణులు. అందుకే కోరి సమస్యను కొని తెచ్చుకునే కంటే.. కొనుగోలు చేసేటప్పుడే తయారీ-గడువు తేదీల్ని పరిశీలించడం, సరిగ్గా ప్యాక్ చేసిన వాటినే కొనడం మంచిదని గుర్తు పెట్టుకోవాలంటున్నారు.

## అందుకే నేలపై కూర్చొని తినాలట!



ఈ రోజుల్లో నేల మీద కూర్చొని భోజనం చేసేవారు చాలా తక్కువమందే! కానీ కుర్చీ కంటే నేలపై కూర్చొని తినడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. కాళ్లు ముడుచుకొని నేల మీద కూర్చోవడం వల్ల ఆరోగ్యపరంగా పలు ప్రయోజనాలు చేకూరతాయని చెబుతున్నారు. అవేంటో తెలుసుకుందాం రండి..

కండరాలు దృఢంగా! నేల మీద కూర్చొని తినడం చాలా సౌకర్యంగా ఉంటుంది. అలాగే దీనివల్ల పొట్ట చుట్టూ ఉండే కండరాల్లో నొప్పి ఉంటే తొలగిపోయే అవకాశం ఉంటుందట. ఇలా రోజూ కింద కూర్చొని తినడం అలవాటు చేసుకుంటే కండరాల్లో కదలిక పెరిగి అవి ఫ్లెక్సిబుల్‌గా, దృఢంగా మారతాయి. అలాగే ఈ భంగిమ వివిధ రకాల శారీరక నొప్పుల నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుందంటున్నారు నిపుణులు. కింద కూర్చొని నేలపై ప్లేట్ పెట్టుకుని తినడం వల్ల జీర్ణక్రియ సాఫీగా సాగుతుందంటున్నారు నిపుణులు. ఈ ప్రక్రియలో భోజనం నోట్లో పెట్టుకోవడానికి ముందుకు వంగడం, తిరిగి వెనక్కి రావడం.. ఇలా వెంటవెంటనే చేసే భంగిమల వల్ల ఆహారం జీర్ణం కావడానికి అవసరమైన ఆమ్లాలు శరీరంలో ఉత్పత్తవుతాయట. తద్వారా జీర్ణ సంబంధిత సమస్యలు రాకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే శరీరానికి కావాల్సిన శక్తి కూడా అందుతుంది. నేలమీద కూర్చొని భోంచేయడం వల్ల బరువు కూడా తగ్గచ్చట! అదెలాగంటే.. సాధారణంగా మనకు సరిపోయేంత తిన్నామా? లేదా? అనే విషయం తెలియడానికి పొట్ట నుంచి మెదడుకు సిగ్నల్స్ అందించే నాడి ఒకటి ఉంటుంది. డైనింగ్ టేబుల్‌పై తినడం కంటే కింద కూర్చొని తినడం వల్ల ఈ నాడి మరింత సమర్థంగా పనిచేస్తుందట! కాబట్టి మనకు సరిపోయేంత ఆహారం మాత్రమే తీసుకుంటాం.. ఫలితంగా బరువును అదుపులో ఉంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఒకసారి మీ కుటుంబ సభ్యులందరితో కలిసి హాయిగా కింద కూర్చొని తినండి.. మనసుకు ఎంత ప్రశాంతంగా ఉంటుందో మీకే అర్థమవుతుంది. ఇది పరోక్షంగా అనుబంధాల్నీ పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు.



# 13న ధురంధర్ ది రివెంజ్ రీరిలీజ్

మార్చి 19న అభిమానులు సీక్వెల్ కోసం సిద్ధమవుతున్నందున గ్లోబల్ బ్లాక్‌బస్టర్ ఇంటర్నేషనల్ రీరిలీజ్ కోసం సిద్ధంగా ఉంది. ధురంధర్ తుఫాను ఇంకా ముగియలేదు. మార్చి 19న ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ధురంధర్ ది రివెంజ్ విడుదలకు ముందు, జియో స్టూడియోస్, బి62 స్టూడియోస్ ప్రపంచవ్యాప్తంగా దాదాపు 500 స్క్రీన్‌లలో అరుదైన థియేట్రికల్ రీరిలీజ్‌లో ప్రపంచవ్యాప్తంగా ధురంధర్‌ను తిరిగి స్క్రీన్ పైకి తీసుకువస్తున్నాయి. వీటిలో మార్చి 12 (నేడు) నుంచి భారతదేశం అంతటా 250 స్క్రీన్‌లు, విదేశాలలో 250 స్క్రీన్‌లు మార్చి 13 నుంచి ప్రదర్శనలు ప్రారంభమవుతున్నాయి. ఈ ఫ్రాంచైజ్ అభిమానులకు ఇది ప్రత్యేకమైన అవకాశం. మొదటి భాగాన్ని మళ్లీ థియేటర్‌లో చూసి, కొన్ని రోజుల తర్వాతే వచ్చే సీక్వెల్ ధురంధర్: ది రివెంజ్ ను బిగ్ స్క్రీన్ పై ఎక్స్ పీరియన్స్ చేసే అవకాశం లభించనుంది. స్పైయాక్షన్ జానర్‌కు కొత్త ప్రమాణాలు సృష్టించిన ఈ సినిమా మళ్లీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది.




## అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ కొత్త కమిటీల ఏర్పాటు



అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సంస్థను బలోపేతం చేస్తూ ప్రకాశం, కృష్ణా, పశ్చిమ గోదావరి మరియు గుంటూరు జిల్లాలకు కొత్త కమిటీలను ఏర్పాటు చేశారు. అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ శివ కుమార్ గారు నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గారి "ప్రతి సంవత్సరం ఒక మంచి పని" సందేశాన్ని ముందుకు తీసుకెళుతూ సమాజ సేవా కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు తెలిపారు.

## ఆకట్టుకుంటున్న కార్మేని సెల్వం టీజర్



పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపీ, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయణ్ వి, హరిత పరాకోడ్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతుంది. ఆధునిక కాలానికి అనుసంధానమైన ఈ కథ ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో మంచి ఆసక్తిని పెంచగా.. గురువారం తెలుగు టీజర్ ను రిలీజ్ చేసింది చిత్ర యూనిట్.

"డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలు ఉన్నాయి" అని సముద్రఖని వాయిస్ ఓవర్ తో ప్రారంభమైన టీజర్ సినిమాపై క్యూరియాసిటిని పెంచుతుంది. అధిక ఖర్చులు, భారీ లోన్లు, క్రిప్టో పెట్టుబడులు, త్వరగా ధనవంతులు కావాలనే ఆశతో చేసే ప్రయత్నాలు వంటి విషయాలను వివిధ కోణాల్లో చూపిస్తూ నేటి సమాజంలో డబ్బు పట్ల ఉన్న ఆలోచనలను చూపించిన విధానం ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఈఎంఐలు, క్రెడిట్ కార్డ్ ఆధారిత జీవనశైలి, డబ్బు కోసం మనుషులు తీసుకునే నిర్ణయాలు కథలో కీలక పాత్ర పోషించబోతున్నాయని అర్థమవుతుంది. సముద్రఖని కుటుంబంతో కనిపించే సన్నివేశాలు హృదయానికి హత్తుకునేలా ఉంటాయి. లక్ష్మీ ప్రియా చంద్రమౌళి ఆయన భార్యగా, చిన్న కుమారుడితో కుటుంబ జీవితం చూపిస్తుండగా, మరోవైపు విదేశాల్లో ఒంటరిగా కనిపించే కొన్ని షాట్లు కథపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. గౌతమ్ వాసుదేవ్ మీనన్ పాత్రను గోప్యంగా ఉంచడం కూడా ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతోంది.

# 40 సంవత్సరాల స్వాతిముత్యం



'కళాతపస్వి' కె విశ్వనాథ్, అభిరుచి గల నిర్మాత ఏడిద నాగేశ్వరరావు ల కలయికలో పూర్ణోదయ సంస్థ లో వచ్చిన చిత్రాలన్నీ ఆణిముత్యాల్లాగ చిరంజీవిగా నిలిచిపోయాయి. వాటిల్లో 'స్వాతిముత్యం' ఒక ఆణిముత్యంగా ఎన్నదగినది. ఈ సినిమా విడుదలై నేటికి 40 సంవత్సరాలు పూర్తి చెసుకున్నది . దృశ్యకావ్యంగా రూపుదిద్దుకున్న గొప్ప కుటుంబ కథాచిత్రంగా 'స్వాతిముత్యం' అవార్డులతోపాటు అప్పటికి బాక్సాఫిస్ రికార్డ్స్ ని బ్రేక్ చెసింది .

1986,మార్చి 13 వ తేదీ విడుదలైన ఈ సినిమా భారత దేశం తరపున ఆస్కార్ ఎంట్రీని పొందింది. ఆనాడే 'స్వాతిముత్యం' ఆస్కార్ ఎంట్రీతో పాటు ఏషియన్ పెసఫిక్ చిత్రోత్సవంలొ ఉత్తమ నటుడి అవార్డు , ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ పురస్కారంతో పాటు బంగారు నందిని కూడా అందుకుంది.దర్శకత్వ విభాగంలో ఫిల్మ్ ఫేర్ విజేతగా నిలిచింది.

**కమల్ హాసన్ నటన**

గత నలభై ఏళ్లుగా ఈ పాత్రపై వచ్చిన ప్రశంసలు అతిశయోక్తి అనిపించవు. కమల్ హాసన్ సాధారణ నటన పద్ధతులను అనుసరించలేదు. ఆయన శరీర భాష, స్పందన, భావప్రకటన అన్నింటినీ పూర్తిగా మార్చుకున్నారు. ఈ పాత్రకు ఆయనకు రెండో నంది అవార్డు (ఉత్తమ నటుడు) మరియు ఆసియాపసిఫిక్ ఫిల్మ్ ఫెస్టివల్ ఉత్తమ నటుడు అవార్డు లభించాయి. తర్వాతి ఇంటర్వ్యూలలో, 1994లో వచ్చిన హాలీవుడ్ చిత్రం ఫారెస్ట్ గంప్ తో పోలికలపై స్పందిస్తూ, శివయ్య పాత్ర ముందే వచ్చిందని కమల్ హాసన్ పేర్కొన్నారు. ఈ అంశంపై వాదనలు ఉన్నప్పటికీ, కాలక్రమం మాత్రం స్పష్టమే. రాధిక,నిర్మలమ్మ పోటీపడి నటించారు.గొల్లపూడి, శరత్ బాబు, ఏడిద శ్రీరాం, జెవి సోమయాజులు, దీప, వై.విజయ, మొదలైన నటీనటులు వాళ్ళ పాత్రలకు జీవం పోశారు. ఎమ్ వి రఘు ఛాయాగ్రహణం సహజత్వానికి అద్దం పట్టింది. ఏడిద రాజా ఈ చిత్రానికి ఎగ్జ్ క్యూటివ్ ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు. రష్యన్ భాషలోకి అనువదించి అక్కడ కూడా విజయవంతమైనది. సంప్రదాయం,సంచలనం,సంగీతం,సాహిత్యం రంగరించుకున్న ఈ చిత్రం తమిళం లో సిప్పిక్కుల్ ముత్తు. కన్నడలో కిచ్చ సుదీప్ హీరోగా స్వాతిముత్తు , హిందీలో అనిల్ కపూర్ ఈశ్వర్ గా నిర్మాణమై దేశవ్యాప్తంగా సంచలన విజయాలను సొంతం చేసుకుంది. ఆత్రేయ,సినారె,సిరివెన్నెల గీతాలు ప్రేక్షకులను రసవృష్టిలో ముంచిముద్దచేశాయి. పసిడికి తావి అబ్బినట్లు ఆ కవుల కలం నుంచి జాలువారిన స్వర్ణాక్షరాలకు ఇళయరాజా రసరమ్యమైన సుస్వరాలతో పాటు అద్భుతమైన నేపధ్య సంగీతం ఈ చిత్ర విజయానికి జత చేరాయ. అమాయకుడిగా కమల్ హాసన్ పాత్ర భారతీయ సినిమాల్లో చిరంజీవిగా నిలిచిపోయింది.

ఆంధ్రప్రదేశ్, తమిళ నాడు,కర్ణాటక లోని అనేక ప్రాంతాల్లో చిత్రీకరణ జరిగింది. స్వాతిముత్యం విడుదలై ఇన్నేళ్లయినా వన్నె తగ్గని మేలిముత్యంలా మెరిసిపోతోంది.










# ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి కాలరే ఎత్తరా



'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు ఈ చిత్రం నుంచి విడుదలైన ప్రతి పాట, టీజర్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకున్నాయి. ఆ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ తాజాగా చిత్రబృందం మూడో గీతం 'కాలరే ఎత్తరా'ను విడుదల చేసింది. గురువారం సాయంత్రం అభిమానుల కోలాహలం నడుమ హైదరాబాద్ లోని మైత్రి విమల్ థియేటర్ లో ఈ గీతావిష్కరణ వేడుక వైభవంగా జరిగింది.

'కాలరే ఎత్తరా' పాట విడుదలతో సినిమాపై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. భారీ స్థాయిలో రూపొందించిన ఈ పాటలో భారీ సెట్‌లు, కట్టిపడేసే విజువల్స్, అద్భుతమైన ఎనర్జీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ తన ప్రత్యేకమైన స్టైల్, ఎనర్జీ, డ్యాన్స్ స్టెప్పులతో తెరపై వెలుగులు నింపారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ డాక్యుమెంటరీకి గద్దర్ అవార్డ్

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ జాతి పితగా పిలుచుకునే కొండా లక్ష్మణ్ బాపూజీపై యువ దర్శకుడు బడుగు విజయ్ కుమార్ రూపొందించిన డాక్యుమెంట్రీ ఫిల్మ్ యూనిటి. ది మ్యాన్ ఆఫ్ సోషల్ పేరుతో చిరందాస్ శ్రీకాంత్ నిర్మించిన ఈ డాక్యుమెంటరీ ఫిల్మ్ కు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల్లో తొలి స్థానం స్థానం దక్కింది. 2025 సంవత్సరానికి గాను వెల్లడించిన గద్దర్ ఫిల్మ్ అవార్డుల్లోని డాక్యుమెంటరీ విభాగంలో తొలి ఉత్తమ డాక్యుమెంటరీగా గద్దర్ అవార్డును సొంతం చేసుకుంది. డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్స్ కు జ్యూరీ ఛైర్మన్ గా ఉన్న ప్రముఖ దర్శకులు విజయ్ కనకమేడల ఎఫ్ డీసీ కార్యాలయంలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.




## 13న జానకి వర్సెస్ కేరళ విడుదల



కాస్మోస్ ఎంటర్టైన్మెంట్ ప్రెజెన్స్ మరియు కార్తీక్ క్రియేషన్స్ బ్యానర్ పై మలయాళంలో అనుపమ పరమేశ్వరన్, సురేష్ గోపి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన కోర్ట్ రూమ్ డ్రామా చిత్రం జానకి వర్సెస్ కేరళ (జె.ఎస్. కె ) తెలుగులో ఈ సినిమా మర్చి 13న విడుదల కాబోతోంది. ఎంజి మూవీస్ ద్వారా అచ్చిబాబు ఈరోజు సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ట్రైలర్ ఇటీవల విడుదలైంది. ఇందులో కథానాయిక జానకి విద్యాధరన్ (అనుపమ పరమేశ్వరన్) పై జరిగే లైంగిక దాడి, ఆ తర్వాత ఆమె న్యాయానికి కోసం చేసే పోరాటం ప్రధాన ఇతివృత్తంగా కనిపిస్తుంది. ఇది సమాజంలో మహిళల ఎదుర్కొంటున్న సమస్యలను హైలైట్ చేస్తూ, చట్ట వ్యవస్థపైనా ఓ బలమైన సందేశం ఇస్తుందని అర్థమవుతోంది. ఈ చిత్రంలో దివ్య పిళ్లై, శృతి రామచంద్రన్, అస్కర్ అలీ, మాధవ్ సురేష్ గోపి, బైజు సంతోష్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. కాస్మోస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై జె. ఫణీంద్ర కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఎం. అచ్చిబాబు మాట్లాడుతూ.... మంచి కాన్సెప్ట్ తో వస్తోన్న ఈ సినిమాను తెలుగు ప్రేక్షకులు తప్పకుండ ఆధరిస్తారన్న నమ్మకం ఉంది, ఎన్నో న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొని ఈ సినిమా చివరికి విడుదల కాబోతోంది, ఈ చిత్ర నిర్మాత జాస్తి పనిద్ర కుమార్ గారికి అలాగే ఈ అవకాశం కల్పించిన దర్శకునికి నటీ నటులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఏప్రిల్ 10న డెకాయిట్

బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్ లో డెకాయిట్ 'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'డెకాయిట్' ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మేకర్స్ మూవీ సెట్ లో షూట్ ర్యాప్ ప్రెస్ మీట్ నిర్వహించారు.




## దీవాన టీజర్ రిలీజ్

శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "దీవాన". స్నేహ మణి మేగలై హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయమవుతోంది. ఈ చిత్రాన్ని అర్వ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి రూపొందిస్తున్నారు. "దీవాన" సినిమా ఈ వేసవికి గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు "దీవాన" సినిమా టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే మణిరత్నం సినిమా ఫీల్ కలుగుతోంది. ఈ టీజర్ ఎలా ఉందో చూస్తే ఓ పెళ్లి వేడుకల్లో హీరోయిన్ ను చూసి లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అన్నట్లు ప్రేమలో పడతాడు హీరో. అప్పటి నుంచి ఆ అమ్మాయే లోకంగా బతుకుతుంటాడు. ఆ అమ్మాయి తరుపు వాళ్లతో ప్రమాదమని స్నేహితులు చెప్పినా వినిపించుకోడు. ఇంతే ప్రేమ అమ్మాయి నుంచి కూడా ఈ అబ్బాయికి దక్కిందా లేదా అనేది థియేటర్స్ చూడాలి. టీజర్ లోని 'ప్రేమ ఇది ప్రేమ గుండెల్లోన సడిరేపేదే ప్రేమ...' సాంగ్ బీజీఎం హార్ట్ టచింగ్ గా ఉంది. టీజర్ చివరలో 'ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తర ఈ పోరీలు, అది నీ పానం పీక్కతినకపోతే నన్ను అడుగురా..' అనే డైలాగ్స్ ఆసక్తి కలిగిస్తున్నాయి. "దీవాన" సినిమాలో ఒక ఇంటెన్స్ బ్యూటిఫుల్ మ్యూజికల్ లవ్ స్టోరీ చూడబోతున్నట్లు టీజర్ తో తెలుస్తోంది. టీజర్ చాలా ఇంపాక్ట్ క్రియేట్ చేస్తోంది. టీజర్ పూర్తయ్యాక కూడా పాట ఇంకా మదిలోనే తిరుగుతున్న అనుభూతి కలుగుతోంది. విజువల్స్ చాలా రియలెస్టిక్ గా బ్యూటిఫుల్ గా ఉన్నాయి. హీరో హీరోయిన్స్ జంట ఫ్రెష్ గా కనిపిస్తోంది. కొత్త హీరోయిన్ స్నేహ మణిమేగలై బ్యూటిఫుల్ గా కనిపించి ఆకట్టుకుంది.



## ఏప్రిల్ 30న పెద్ది రిలీజ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా పెద్ది పోస్ట్‌ప్రొడక్షన్, ప్రమోషనల్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. బుచ్చి బాబు సనా దర్శకత్వంలో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రం మరో ప్రత్యేకతను సొంతం చేసుకుంది. ఈ చిత్రం అత్యాధునిక డాల్బీ సినిమాస్ ఫార్మెట్‌లో కూడా విడుదల కానుంది. రామ్ చరణ్ మాస్ రగ్గడ్ అవతార్‌ను డాల్బీ సినిమాస్ ఫార్మెట్ లో చూడడం ప్రేక్షకులకు మరింత గ్రాండ్ ఎక్స్ పీరియన్స్ అందించనుంది. పెద్ది వంటి భారీ యాక్షన్, ఎమోషన్ కలిగిన సినిమాను డాల్బీ సినిమాస్ లో చూడడం ప్రేక్షకులకు పూర్తిగా లీనమయ్యే అనుభూతిని ఇవ్వనుంది.

ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్‌లో రామ్ చరణ్ రగ్డ్ అవతార్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. చేతిలో బ్యాట్ పట్టుకుని, ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్న ఆయన క్యారెక్టర్ సినిమాలో పవర్‌ఫుల్ యాక్షన్‌ను సూచిస్తోంది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.